RNI No.TELTEL/2005/16755
# ప్రజాబలం
PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక
Website: prajabalam.in




హైదరాబాద్ 12 ఆగస్ట్ 2026 బుధవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:64

## పాతబస్తీ మెట్రో పనులు వేగవంతం చేయాలి

## అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్ మెట్రో విస్తరణ రెండో దశలో భాగంగా పాతబస్తీ మెట్రో రైల్ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (ఊఓఖీఒ)పై ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి పలు ఆదేశాలిచ్చారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మెట్రో విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఈ కారిడార్లో పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియను ప్రారంభించాలన్నారు. పెండింగ్లో ఉన్న భూ సేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. హైదరాబాద్ మెట్రోకు పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్లను జత చేయాలని చెప్పారు. ఇందుకు అవసరమైన కోచ్ల కొనుగోలు ప్రక్రియకు చర్యలు తీసుకోవాలన్నారు.

మెట్రో ఫేజ్-2లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల కారిడార్కు సంబంధించి ప్రస్తుత సాంకేతికతపై ఢిల్లీ మెట్రోను సంప్రదించి, అవసరమైన సలహాలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సలహాదారులు రామకృష్ణారావు , ఎన్వీఎస్ రెడ్డి , మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ , అదనపు ఎండీ అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

## ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

## ఏర్పాట్లపై సీఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్ తెలంగాణలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించేలా డిసెంబర్లో నిర్వహించ తలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్కు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ సన్నద్ధతపై ముఖ్యమంత్రి గారు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యాపార రంగంలోని వివిధ సెక్టార్లలో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సమ్మిట్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గత ఏడాది నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతికి సంబంధించిన పూర్తి వివరాలను నివేదించాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ , సలహాదారులు రామకృష్ణారావు , ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### ట్యాంకర్ ఢీకొని ఐదుగురు కూలీల మృతి

వార్త 2 లో

## చేయూత కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

### గతంలో అమల్లో ఉన్న మార్గదర్శకాల ప్రకారమే కొత్త పింఛన్లు

### ఆగస్టు 31 వరకు దరఖాస్తుల స్వీకరణ

### అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పు లేదు



అర్హులైన పేదలు, బలహీన వర్గాలకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా చేయూత సామాజిక భద్రత పింఛన్ పథకం కింద కొత్త పింఛన్ల మంజూరుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తొలిదశలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నారు.

కొత్త పింఛన్ల కోసం అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పు చేయలేదు. గత ప్రభుత్వాల హయాంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న ఎలిజిబిలిటీ క్రైటీరియానే ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రామాణికంగా తీసుకుంటోంది. 2014 నుంచి 2018 మధ్య జారీ చేసిన సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల్లోని నిబంధనల ప్రకారమే అర్హతను పరిశీలిస్తారు.

ప్రజాపాలన వారోత్సవాలు, 99 రోజుల ప్రగతి ప్రణాళిక గ్రామసభలు, ప్రజావాణిలో ఇప్పటికే అందిన దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. గతంలో దరఖాస్తు చేసి, అవసరమైన అన్ని పత్రాలు సమర్పించిన వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. అవసరమైన పత్రాలు సమర్పించని వారు లేదా ఇప్పటి వరకు దరఖాస్తు చేయని అర్హులు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత నిర్ధారణ కోసం సంబంధిత శాఖల నుంచి అవసరమైన ధ్రువపత్రాలను పొందేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుంటారు. వితంతువులకు భర్త మరణ ధ్రువపత్రం, ఒంటరి మహిళలకు సెపరేషన్ లేదా స్థానిక విచారణ నివేదిక, గీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ ధ్రువీకరణ, చేనేత కార్మికులకు చేనేత-జౌళి శాఖ ధ్రువీకరణ, ఫైలేరియా బాధితులకు వైద్య ఆరోగ్య శాఖ ధ్రువీకరణ అవసరం.

దరఖాస్తుల పరిశీలన అనంతరం నిర్దేశిత అధికారులు క్షేత్రస్థాయిలో అర్హతను తనిఖీ చేస్తారు. ఆ తర్వాత అర్హుల జాబితాను జిల్లా స్థాయికి పంపి, జిల్లా కలెక్టర్ ఆమోదంతో పింఛన్ మంజూరు ప్రక్రియ పూర్తి చేస్తారు.

ప్రతి అర్హుడికి చేయూత అందించాలనే ఉద్దేశంతో స్వయం సహాయక సంఘాల సమాఖ్యలకు కూడా బాధ్యతలు అప్పగించారు. ముఖ్యంగా ప్రతి అర్హత కలిగిన వితంతువు, ఒంటరి మహిళకు దరఖాస్తు చేసుకోవడం, అవసరమైన ధ్రువపత్రాలు పొందడంలో సహకరించాలని సూచించారు. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను ఆగస్టు 31, 2026 వరకు స్వీకరిస్తారు. దరఖాస్తులతో పాటు వివరాలను చేయూత పోర్టల్లో నమోదు చేసే ప్రక్రియను కూడా వెంటనే చేపట్టనున్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా పారదర్శకంగా, నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. గతంలో ఉన్న అర్హత నిబంధనలనే కొనసాగిస్తూ, అర్హులైన వారికి సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రక్రియను వేగవంతం చేసింది.

# నిషేధిత భూములపై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందొద్దు

### చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం
### యుద్ధ ప్రాతిపదికన దరఖాస్తులను పరిష్కరించాలి
### ఈనెల 14లోగా అన్ని డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేయాలి
### అర్హులకు అన్యాయం జరుగదు
### ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో రాజీ లేదు
### సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలకు చెక్
### ఆన్‌లైన్‌లో ఉన్న వివరాల మేరకే నిర్ణయాలు
### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**

హైదరాబాద్ :- నిషేధిత ఆస్తుల పిఓబి / 22ఎ జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు.

కొత్తగా ఎలాంటి భూములను తమ ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చలేదని, గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న చట్టపరమైన సాంకేతిక చిక్కులను పరిష్కరించి బాధితులకు ఊరట కలిగిస్తామని స్పష్టం చేశారు.

భూముల రెగ్యులరైజ్‌కు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లే-అవుట్ల అనుమతులు తదితర వివరాలతో కూడిన అన్ని డాక్యుమెంట్లను ఈనెల 14వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. తద్వారా ఫోర్జరీ డాక్యుమెంట్లకు చెక్ పెట్టవచ్చని రిజిస్ట్రేషన్ సమయంలో సబ్ రిజిస్ట్రార్‌లకు స్పష్టత వస్తుందని, ఏది బోగస్ డాక్యుమెంట్, ఏది నిజమైన డాక్యుమెంట్ అనేదానిపై సూపర్ చెక్ చేసుకోవడానికి వీలుకలుగుతుందన్నారు. మరింత పారదర్శకత కోసం పహానీలు కూడా సబ్ రిజిస్ట్రార్‌కు ఏక్సెస్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో ఏది జెన్యూన్ ఏది కాదు గుర్తించి జెన్యూన్ ఉన్నవాటిని యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా ప్రజా కోణంలో ఆలోచించి కలెక్టర్లు నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. ఈ విషయంలో కలెక్టర్లు మరింత క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు.

మంగళవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో 22ఎ/ పిఓబి అంశంపై హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి కలెక్టర్లు, జిల్లా సబ్‌రిజిస్ట్రార్లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు.

22ఎకు సంబంధించి ప్రజావాణితో పాటు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులు ఎన్ని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో కూలంకషంగా చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ "సమస్య వచ్చినపుడు పరిష్కరించేదానికన్నా సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందన్నారు. పిఓబి దరఖాస్తులకు సంబంధించి కేస్‌బై కేస్ ప్రతి రోజూ సమీక్షించాలి. 22ఎ పేరిట ఉద్దేశపూర్వకంగా పేదోడికి అర్హులకు అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తే ఊరుకునేదిలేదు.

సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలు ఉండకూడదని అదనపు అధికారాలు వద్దని ఈ విషయంపై గతంలోనే చాలా స్పష్టత ఇచ్చాను. ఆన్‌లైన్‌లో ఏది ఉంటే దానికి ఆమోదం తెలిపేవరకే వారి అధికారాలను పరిమితం చేయాలని అధికారులను ఆదేశిస్తున్నాను. ప్రభుత్వ ఆస్తులను కాపాడే విషయంలో ఏమాత్రం రాజీపడే ప్రసక్తేలేదు. ఏ చిన్న తప్పుచేసినా క్షమించేదిలేదు, కఠిన చర్యలు తీసుకుంటాను. ఏదైనా సమస్య ఉంటే జిల్లా సబ్ రిజిస్ట్రార్‌లు కలెక్టర్ దృష్టికిగాని ఐజీ దృష్టికి గాని తీసుకురావాలి. పిఓబీ జాబితాలో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్‌లను గుడ్డిగా తిరస్కరించకుండా మూడు రోజుల సమయం తీసుకొని ఎందుకు తిరస్కరించవలసి వస్తుందన్న వివరాలను తెలియజేయాలి. పిఓబీకి సంబంధించి వచ్చిన ప్రతి దరఖాస్తును ఇకనుండి తహశీల్దార్‌కు పంపకుండా నేరుగా కలెక్టర్‌కే పంపించాలి. కలెక్టర్ నుండి డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ నుండి కలెక్టర్ మధ్యనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలి, గతంలో నాన్ అగ్రికల్చర్, అగ్రికల్చర్, పీఓబీ జాబితాలు వేర్వేరుగా ఉండేవి. వీటిని సమీకృతం చేయడం వలన సబ్ రిజిస్ట్రార్ పరిశీలనలో కొన్ని ఆస్తులు, నిషేధిత జాబితాలో ఉన్నట్లు కనిపిస్తున్నందున మొత్తం రిజిస్ట్రేషన్ ఆపుతున్నారని ఫిర్యాదుల వస్తున్నాయి. తాజాగా అప్‌లోడ్ చేస్తున్న సమాచారంతో సరిపోల్చుకొని నిర్ణయాలు తీసుకోవాలి.

ఈ రోజు సాయంత్రంలోగా నాలుగు జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ లతో సమావేశం నిర్వహించి ఉన్నత స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వారికి తెలియజేసి తక్షణం అమలుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ శాఖ ఐ.జి. ని ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ సెక్రెటరీ డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ ఐ.జి. రాజీవ్ గాంధీ హనుమంత్, ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్ లు పాల్గొన్నారు.

### జెనోమ్ వ్యాలీలో 'యామ్జెన్' అతి పెద్ద పరిశోధన కేంద్రం

వార్త 2 లో

ప్రజాబలం

12 ఆగస్ట్ 2026 బుధవారం

# ఖరీఫ్ కోలుకుంది... మరి రబీ

ఎల్‌నినో బలపడుతోంది.. జూన్‌లో వర్షాలు దారుణంగా పడిపోయాయి.. ఖరీఫ్ సాగు గతేడాదితో పోలిస్తే భారీగా వెనుకబడింది. దీంతో ఈ ఏడాది పంటల దిగుబడిపై ఆందోళన మొదలైంది. కానీ జూలైలో పరిస్థితి అనూహ్యంగా మారిపోయింది. నైరుతి రుతుపవనాలు ఒక్కసారిగా పుంజుకోవడంతో వర్షాలు ఊపందుకున్నాయి. ఫలితంగా ఖరీఫ్ సాగు లోటు బాగా తగ్గింది.. ముఖ్యంగా రబీ పంటలపై ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఆందోళన కలిగిస్తోంది.ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ప్రారంభం వ్యవసాయ రంగానికి నిరాశ కలిగించింది. ఎల్‌నినో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలను మాత్రమే మార్చదు. వాతావరణంలోని గాలి, పీడన వ్యవస్థలపై కూడా ప్రభావం చూపుతుంది. అయితే ఈ ప్రభావం వెంటనే కనిపించదు. సాధారణంగా ఒకటి నుంచి రెండు నెలల ఆలస్యం ఉండొచ్చు. అందువల్ల జూలైలో వర్షాలు బాగా పడ్డాయని ఎల్‌నినో ప్రభావం ముగిసిపోయిందని భావించడం తప్పు. రుతుపవనాలపై దాని ప్రతికూల ప్రభావం ముందుముందు కనిపించే అవకాశం ఉంది.ఎల్‌నినో బలపడితే ఉష్ణోగ్రతలు కూడా పెరిగే అవకాశం ఉంటుంది. అదే జరిగితే రబీ సీజన్ పంటలపై ప్రభావం పడొచ్చు. ముఖ్యంగా గోధుమ, ఆవాలు, బంగాళాదుంప వంటి పంటలకు తక్కువ వ్యవధి ఉండే వేడి శీతాకాలం అనుకూలం కాదు. అంటే ఈ ఏడాది ఖరీఫ్ పంటలు అనుకున్నంత దెబ్బతినకపోయినా.. రబీ సీజన్‌లో అసలు సవాలు ఎదురయ్యే అవకాశం ఉంది.వ్యవసాయానికి వాతావరణ ముప్పుతో పాటు ప్రపంచ మార్కెట్లలో ఆహార ధరల పరిస్థితి కూడా భారత్‌కు సవాలుగా మారుతోంది. ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) ఆహార ధరల సూచీ జూలైలో 131.1 పాయింట్లకు చేరింది. ఇది జూన్‌తో పోలిస్తే పెరుగుదల మాత్రమే కాదు.. మూడున్నరేళ్ల గరిష్ఠ స్థాయికి చేరిన సూచీ. అయితే ఈ పెరుగుదలలో ప్రధాన పాత్ర పోషించింది వంటనూనెల ధరలు. జూలైలో ఎఫ్ఏఓ వెజిటబుల్ ఆయిల్స్ ఇండెక్స్ ఏడాది ప్రాతిపదికన 17.3 శాతం పెరిగింది. 2022 జూన్ తర్వాత ఇదే అత్యధిక స్థాయి.అంతర్జాతీయంగా పెట్రోలియం ధరలు పెరిగితే.. పామాయిల్, రేప్‌సీడ్ ఆయిల్, సోయాబీన్ ఆయిల్ వంటి వంటనూనెలను బయోఫ్యూయల్ తయారీలో ఉపయోగించేందుకు ప్రోత్సాహం పెరుగుతుంది. దీంతో ఆహార అవసరాలకు అందుబాటులో ఉండే నూనెలపై ఒత్తిడి పెరిగి ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది.జూన్‌లో దేశవ్యాప్తంగా సాధారణ దీర్ఘకాల సగటు వర్షపాతం (ఎల్‌పీఏ) కంటే 38 శాతం తక్కువ వర్షాలు నమోదయ్యాయి. సాధారణంగా జూన్‌లో సుమారు మూడు అల్పపీడన వ్యవస్థలు ఏర్పడి వర్షాలను తీసుకొస్తాయి. అవి సగటున 11 రోజుల పాటు ప్రభావం చూపుతాయి. కానీ ఈ ఏడాది జూన్‌లో ఒక్క అల్పపీడన వ్యవస్థ కూడా ఏర్పడలేదు. దీంతో 1901 తర్వాత దేశంలో అత్యంత తక్కువ వర్షపాతం నమోదైన జూన్ నెలల్లో ఇది ఆరో స్థానంలో నిలిచింది. ఇంతటి లోటు వర్షపాతం నమోదైన సమయంలో ఎల్‌నినో ఇంకా బలహీన–మోస్తరు దశలోనే ఉండటం గమనార్హం.వర్షాలు ఆలస్యం కావడంతో పంటల సాగు కూడా మందగించింది. జూలై 6 నాటికి దేశంలో ఖరీఫ్ పంటలు కేవలం 350.85 లక్షల హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయి. గత ఏడాది ఇదే సమయానికి 442.80 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. అంటే సాగు విస్తీర్ణం గతేడాదితో పోలిస్తే 20.8 శాతం తక్కువగా ఉంది. నూనెగింజల విషయంలో లోటు మరింత ఎక్కువగా ఉండగా.. పప్పుధాన్యాల్లో 21.8 శాతం, పత్తిలో 23 శాతం వరకు సాగు తగ్గింది. నూనెగింజలు, పప్పుధాన్యాలు, పత్తి వంటి పంటల విషయంలో సాగు తగ్గితే దేశీయ ఉత్పత్తిపై ప్రభావం పడటంతో పాటు దిగుమతులపై ఆధారపడాల్సిన పరిస్థితి పెరుగుతుంది.ఎల్‌నినో జూలైలో బలహీన–మోస్తరు స్థాయి నుంచి మోస్తరు–బలమైన స్థాయికి చేరినా.. నైరుతి రుతుపవనాలు మాత్రం బలంగా పుంజుకున్నాయి. జూలైలో సాధారణంగా మూడు అల్పపీడన వ్యవస్థలు ఏర్పడాల్సి ఉండగా.. ఈసారి నాలుగు అల్పపీడన వ్యవస్థలు ఏర్పడ్డాయి. అంతేకాదు.. ఇవి నెమ్మదిగా కదలడంతో ఎక్కువ కాలం వర్షాలను కురిపించాయి. సాధారణంగా అల్పపీడన వ్యవస్థల ప్రభావం సుమారు 14 రోజులు ఉండగా.. జూలైలో ఇది దాదాపు 24 రోజులకు చేరింది. దీంతో జూలైలో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే 2.4 శాతం ఎక్కువగా నమోదైంది. ఇది భారత వాతావరణ విభాగం అంచనాలకు కూడా భిన్నంగా ఉండటం విశేషం. జూలైలో వర్షాలు సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా మారింది.జూలై చివరి నాటికి దేశంలో ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణం 894.22 లక్షల హెక్టార్లకు చేరింది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ఇప్పుడు సాగు విస్తీర్ణం కేవలం 2.9 శాతం మాత్రమే తక్కువగా ఉంది. అంటే జూన్‌లో 20.8 శాతంగా ఉన్న సాగు లోటు.. జూలై చివరికి కేవలం 2.9 శాతానికి తగ్గిపోయింది. పప్పుధాన్యాల్లో సాగు లోటు 6.3 శాతానికి, పత్తిలో 2.4 శాతానికి తగ్గింది. నూనెగింజల సాగు మాత్రం గతేడాది స్థాయిని కూడా అధిగమించింది. ముఖ్యంగా వేరుశనగ, నువ్వుల సాగు మెరుగుపడింది.జూలై మూడో, నాలుగో వారాల్లో కురిసిన వర్షాలు ఇప్పటికే విత్తిన పంటలకు కూడా ఊపిరి పోశాయని మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన ప్రముఖ పప్పుల మిల్లర్ నితిన్ కలంత్రికి తెలిపారు. వర్షాల లోటుతో తేమ ఒత్తిడిని ఎదుర్కొంటున్న పంటలకు ఈ వర్షాలు ఎంతో ఉపశమనం కలిగించాయని ఆయన పేర్కొన్నారు. ఈ వర్షాలు లేకపోతే మొక్కల్లో వేర్లు, కాండం, ఆకుల పెరుగుదల వంటి వృక్ష దశ అభివృద్ధి దెబ్బతినేదని వివరించారు.సోయాబీన్ పంట పరిస్థితి కూడా మెరుగుపడింది.ఖరీఫ్ పంటలకు ఆగస్టు, సెప్టెంబర్ తొలి వారాల్లో కూడా వర్షాలు అవసరం. ఈ దశలో పంటలు పూత దశకు, గింజలు లేదా కాయలు ఏర్పడే దశకు చేరుకుంటాయి. ఈ సమయంలో తగినంత తేమ లేకపోతే చివరికి దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది.ఐఎండీ ప్రకారం ఆగస్టు 13 ప్రాంతంలో ఉత్తర బంగాళాఖాతం, పశ్చిమ బెంగాల్–బంగ్లాదేశ్ తీర ప్రాంతాలను ఆనుకుని మరో అల్పపీడన వ్యవస్థ ఏర్పడే అవకాశం ఉంది.అక్టోబర్–డిసెంబర్ మధ్య ఎల్‌నినో చాలా బలమైన దశకు చేరే అవకాశం ఉందని అంచనాలు ఉన్నాయి. అంతేకాదు.. 2027 మార్చి వరకు శీతాకాలం, వసంతకాలంలో కూడా ఎల్‌నినో పరిస్థితులు కొనసాగవచ్చని అంచనా. ఇది భారత వ్యవసాయానికి రెండు రకాల ముప్పులను తెచ్చే అవకాశం ఉంది.

# సీఎం సభకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

## వరంగల్ సిపి శ్వేతతో కలిసి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్





పరకాలలో ఈ నెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొనే సభకు పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి వివిధ శాఖల అధికారులను ఆదేశించారు.

మంగళవారం పరకాలలో సీఎం పర్యటన నేపథ్యంలో ప్రతిపాదిత హెలిప్యాడ్, సభా వేదిక, వాహనాల పార్కింగ్, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద సీఎం ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు.

ప్రతిపాదిత హెలిప్యాడ్ కోసం లలితా కన్వెన్షన్ హాల్ సమీపంలోని స్థలాన్ని, సభా వేదిక, వాహనాల పార్కింగ్ కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అంగడి స్థలాలను పరిశీలించారు. సభకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున వాహనాల రాకపోకలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, సీఎం పర్యటనలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హెలిప్యాడ్ నుంచి సీఎం ప్రయాణించే మార్గం, ఆసుపత్రి ప్రారంభోత్సవం, సభా వేదిక, ప్రజల రాకపోకలు, పార్కింగ్, రహదారులు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ, సీఎం భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ హెలిప్యాడ్, రూట్ మ్యాప్, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణకు పటిష్టమైన భద్రతా ప్రణాళిక అమలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

అనంతరం సీఎం పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ ప్రణాళికపై కలెక్టర్, పోలీస్ కమిషనర్ అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ రవి, డీఆర్డీవో మేన శ్రీను, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, ఆర్అండ్‌బీ ఎస్ఈ సురేష్ బాబు, ఈఈ దేవిక, టీడబ్ల్యూఐడీసీ ఈఈ అరుణ్ కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, పరకాల మున్సిపల్ చైర్మన్ సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ పవన్,
ఏసీపీ సతీష్ బాబు, పరకాల సీఐ క్రాంతి కుమార్,
కౌన్సిలర్లు శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# జెనోమ్ వ్యాలీలో 'యామ్జెన్' అతి పెద్ద పరిశోధన కేంద్రం




గ్లోబల్ దిగ్గజ బయోటెక్నాలజి సంస్థ 'యామ్జెన్' (ూఎస్త్రవఅ) జెనోమ్ వ్యాలీలో అత్యాధునిక పరిశోధన, ఆవిష్కరణల కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఈ మేరకు మంగళవారం నాడు సచివాలయంలో ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ప్రభుత్వంతో ఎంఓయు చేసుకుంది. అంతకు ముందు శ్రీధర్ బాబుతో బేటీ అయిన యామ్జెన్ ఇండియా ప్రతినిధులు హైదరాబాద్ కేంద్రంగా తమ కార్యకలాపాల విస్తరణపై చర్చించారు.

సమావేశానంతరం యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, తెలంగాణా ప్రభుత్వ పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్యలు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. జెనోమ్ వ్యాలీలో ఏర్పాటు చేస్తున్న ఈ పరిశోధన కేంద్రంలో స్థానిక ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వెల్లడించారు.

యామ్జెన్ ఇటీవల 3 వేల మంది ఉద్యోగులతో అతి పెద్ద జిసిసి ని ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. ఔషధ రంగ దిగ్గజ కంపెనీలు తెలంగాణా పట్ల అపార విశ్వాసం కనబర్చడం తమ ప్రభుత్వానికి దక్కిన గౌవరమని ఆయన అన్నారు. లైఫ్ సైన్సెస్ కంపెనీలకు రాష్ట్రం ఒక ముఖ్యమైన వేదికగా మారడం పట్ల శ్రీధర్ బాబు సంతోషం వ్యక్తం చేసారు. ఉద్యోగ అవకాశాల్లో ఇక్కడి యువతకు ప్రాధాన్యతనిచ్చి నియామకాలు జరపాలని యామ్జెన్ యాజమాన్యానికి ఆయన సూచించారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, జీనోమ్ వ్యాలీ వంటి అభివృద్ధి చెందిన ఎకోసిస్టమ్ కారణంగా తెలంగాణ ప్రపంచ లైఫ్ సైన్సెస్ సంస్థలకు కీలక గమ్యస్థానంగా ఎదుగుతోందని ఆయన అన్నారు.
దాదాపు 100 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న యామ్జెన్ క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఎముకల ఆరోగ్యం, ఇన్‌ఫ్లమేషన్, శ్వాసకోశ వ్యాధులు, అరుదైన వ్యాధులు తదితర తీవ్రమైన అనారోగ్య సమస్యలకు వినూత్న చికిత్సలను అభివృద్ధి చేస్తోంది.

ఎంఓయు కార్యక్రమంలో పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, తెలంగాణా లైఫ్ సైన్సెస్ సిఇఓ సర్వేశ్ సింగ్, యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, ఇడి శ్రీను కొసరాజు, అనుమిత తదితరులు పాల్గొన్నారు.

# ట్యాంకర్ ఢీకొని ఐదుగురు కూలీల మృతి

## మొగడంపల్లి మండలం సత్వార్ సమీపంలో ఘోర ప్రమాదం

## మరో ఏడుగురికి తీవ్ర గాయాలు..

## ముగ్గురి పరిస్థితి విషమం



**జహీరాబాద్, ఆగస్టు 3 ప్రజాబలం ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా మొగడంపల్లి మండలం సత్వార్ గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు వ్యవసాయ కూలీలు దుర్మరణం చెందారు. కూలీలతో వెళ్తున్న ఆటోను వేగంగా వచ్చిన ట్యాంకర్ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఢీకొన్న ధాటికి ఆటో నుజ్జునుజ్జయింది. ఆటోలో ఉన్న ఐదుగురు కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతులను కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా రాజగిరి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలుగా పోలీసులు గుర్తించారు. వీరు ప్రతిరోజులాగే జహీరాబాద్ ప్రాంతంలో వ్యవసాయ పనులకు వచ్చి, పనులు ముగించుకుని ఆటోలో స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రోడ్డుపై ట్రాఫిక్‌ను పోలీసులు క్లియర్ చేశారు.

# చేయూత పింఛన్లకు 'గోల్డెన్ ఛాన్స్:

## కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్ అర్హులైన పేదలకు చేయూత పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో జిల్లాలో అర్హులైన ఏ ఒక్కరూ మిస్ కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కొత్తగా పింఛన్లకు అర్హత పొందే వారిని శాచురేషన్ మోడ్‌లో గుర్తించి, వారం రోజుల్లో అర్హులందరినీ గుర్తించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి గ్రామము ప్రతి వార్డు వైజ్ గా ఈ ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన పకడ్బందీగా చేపట్టాలని స్పష్టం చేశారు.మంగళవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో డి ఆర్డిఓ, జిల్లా సంక్షేమ శాఖ, మెప్మా, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా పరిషత్, మున్సిపల్ అధికారులతో కలెక్టర్ చిత్రా మిశ్రా చేయూత పింఛన్ల దరఖాస్తుల ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. గ్రామం, వార్డు వారీగా ముందుగా అర్హులను గుర్తించి, వారితో దరఖాస్తులు చేయించే విధానం.. చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వం చాలా ఏళ్ల తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకంగా కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేసేందుకు చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన పేదలందరికీ అందేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఆగస్టు 31 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నందున ప్రతి గ్రామం, ప్రతి వార్డు నుంచి అర్హులు దరఖాస్తు చేసుకునేలా విస్తృతంగా చైతన్యం కల్పించాలని ఆదేశించారు.తొలి దశలో వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ డిసీజ్, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వనున్న నేపథ్యంలో ఆయా వర్గాలకు చెందిన ప్రతి ఒక్కరినీ గుర్తించాలని తెలిపారు.ఇంటింటి సర్వేతో అర్హుల గుర్తింపు:గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఇతర సిబ్బంది సహకారంతో విస్తృతంగా సర్వే నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, ఒంటరి మహిళలు, వితంతువులు, ఇతర పింఛన్లకు అర్హులైన వారిని గుర్తించి దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు.ఒక్క అర్హుడి కేసు కూడా మిస్ కాకుండా అధికారులు ఈ ప్రక్రియను ఒక సవాలుగా తీసుకోవాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కొత్తగా ఎంతమంది పింఛన్లకు అర్హులవుతారో కార్యాచరణ ప్రణాళిక ప్రకారం గుర్తించి, వారి నుంచి దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు.ధ్రువపత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలిఒంటరి మహిళలు తమ జనన ధ్రువపత్రం, ఎస్సెస్సీ మెమో, ఓటరు గుర్తింపు కార్డు వంటి అందుబాటులో ఉన్న పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు అవగాహన కల్పించాలనీ, అవసరమైన సందర్భాల్లో స్థానిక విచారణ, సంబంధిత ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేయించాలని సూచించారు. వితంతు మహిళలు తమ భర్త మరణ ధ్రువపత్రాన్ని అందుబాటులో ఉంచుకోవాలని, దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ సిద్ధంగా ఉంచుకుని చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేలా అధికారులు ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు.పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టికరీంనగర్ నగరపాలక సంస్థతోపాటు చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో ఈ ప్రక్రియను మరింత సవాలుగా తీసుకుని అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. కరీంనగర్‌లో కార్పొరేటర్లు, ఇతర మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో మున్సిపల్ అధికారులు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు.గ్రామాల్లో అంగన్వాడి కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళల సహకారం తీసుకుని అర్హుల గుర్తింపు, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీఆర్‌డీవో గీత, మెప్మా పీడీ స్వరూపారాణి, డీపీవో జగదీశ్వర్‌తో పాటు మున్సిపల్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు

# జిల్లా రైతులు ఆరుతడి పంటలను పండించాలి.





**సిద్దిపేట ప్రజాబలం ప్రతనిధి:** సిద్దిపేట ఎల్ నినో వర్షాభావ పరిస్థితులలో జిల్లా రైతులు ఆరుతడి పంటలను పండించాలని జిల్లా నీటిపారుదల సలహా కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిస్టిక్ ఇరిగేషన్ అడ్వైజరీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి, ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవనం శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గజ్వేల్ సర్కిల్ చీఫ్ ఇంజనీర్ శివధర్మతేజ జిల్లాలో గల అన్నపూర్ణ సాగర్ 3.50 టీఎంసీలకు గాను 1.51 టీఎంసీల నీరు ఉండదని వాటిలో 0.32 డెత్ స్టోరేజ్ ఫోన్ 1.19 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, రంగనాయక సాగర్ 3.00 టీఎంసీలకు గాను 0.99 టీఎంసీ నీరు ఉందని వాటిలో డెత్ స్టోరేజ్ 0.17 టీఎంసీలు పోను. 0.82 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, మల్లన్న సాగర్ 50 టీఎంసీలకు గాను 13.86 టీఎంసీల నీరు ఉందని దానిలో 9.37 టీఎంసీల నీరు డెత్ స్టోరేజ్ పోను 4.12 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, కొండపోచమ్మ సాగర్ టీఎంసీలకు గాను 15.00 టీఎంసీలకు గాను 6.31 టీఎంసీల నీరు ఉందని దానిలో 2.20 టీఎంసీల నీరు డెత్ స్టోరేజ్ పోను 4.11 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, శనిగరం ప్రాజెక్టు 1.09 టీఎంసీలకు గాను 0.46 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా అందుబాటులో ఉన్న నీటిని కేవలం త్రాగునీరు అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని రాష్ట్రప్రభుత్వం సూచించిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. ఎల్ నినో ప్రభావం వలన రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితిలో ఏర్పడి జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులలో కొత్తగా నీరు చేరలేదని అన్నారు. మళ్లీ వర్షాకాలం వరకు వర్షాలు పడే సూచనలు లేదని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఇప్పుడు ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న నీరు తాగునీరు అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఆదేశాల మేరకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని త్రాగునీటి అవసరాలకు అట్టి పెట్టడం జరిగిందని అన్నారు. కావున జిల్లాలో సాగునీరు లేదు కాబట్టి రైతులు వరి పంట పండించరాదని అన్నారు. గత సంవత్సరం 4.82 లక్షల ఎకరాలలో పంట వేయగా వాటిలో 3.68 లక్షల ఎకరాలలో కేవలం వరి పంట పండించడం జరిగిందని అన్నారు. 5 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యానికి ప్రభుత్వం 1200 కోట్లు పైన చెల్లించడం జరిగిందని అన్నారు. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితుల గురించి రైతులకు వివిధ రకాలుగా అవగాహన కలిగించడం మూలంగా ఈ సంవత్సరం ఇప్పటికీ 70,000 ఎకరాల్లో పంట మార్పిడి జరిగి కందులు, పెసర్లు, మినుములు, చిరుధాన్యాలు, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను వేశారని తెలిపారు. ఆగస్టు 15 తర్వాత ఆముదము, పత్తి , నూనె గింజల పంటలను పండించవచ్చని ఆరుతడి పంటలను పండించాలని అన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో వర్షాలు కురిస్తే సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నీటిని విడుదల చేయడానికి నీటిపారుదల శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు పంపించిన లేఖను జిల్లా కలెక్టర్ చదివి వినిపించారు. ఈ లేఖలో గోదావరి నది నుండి నీరు వృధా పోకుండా లిఫ్ట్ చేసి ప్రాజెక్టులను నింపి రైతులకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని అదే విధంగా భూగర్భ జలాలను పెంచేలా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ సర్కిల్ సీఈ సత్యనారాయణ రెడ్డి, సిద్దిపేట్, గజ్వేల్, కరీంనగర్ సర్కిల్ ల ఎస్ఇలు సూర్యకిరణ్, లక్ష్మణ్ పల్లంరాజు,డిస్టిక్ ఇరిగేషన్ ఆఫీసర్ నాగరాజు, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, రామ్మూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి మల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

# మాట ఇచ్చారు....విద్యార్థులతో మమేకమయ్యారు.

## విద్యార్థులలో ఒత్తిడి తగ్గించి విద్యపట్ల ఇష్టం పెంచాలి.

### వనపర్తి. విద్యార్థులకు భోజనం వడ్డించిన మాజీ మంత్రి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

"సర్"కార్యక్రమములో భాగంగా వనపర్తి మండలములోని అంజనగిరి గ్రామంలో కాసేపు ఉపాధ్యాయుడిగా మారి పాఠాలు బోధించి పరిశుభ్రత,మంచినీరు,ఆహార నాణ్యత వంటి పలు అంశాలపై అవగాహన కల్పించిన విషయం విదితమే.



సందర్భంగామాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తాను స్వయంగా భోజనం తయారు చేయించి ఏర్పాటు చేస్తానన్న హామీ మేరకు ఈరోజు విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించడంతో విద్యార్థులు,ఉపాధ్యాయులు,గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు అధికారులు విద్యతో పాటు క్రమశిక్షణ, సమాజములోనీ పరిస్థితుల పట్ల అవగాహన కల్పించి ఉన్నతంగా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రభుత్వపరంగా నిర్వహించే విద్యా సంస్థలలో పర్యటనలు చేస్తూ విద్యావసుతులు,మౌలికవసతుల,ఆహార నాణ్యతపై శ్రద్ధ పెట్టీ మెరుగుపరచాలని తద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగి సమాజములో బాధ్యత గల పౌరులుగా ఎదుగుతారని అన్నారు.విద్యార్థులను ఆహ్లాదపరిచిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి. భోజనం అనంతరం విద్యార్థిని, విద్యార్థులను ఆప్యాయంగా పలకరించి మనకు ఆహారాన్ని అందించే రైతు, రైతుకూలీల విశిష్టత తెలిపి తల్లితండ్రులతో పాటు ఉపాధ్యాయులను రైతులను గౌరవించాలని ఉద్బోధించారు.

చాక్లెట్స్,అరటి పండ్లు ఇచ్చి ముచ్చటించారు.నిరంజన్ రెడ్డి వెంట నందిమల్ల.అశోక్,కె.మాణిక్యం, సర్పంచ్ నేనావత్.శాంతమ్మ దేవకుమార్,రఘువర్ధన్ రెడ్డి,ధర్మా నాయక్,రవిప్రకాష్ రెడ్డి,మాధవ్ రెడ్డి,మహేశ్వర్ రెడ్డి,నరేష్,చిట్యాల.రాము,ఉపసర్పంచ్ రాజు, ధర్మేందర్,యాదగిరి,వాసు,తిరుపతయ్య,స్వామి తదితరులు ఉన్నారు.

# గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

రాయచోటి ,ఆగష్టు 11: అన్నమయ్య జిల్లాలో మాదకద్రవాల నియంత్రణకు సమన్వయంతో కఠినంగా చర్యలు తీసుకోవాలని ఇన్చార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో.. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తో కలసి జిల్లా స్థాయి మాదకద్రవ్యాల కమిటీతో సమీక్ష సమావేశాన్ని ఇన్చార్జి కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక నిఘాతో పాటు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా 'ఆపరేషన్ వజ్ర' కింద తనిఖీలు ముమ్మరం చేయాలని, హాస్టళ్లలోనూ ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. పాఠశాలల పరిధిలో 100 మీటర్లలోపు పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.స్వయం సహాయక సంఘాలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల యాజమాన్యాల సహకారంతో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.పాఠశాలలకు 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై ఉన్న నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలనిసూచించారు. ప్రధానోపాధ్యాయులకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించి, ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు సమాచారం అందితే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు.

# పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**విద్యార్థుల ప్రవేశాలు పెరిగిన పాఠశాలలకు అవసరమైన మేర ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి**

**జిల్లాలో ఏ పాఠశాల కూడా సింగిల్ టీచర్ పాఠశాలగా ఉండకూడదు**

**ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయుల లభ్యత, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందేలా పర్యవేక్షణ ఉండాలి**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

జనగామ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్, విద్యా శాఖ అధికారి సందీప్ కుమార్ ఝా ఆదేశించారు.మంగళవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్, విద్యా శాఖ అధికారి సందీప్ కుమార్ ఝా ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థుల ప్రవేశాలు పెరిగిన పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు, విద్యార్థుల విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, పాఠశాలల తనిఖీలు, తదితర అంశాలపై క్షుణ్ణంగా సమీక్షించారు.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల కేటాయింపు ఉండేలా వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య అవసరానికి మించి ఉండగా, మరికొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉండే పరిస్థితి ఉండకూడదన్నారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలను గుర్తించి, అవసరమైన మేరకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ఆదేశించారు.జిల్లాలో ఏ పాఠశాల కూడా సింగిల్ టీచర్ పాఠశాలగా ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని గుర్తించి, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధతో బోధన అందించాలని, విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నారు. "ఫోకస్‌తో పనిచేస్తే విద్యా



రంగంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. ప్రతి చర్య చివరికి విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేలా ఉండాలి" అని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాలోని అన్ని పాఠశాలలను అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, బోధనా ప్రక్రియ, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, పారిశుధ్యం, తదితర అంశాలను పరిశీలించాలని సూచించారు."మిషన్ శిఖరం" కార్యక్రమం కింద జిల్లాలోని ప్రతి పాఠశాల పరిస్థితిపై స్పష్టమైన నివేదిక వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా పకడ్బందీగా రూపొందించాలని ఆదేశించారు.పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఏ పాఠశాలలోనైనా భవనం, తరగతి గదులు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులకు సంబంధించి మరమ్మతులు అవసరమైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థులు సురక్షితమైన, అనుకూలమైన వాతావరణంలో చదువుకునేలా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని అన్నారు.ఉపాధ్యాయులు పాఠశాలల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, ఉపాధ్యాయుల కేటాయింపులో అవసరాన్ని ప్రాధాన్యతగా తీసుకొని, ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు ముందుగా సర్దుబాటు చేయాలని ఆదేశించారు.మహిళా ఉపాధ్యాయులకు అవసరమైన సందర్భాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. పాఠశాలల అవసరాలు, విద్యార్థుల సంఖ్య, బోధనా పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టాలని తెలిపారు.జిల్లాలోని అఖీబ (క్లస్టర్ రిసోర్స్ టీచర్లు) తమ పరిధిలోని పాఠశాలలను నిరంతరం సందర్శిస్తూ, విద్యా ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. అఖీలు కేవలం నివేదికలు సమర్పించడం కాకుండా, పాఠశాలల్లో వాస్తవ పరిస్థితులను పరిశీలించి, ఉపాధ్యాయులకు అవసరమైన అకడమిక్ సపోర్ట్ అందించాలని ఆదేశించారు.జిల్లాలోని అన్ని పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అన్ అకాడమీ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని తెలిపారు.అదే విధంగా 'ఫాస్ట్ మ్యాథ్స్' పుస్తకాలను విద్యార్థులతో నిరంతరం సాధన చేయించాలని సూచించారు. గణితంపై విద్యార్థుల్లో ఆసక్తి, వేగం, ప్రాథమిక నైపుణ్యాలు పెంపొందించేలా రోజువారీ అభ్యాసానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

# సీడ్ యాక్సిస్ రోడ్ రెడీ...

అమరావతి, ఆగస్టు 11 ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ ప్రక్రియలో ఒక చారిత్రాత్మక ఘట్టానికి ముహూర్తం ఖరారైంది. రాజధాని నగరానికి లైఫ్‌లైన్‌గా చెప్పుకుంటున్న సీడ్ యాక్సిస్ రోడ్డులోని అత్యంత కీలకమైన భాగం ఆగస్టు 13 నుంచి ప్రజలకు అందుబాటులోకి రాబోతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మక రహదారితోపాటు, ప్రజాప్రతినిధుల కోసం నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్లను కూడా అదే రోజున అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవానికి ఒక రోజు ముందు అంటే 12 ఆగస్టు ముఖ్యమంత్రి కాన్వాయ్‌తో ఈ రహదారిపై అధికారికంగా ట్రయల్ రన్ నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

అమరావతి మాస్టర్ ప్లాన్‌లో అత్యంత కీలకమైన ఈ రహదారిని టెక్నికల్‌గా ఇ-3 రోడ్డుఅని పిలుస్తారు. ఇది రాజధాని నగరంలోని ఉత్తరం నుంచి దక్షిణానికి ఉండే 17 ప్రధాన ఎన్ సిరీస్ రోడ్లను ఒకదానితో ఒకటి కలిపే మార్గం. ఈ సీడ్ యాక్సిస్ రోడ్డు మొత్తం పొడవు 21.78కిలోమీటర్లు. ఇది దొండపాడు గ్రామం వద్ద ప్రారంభమై రాయపూడి, వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లి, తాడేపల్లి గ్రామాల మీదుగా సాగి మణిపాల్ ఆసుపత్రి వద్ద జాతీయ రహదారితో కలుస్తుంది. ఈ రోడ్డుకు సంబంధించి రైట్ ఆఫ్ వే 60 మీటర్లుగా నిర్ణయించారు. భవిష్యత్‌లో దీనిని 8 నుంచి 9 లేన్‌ల వరకు విస్తరించేలా ప్రభుత్వం ప్లాన్ చేసింది. ప్రస్తుతం 11 మీటర్ల వెడల్పుతో కూడిన క్యారేజ్ వేస్, సర్వీస్ రోడ్లు, సెంట్రల్ బీఆర్‌టీఎస్ కారిడార్‌తో నిర్మించారు.

మూడు దశల్లో అభివృద్ధి

ఈ భారీ ప్రాజెక్టును అధికారులు మూడు దశలుగా విభజించారు. ఫేజ్-1 పొడవు 14. 35 కిలోమీటర్లు. ఇది దొండపాడు నుంచి వెంకటపాలెం (మంతెన ఆశ్రమం) వరకు ఉంటుంది. ఇది ఇప్పటికే పూర్తి అయ్యి రాకపోకలు సాగుతున్నాయి. రెండోది 3.92 కిలోమీటర్ల పొడవు ఉన్న ఫేజ్ -2. వెంకటపాలెం నుంచి ఉండవల్లి వరకు సాగుతుంది. ఈ భాగమే ఆగస్టు 13న ప్రారంభమవుతుంది. భూసేకరణ సమస్యలు, కోర్టు వ్యాజ్యాలను అధిగమించి ప్రభుత్వం ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసింది. 3.50 కిలోమీటర్ల పొడవు ఉన్న ఫేజ్ -3 ఉండవల్లి నుంచి మణిపాల్ ఆసుపత్రి వరకు నిర్మిస్తున్నారు. ఇందులో ఒక భారీ ఎలివేటెడ్ కారిడార్ 320 మీటర్ల ఐకానిక్ కేబుల్ బ్రిడ్జిని నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ రహదారిలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నవి ఉండవల్లి వద్ద నిర్మించిన భారీ స్టీల్ బ్రిడ్జ్‌లు. 110 మీటర్ల పొడవుతో బకింగ్‌హామ్ కెనాల్‌పై స్టీల్ బ్రిడ్జి నిర్మించారు. దానిపై తారు పనులు పూర్తి చేశారు. రాజధానికి వరద ముప్పు లేకుండా చేసే కొండవీటి వాగుపై 284మీటర్‌ల పొడవుతో అధునాతన స్టీల్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాన్ని కేవలం ఒక రహదారిగానే కాకుండా, ఒక పర్యాటక కేంద్రంగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. కృష్ణానది, కొండవీటి వాగు అందాలను చూసేందుకు ఇక్కడ ప్రత్యేక వ్యూ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. పర్యావరణహితంగా ఉండేందుకు సైక్లింగ్ ట్రాక్‌లు, వాకింగ్ ట్రాక్‌లు, సుందరమైన ల్యాండ్‌స్కేప్ గార్డెన్లను అభివృద్ధి చేస్తున్నారు.

విజయవాడ నుంచి అమరావతి సచివాలయానికి హైకోర్టుకు వెళ్లే వేల మంది ఇరుకైన కరకట్ట రహదారిపై ఆధారపడేవారు. ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదకరమైన మలుపులు, గుంతల రోడ్డులతో ప్రయాణం నరకప్రాయంగా ఉండేది. ఈ సీడ్ యాక్సిస్ రోడ్డు అందుబాటులోకి రావడంతో విజయవాడ నుంచి అమరావతికి వెళ్లేందుకు సమయం ఆదా అవుతుంది. దాదాపు అర గంట కలిసి వస్తుంది. నాలుగు లేన్ల రహదారి కావడంతో ప్రమాదాల భయం లేదు. ఈ కారిడార్ వెంబడి ఉన్న ఉండవల్లి, పెనుమాక, మందడం ప్రాంతాల్లో భూముల రేట్లు పెరగనున్నాయి. ఐటీ కంపెనీలు, హోటల్స్ రానున్నాయి. ముఖ్యమంత్రి పర్యటన కోసం అమరావతి అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీపార్థసారథి, గుంటూరు కలెక్టర్ సాయికాంత్ వర్మ, ఎస్పీ వకుల్ జిందాల్ ఉండవల్లి స్టీల్ బ్రిడ్జి ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాట్లు సమీక్షించారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో చేపట్టిన సీడ్ యాక్సిస్ రోడ్డు ప్రాజెక్టు కోసం మొత్తం 320. 54 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. ఇందులో ఇప్పటికే 278.93 ఎకరాలను సేకరించారు. మిగిలిన భూసేకరణ ప్రక్రియ తుది దశలో ఉంది. ఈ రహదారి కేవలం రవాణా కోసమే కాకుండా రాజధాని నగరంలో గ్యాస్ పైప్‌లైన్లు, వాటర్ మెయిన్స్, ఐసీటీ కారిడార్లు వంటి భూగర్భ వసతుల ఏర్పాటుకు ఉపయోగపడనుంది.

# వైసీపీకి బూమ్ రాంగ్ అవుతోందా

విజయవాడ, ఆగస్టు 11 రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం, చట్టాలు-పరిపాలనపై క్షుణ్ణమైన అవగాహన ఉన్న ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ వంటి వైఎస్సార్సీపీ సీనియర్ నేతలకు ఏది ప్రజాదరణ పొందే అంశమో, ఏది శూన్యమైన విమర్శో స్పష్టంగా తెలుసు. దశాబ్దాల తరబడి ఎన్నికల రాజకీయాలను ఒంటబట్టించుకున్న ఈ అనుభవజ్ఞులకు.. కనీస ఆధారం లేకుండా ప్రతిపక్షం లేవనెత్తే అంశాలు ప్రతికూలతను పెంచుతాయే తప్ప, ప్రజల నుంచి ఒక్క శాతం కూడా సానుకూలతను తీసుకురావు అనే నిలువెత్తు సత్యం తెలియంది కాదు. అయినా సరే, పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్దేశిస్తున్న వ్యూహాలకు తలొగ్గి, తమ సొంత రాజకీయ క్రెడిబిలిటీని బలిపీఠం ఎక్కించేసుకుంటున్నారు.గతంలో ఉమ్మడి ఏపీ కాంగ్రెస్ హయాం నుంచి నేటి వైఎస్సార్సీపీ వరకు సీనియర్ నాయకులుగా చెరగని ముద్ర వేసుకున్న ఈ నేతలు.. జగన్ అనుసరిస్తున్న ఏకపక్ష రాజకీయ శైలి వల్ల సమాజంలో తమ ఆత్మగౌరవాన్ని కోల్పోతున్నారనే చర్చ నడుస్తోంది. డీఎస్సీ వంటి నిరుద్యోగ సున్నిత అంశాలపై ఎటువంటి డాక్యుమెంటరీ ఆధారాలు లేకపోయినా, కోర్టుల్లో విచారణకు కూడా నిలబడే సాక్ష్యాలు చూపించలేకపోయినా.. జగన్ మైక్ ముందు చెప్పిన ప్రతిపాయింట్‌నూ కిందిస్థాయిలో బలవంతంగా మోయాల్సి రావడం వారి రాజకీయ అనుభవానికే అవమానకరంగా మారింది. ఆధారం లేని పోరాటం వల్ల ఎంపికైన 16,000 మందికి పైగా ఉపాధ్యాయులు, వారి కుటుంబాల ఆగ్రహానికి గురికావాల్సి వస్తోంది.తన స్వయంకృతాపరాధ నిర్ణయాలతో స్వయంగా నెత్తిపై చేయి పెట్టుకునే భస్మాసుర రాజకీయాన్ని జగన్ నడుపుతుంటే, సీనియర్లు తెలిసీ తెలియక అందులో భాగస్వాములు అవుతున్నారనేది నిగ్గు తేలిన నిజం. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కూడా సజ్జల రామకృష్ణారెడ్డి నెట్‌వర్క్ చెప్పినట్లే వినాల్సి వచ్చిందని, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా సరే అదే తీరు కొనసాగుతోందని అంతర్గత మధనం వ్యక్తమవుతోంది. దశాబ్దాలుగా ప్రజాక్షేత్రంలో సంపాదించుకున్న గుర్తింపును, ఇమేజ్‌ను ఒకే వ్యక్తి రాజకీయ ఆధిపత్యం, వ్యర్థ రాజకీయ ఎజెండాల కోసం ధారపోయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నకు వారి వద్ద సమాధానం లేదు.ఇంత బతుకు బతికి సొంత రాజకీయాన్ని, స్వయంప్రతిపత్తిని పక్కనబెట్టి జగన్ రెడ్డి వద్ద ఈ రకంగా డీలా పడిపోవడానికి వారి మనసు ఎలా ఒప్పుతుందోగానీ, ఈ ధోరణి ఇలాగే కొనసాగితే వారి రాజకీయ జీవితాలకు ఇది తీవ్రమైన నష్టం చేకూరుస్తుంది. అధినేత చెప్పే తప్పుడు కథనాలకు మద్దతుగా ప్రెస్ మీట్లు పెట్టడం ఆపి, ఇప్పటికైనా తమ రాజకీయ వ్యూహాలను సమీక్షించుకోవాల్సిన తక్షణం ఆసన్నమైంది. సమాజంలో తమకున్న గౌరవాన్ని కాపాడుకోవడానికైనా లేదా ప్రత్యమ్నాయ రాజకీయ దారులు చూసుకోవడానికైనా ఈ సీనియర్ నాయకులు మౌనం వీడాల్సిన అవసరం ఉంది.

సాంకేతిక అవకతవకలు, అక్రమాలు

ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, రికార్డు స్థాయిలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించిన మెగా డీఎస్సీపై ప్రతిపక్షం ఆది నుంచి ఆరోపణలు గుప్పిస్తూనే ఉంది. అయితే ఆ ఆరోపణల్లో ఒక్కటంటే ఒక్క బలమైన చట్టబద్ధమైన ఆధారాన్ని కూడా వైసీపీ బయటపెట్టలేకపోయింది. సాంకేతిక అవకతవకలు, అక్రమాలు జరిగాయని ఎన్ని కథనాలు అల్లినా, నిరుద్యోగులు గానీ, పరీక్ష రాసిన వేలాది మంది అభ్యర్థులు గానీ వాటిని నమ్మే పరిస్థితి లేదు. న్యాయస్థానాలను ఆశ్రయించి పక్కా సాక్ష్యాధారాలతో సీబీఐ విచారణ కోరడంలో ఆ పార్టీ తరపు నేతలు ఘోరంగా విఫలమయ్యారు. కోర్టుల్లో నిలబడని, ఆధారాలు సమర్పించలేని కథనాలతో వీధుల్లో రచ్చ చేయడం వల్ల ఆ పార్టీ చేస్తున్నది ప్రజాపోరాటం కాదని, కేవలం ఒక కుట్రపూరిత తప్పుడు రాజకీయం అని సామాన్య ప్రజలకు సైతం అర్థమైపోయింది.అన్నింటికంటే ముఖ్యంగా, ఈ ఉనికి లేని వివాదం వల్ల వైఎస్సార్సీపీ సమాజంలో తీవ్ర ప్రతికూలతను మూటగట్టుకుంటోంది. మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన దాదాపు 16,347 మంది ఉపాధ్యాయులు, వారి వెనుకున్న వేలాది కుటుంబాలు ఇప్పుడు ప్రతిపక్ష వైఖరిపై తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నాయి. దశాబ్దాల కష్టంతో, పారదర్శకమైన పోటీలో తమ ప్రతిభతో ఉద్యోగాలు సాధిస్తే, తమ అర్హతలను, ఆత్మగౌరవాన్ని పదేపదే శంకిస్తూ పొలిటికల్ మైలేజ్ కోసం వాడుకోవడాన్ని ఆ ఉపాధ్యాయ లోకం సహించలేకపోతోంది. రాయలసీమ నుంచి మొదలై కోస్తాంధ్ర వరకు ఈ ఉద్యోగ విజేతలు ఉపాధ్యాయ ఆత్మగౌరవ ర్యాలీలు నిర్వహిస్తూ ప్రతిపక్ష వైఖరిని ఎండగడుతున్నారు. ప్రజాబలం తోడుకాకపోగా, యువత నుంచి మద్దతు లభించకపోగా, పైగా ఎంపికైన 16 వేలకు పైగా కుటుంబాల నుంచి తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకోవడం రాజకీయంగా ఎంత పెద్ద వ్యూహాత్మక తప్పిదమో స్పష్టమవుతోంది. రాలగొట్టుకోవడానికి ఏ రాయి అయితే ఏమిటి అన్నట్లుగా ఆలోచన లేకుండా ఒక ప్రతికూల అంశాన్ని పదేపదే పట్టుకుని వేలాడటం వల్ల వైసీపీకి లభించే రాజకీయ లబ్ధి సున్నా సరేకదా, ఉన్న అరకొర క్రెడిబిలిటీని కూడా నట్టేట ముంచేస్తోంది. ప్రజామోదం లేని ఇటువంటి వ్యర్థ పోరాటాల వల్ల ప్రభుత్వంపై ఎలాంటి ఒత్తిడి పడకపోగా, ప్రతిపక్షం తన సొంత ఓటు బ్యాంకునే మరింత దూర చేసుకుంటోందనేది అసలు నిజం

# ఏపీలో కుటుంబ రాజకీయాలు..సమీకరణలు!

విజయవాడ, ఆగస్టు 11 వైయస్ రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో కాంగ్రెస్ పార్టీ నుంచి బయటికి వచ్చారు జగన్మోహన్ రెడ్డి. రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసత్వంగా ముఖ్యమంత్రి పదవి కోరుకుంది ఆ ఫ్యామిలీ. అందుకు పార్టీ హై కమాండ్ అంగీకరించకపోవడంతో జగన్మోహన్ రెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. కేసుల రూపంలో సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఆ సమయంలో ఫ్యామిలీ మొత్తం జగన్మోహన్ రెడ్డికి అండగా నిలబడింది.. ఆ ఫ్యామిలీ మద్దతుతోనే పార్టీని ఏర్పాటు చేశారు. తొలి ఎన్నికల్లో అధికార పార్టీకి ధీటుగా సీట్లు తెచ్చుకున్నారు. 2019 ఎన్నికల్లో ఘనవిజయం సాధించారు. తల్లి విజయలక్ష్మి, చెల్లెలు షర్మిల, బాబాయ్ వివేకానంద రెడ్డి, సోదరులు అవినాష్ రెడ్డి, మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి.. ఇలా చెప్పుకుంటే ఆ ఫ్యామిలీ మొత్తం జగన్మోహన్ రెడ్డికి అండగా నిలబడింది. అయితే అదే సమయంలో టిడిపిలో చూస్తే మాత్రం చంద్రబాబుతో పాటు లోకేష్ కు సొంత కుటుంబం దన్ను అంతగా లేకపోయింది. కానీ ఇప్పుడు జగన్ కు ఫ్యామిలీ అండ తగ్గింది. చంద్రబాబుకు గణనీయంగా పెరుగుతూ వస్తోంది.తెలుగుదేశం అధినేత చంద్రబాబు విషయంలో కుటుంబ పరంగా ఒక భిన్న వాతావరణం ఉండేది. నందమూరి హరికృష్ణ అండగా నిలిచేవారు. కానీ అదే సమయంలో రెబల్గా కూడా వ్యవహరించేవారు. ఎప్పుడు ఎలా ఉండేవారో తెలియంది కాదు. మరోవైపు తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి దంపతులు సైతం వ్యతిరేకంగా ఉండేవారు. చంద్రబాబు రాజకీయ ప్రత్యర్థులతో చేతులు కలిపారు. మరోవైపు సమీప బంధువు, జూనియర్ ఎన్టీఆర్ మామ నార్నియా శ్రీనివాసరావు సైతం చంద్రబాబుకు పూర్తిగా వ్యతిరేకంగా మారిపోయారు. ఇలా సొంత కుటుంబ సభ్యులే చికాకుల మీద చికాకులు తెచ్చి పెట్టేవారు. మరోవైపు లోకేష్ ఆశించిన స్థాయిలో పట్టు పెంచుకోలేదు అప్పట్లో.అయితే కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఎవరు మనసులో ఏముంటుందో కూడా చెప్పలేము. అప్పుడు జగన్ కు ఫ్యామిలీ అండగా నిలబడగా.. ఇప్పుడు అదే ఫ్యామిలీ వ్యతిరేకంగా మారిపోయింది. మొదట చెల్లెలు షర్మిల దూరమయ్యారు. ఆమెకు అండగా నిలిచేందుకు జగన్మోహన్ రెడ్డికి దూరమయ్యారు తల్లి విజయమ్మ. బాబాయ్ వివేకానంద రెడ్డి హత్య కేసుతో కుటుంబం అంతా అడ్డగోలుగా చీలిపోయింది. మరో చెల్లెలు సునీత పూర్తిగా ప్రత్యర్థిగా మారిపోయారు. ఇప్పుడు కేవలం జగన్మోహన్ రెడ్డి వెంట కుటుంబంలో నిలిచేది అవినాష్ రెడ్డి, ఆయన ఫ్యామిలీ. మిగతా వారంతా దూరమైనట్టే. కేవలం దూరం మాత్రమే కాదు రాజకీయంగా విభేదించడం కూడా మొదలుపెట్టారు. మొన్నటి ఎన్నికల్లో ప్రభావం కూడా చూపారు..అయితే ఇప్పుడు చంద్రబాబు విషయానికి వద్దాం. నందమూరి ఫ్యామిలీ పూర్తిగా ఆయనకు అండగా నిలుస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ సైతం మౌనం వహించక తప్పడం లేదు. తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి దంపతులు సైతం రాజీ పడ్డారు. మొన్నటి ఎన్నికల్లో బిజెపితో తెలుగుదేశం పొత్తుకు పురందేశ్వరి ఒక కారణం. ప్రస్తుతం వారి కుమారుడు సైతం నారా లోకేష్ తో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇంకోవైపు నారా రోహిత్ అంటే చంద్రబాబు తమ్ముడి కుమారుడు సైతం లోకేష్ తో కలిసి పని చేస్తున్నారు. ఇంకో వైపు లోకేష్ తోడల్లుడు, నందమూరి బాలకృష్ణ చిన్న అల్లుడు శ్రీ భరత్ సైతం పార్టీకి అండదండగా నిలుస్తూ వచ్చారు.. ఇలా చెప్పుకుంటే ఫ్యామిలీలు ఇప్పుడు అంతా ఒక్కటై చంద్రబాబుకు అండగా నిలబడుతున్నాయి. జగన్మోహన్ రెడ్డితో పోల్చుకుంటే చంద్రబాబుకు ఇప్పుడు ఫ్యామిలీ బలం అదనం.

## రక్షణ రంగంలో 62.66 శాతం భారీ వృద్ధి

న్యూఢిల్లీ, ఆగస్టు 11, (న్యూస్ పల్స్) భారతదేశ రక్షణ రంగ ఎగుమతులు మునుపెన్నడూ లేని విధంగా సరికొత్త మైలురాయిని అధిగమించాయి. గత ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఎగుమతులు ఏకంగా రూ. 38,424 కోట్లకు చేరి, మునుపటి ఏడాదితో పోలిస్తే 62.66 శాతం భారీ వృద్ధిని నమోదు చేశాయి. ఒకప్పుడు కేవలం 'బ్రహ్మోస్' సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ మాత్రమే భారత ఎగుమతులకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండేది. కానీ మారుతున్న ఆధునిక యుద్ధ తంత్రాలకు అనుగుణంగా ప్రస్తుతం భారతదేశం డ్రోన్లు, ఖచ్చితత్వంతో దాడి చేసే గైడెడ్ క్షిపణులు, రాడార్లు మరియు అత్యాధునిక ఎలక్ట్రానిక్స్ పరికరాలను ప్రపంచ దేశాలకు సరఫరా చేస్తోంది.ప్రస్తుతం భారత్ నుండి ప్రపంచవ్యాప్తంగా 80కి పైగా దేశాలకు రక్షణ సామగ్రి ఎగుమతి అవుతుండగా, ఎగుమతిదారుల సంఖ్య కూడా 145కు పెరిగింది. ముఖ్యంగా నోయిడాకు చెందిన ఐజీ డిఫెన్స్ అభివృద్ధి చేసిన 'కాల్' అనే సుదూర లక్ష్యాలను ఛేదించే అటాక్ డ్రోన్ అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దాదాపు 1000 కిలోమీటర్ల దూరం ప్రయాణించి, 50 కేజీల బరువును మోసుకెళ్లగల ఈ స్వదేశీ డ్రోన్ టెక్నాలజీ.. ఖరీదైన మిస్సైళ్లతో పనిలేకుండా శత్రు స్థావరాలను అత్యంత తక్కువ ఖర్చుతో అణచివేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంది.మరోవైపు, ఆయుధాల తయారీతో పాటు వాటి లోపల ఉండే "మేధో పొర" అనగా ఎలక్ట్రానిక్ ఫ్యూజ్ మరియు గైడెన్స్ సిస్టమ్స్ విభాగంలో కూడా భారత్ అగ్రగామిగా ఎదుగుతోంది. పినాక రాకెట్ లాంచర్లు, ఆకాష్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, స్వాతి వెపన్-లోకేటింగ్ రాడార్లతో పాటు అధునాతన యుద్ధ విమానాల విడిభాగాలను కూడా విదేశీయులు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. ఈ వేగవంతమైన పురోగతిని చూస్తుంటే 2029-30 నాటికి రక్షణ ఎగుమతుల్లో రూ. 50,000 కోట్ల లక్ష్యాన్ని భారత్ చాలా సులువుగా చేరుకుంటుందని రక్షణ శాఖా నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# సునీత ఒంటరి పోరాటం...



కడప, ఆగస్టు 11 మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్య కేసులో ఆయన కుమార్తె డాక్టర్ వైఎస్ సునీతారెడ్డి ఎన్నో ఏళ్లుగా వేస్తున్న అత్యంత ప్రాథమిక, కీలకమైన ప్రశ్న ఇదే. ఈ విషయం సీబీఐ అఫిడవిట్‌లోనే ఉంది. బయట ప్రపంచానికి, కనీసం ఇంట్లో పనిచేసే సిబ్బందికి కూడా తెలియక ముందే వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి హత్య విషయం ఎలా తెలిసింది? ఈ ఒక్క ప్రశ్నకు చట్టబద్ధంగా విచారణ సంస్థలు సమాధానం కనుగొంటే, హత్య వెనుక ఉన్న అసలు సూత్రధారులు, పాత్రధారులు బయటపడతారని సునీత బలంగా నమ్ముతున్నారు. తెలంగాణ హైకోర్టులో సీబీఐ దాఖలు చేసిన అదనపు అఫిడవిట్‌లో సైతం మార్చి 15, 2019 ఉదయం 6:15 గంటలకు వివేకా పీఏ కృష్ణారెడ్డి ద్వారా వార్త బయటకు రావడానికి ముందే జగన్‌కు ఈ విషయం తెలుసని పేర్కొనడం ఈ అనుమానాలకు మరింత బలాన్ని చేకూర్చింది.న్యాయస్థానాల్లో ప్రతిపక్ష డిఫెన్స్ లాయర్లు దీనిపై వాదిస్తూ.. కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య సమాచారం త్వరగా మార్పిడి కావడం సహజమేనని, దాంట్లో నేరపూరిత కోణం ఏమీ లేదని సరిపెట్టుకునే యత్నం చేశారు. అయితే ఇక్కడే అసలు రాజ్యాంగ, న్యాయపరమైన లోపం స్పష్టమవుతోంది. బంధువులకు సమాచారం అందింది అనే సాధారణ సాకుతో వార్త ఎక్కడి నుంచి వచ్చిందో విచారించకుండా విస్మరించడం సమంజసం కాదనేదిసునీత వాదన. హత్య జరిగిన అర్ధరాత్రి దాటిన సమయం నుంచి ఉదయం వరకు కడప ఎంపీ అవినాష్ రెడ్డి ఫోన్ నుంచి నడిచిన వాట్సాప్, వాయిస్ కాల్స్ ఐపీడీఆర్ డేటాను సీబీఐ అఫిడవిట్‌లోప్రస్తావించినప్పటికీ, ఆ సమాచారం కనెక్షన్ చివరగా ఎక్కడ ముగిసిందో పూర్తి స్థాయిలో మనీ-పవర్ ట్రయల్‌తో ముడిపెట్టి తేల్చకపోవడమే అసలు వివాదం.న్యాయం కోసం సునీత పడుతున్న తపన, సాగిస్తున్న పోరాటం సాధారణమైంది కాదు. కింది కోర్టుల నుంచి సుప్రీంకోర్టు వరకు, ఏపీ నుంచి విచారణను తెలంగాణకు బదిలీ చేయించడం వరకు ఆమె అలుపెరగకుండా పోరాడుతున్నారు. హత్య వెనుక ఎవరున్నారనేది ప్రజలందరికీ ఒక అంచనా ఉన్నప్పటికీ.. దానిని చట్టబద్ధమైన సాక్ష్యాధారాలతో కోర్టు ముందు రుజువు చేసి, నిందితులకు శిక్ష పడేలా చేయడమే ఆమె అంతిమ లక్ష్యం. ఏడేళ్లు గడిచినా ఒక మాజీ ఎంపీ కుమార్తె న్యాయం కోసం వ్యవస్థల చుట్టూ తిరగాల్సి రావడం భారతీయ నేర విచారణ వ్యవస్థ లోని మందగమనానికి అద్దం పడుతోంది.ఈ తరుణంలోనే సునీత నేరుగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాసి, కేసులోని పెద్ద కుట్ర కోణాన్ని, ముందస్తు సమాచారం ఎవరికి ఎలా చేరిందనే అంశాన్ని త్వరితగతిన తేల్చాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగబద్ధ అత్యున్నత పీఠం జోక్యం చేసుకుని సీబీఐ దర్యాప్తునకు స్పష్టమైన కాలపరిమితిని, దిశానిర్దేశాన్ని ఇస్తే తప్ప ఈ కేసు ముడిపడేలా లేదు. ఒక కుటుంబం తమ ఆత్మీయుడిని కోల్పోయి, వ్యవస్థలు సహకరిస్తాయో లేదోనన్న ఆందోళనతో సాగిస్తున్న ఈ ఆత్మగౌరవ పోరాటానికి చట్టం నిజమైన న్యాయం చేస్తుందా లేదా అనేది కాలమే నిర్ణయించాలి.

## ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ఏర్పాటు

బాలానగర్ సూక్ష్మ మధ్య తరహా పరిశ్రమల(ఓఓఇ) అభివృద్ధి చట్టం -2026 సవరణ బిల్లుకు లోకసభ ఆమోదం తెలిపిన నేపథ్యంలో..బాలానగర్ లోని ఓఓఇ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఓఓఇ ఆఈూ జాయింట్ డైరెక్టర్ సి.శివ శేషగిరి రావు మాట్లాడుతూ..20 ఏళ్ల తర్వాత ఇప్పుడు చేసిన సవరణ బిల్లు లో చట్టపరమైన వ్యవస్థ ,వ్యాపార సౌలభ్యం,సమస్యల పరిష్కారం లాంటి అంశాలు త్వరగా పరిష్కారం అవడానికి అవకాశం ఉంటుందన్నారు.ఈ సవరించిన చట్టంలో పెట్టుబడి,టర్నోవర్ ఆధారంగా ఎబఎవ వర్గీకరణను చట్టబద్ధం చేయడం, ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం కోసం ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు.ఉద్యమ్ పోర్టల్ లో రిజిస్ట్రేషన్ చేసుకున్నాక గడిచిన మూడేళ్ళలో 1.65 కోట్ల నుంచి వినియోగదారులు 9.16 కోట్లకు పెరిగాయని ,దేశ వ్యాప్తంగా 40కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు.

# నిందితులకే మద్దతా...

# నిన్న అప్పలరాజు... ఇవాళ పాస్టర్ కోడుకు

రాజమండ్రి, ఆగస్టు 11 రాజమండ్రిలో డాక్టర్ ప్రియాంకపై కారు ఎక్కించి దారుణంగా హత్య చేసిన ఉదంతం రాజకీయంగా, సామాజికంగా తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్ ప్రసిద్ధ పాస్టర్ కుమారుడు కావడంతో, ఈ వ్యవహారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి, ముఖ్యంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి తీవ్రమైన సంకట పరిస్థితిని తెచ్చిపెట్టింది. ఒకవైపు నిందితుడు తమకు అత్యంత కీలకమైన ఓటు బ్యాంక్ వర్గానికి చెందిన కుటుంబ నేపథ్యం కలవాడు కావడం, మరొకవైపు అత్యంత కిరాతకానికి గురైన బాధితురాలు వైద్య విద్యార్థిని కావడం వల్ల.. ఈ కేసులో ఎటువైపు నిలబడాలో తెలియక వైసీపీ రాజకీయ డైలమాలో పడింది. ఈ విమర్శలు రావడంతో చివరికి జగన్ ప్రభుత్వాన్ని నిందిస్తూ ఓ ట్వీట్ చేసి పడేశారు.ఇటీవల కాశిబుగ్గ సమీపంలో మాజీ మంత్రి, వైసీపీ నేత సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ జరిపిన హిట్ అండ్ రన్ కేసులో ఒక పేద గౌర్రెల కాపరి దానయ్య ప్రాణాలు కోల్పోతే, వైసీపీ అనుసరించిన వైఖరి పైనే ఇప్పుడు ప్రధాన చర్చ జరుగుతోంది. ఆ కేసులో సొంత పార్టీ నేత కుమారుడిని రక్షించేందుకు వేరొక అనామకుడిపై నింద మోపే ప్రయత్నం చేశారు. దానయ్యను కాపాడే ప్రయత్నం చేయలేదు. దానయ్య కుటుంబాన్ని ఆదుకోలేదు. తప్పుడు కుట్రలు చేసినందుకు సీదిరి అప్పలరాజుపై కేసు నమోదు చేస్తే దాన్ని రాజకీయ కక్ష సాధింపు గా జగన్ రెడ్డి వర్గీకరించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. బాధితుడైన గౌర్రెల కాపరి కుటుంబం ఆవేదనను పక్కనపెట్టి, కేవలం తమ పార్టీ నేత, కుల సమీకరణాలకే జగన్ ప్రాధాన్యత ఇచ్చారు. మత్స్యకార నాయకుడ్ని వేధిస్తున్నట్లుగా ప్రచారం చేశారు.ఇదే ప్రాతిపదికన విశ్లేషిస్తే, ఇప్పుడు రాజమండ్రి కేసులో కూడా వైసీపీ అదే తరహా సొంత వర్గ రక్షణ వ్యూహాన్ని అమలు చేస్తుందా అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. జోసెఫ్ ఎడ్వర్డ్స్ కుటుంబం సామాజికంగా, మతపరంగా వైసీపీకి సాంప్రదాయకంగా మద్దతు ఇచ్చే వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తోంది. ఇప్పుడు గనుక రాజమండ్రి కేసులో నిందితులకు కఠిన శిక్ష పడాలని, వారిపై ఉద్దేశపూర్వక హత్య సెక్షన్లు సమర్థనీయమేనని వైసీపీ డిమాండ్ చేస్తోంది పైపైకే. ఎందుకంటే ప్రజాగ్రహం ఎక్కువగా ఉంది కాబట్టి ఇలా ప్రియాంక కోసం మాట్లాడుతున్నారు. మరి కాశిబుగ్గ కేసులో అప్పలరాజు కొడుకుపై చట్టం చర్యలు తీసుకున్నప్పుడు ఎందుకు వ్యతిరేకించారు? అక్కడ లేని న్యాయసూత్రాలు ఇక్కడ మాత్రమే గుర్తుకొచ్చాయా?అంతేకాకుండా, ప్రియాంక తండ్రి కడుపుకోతతో మాట్లాడుతున్న మాటలను సైతం రాజకీయంగా వక్రీకరిస్తున్నారు. చట్టం ముందు అందరూ సమానులే అయినప్పుడు, ఒక నిందితుడు తమ పార్టీ నేత కొడుకైనా, లేక ఓటు బ్యాంకుకు చెందిన ప్రముఖుడి కొడుకైనా శిక్ష ఒకేలా ఉండాలన్న కనీస ధర్మాన్ని వైసీపీ విస్మరిస్తోంది. బాధితురాలైన డాక్టర్ ప్రియాంక కుటుంబానికి న్యాయం జరగాలనే డిమాండ్ ఏపీవ్యాప్తంగా మిన్నంటుతున్న వేళ, వైసీపీ ద్వంద్వ వైఖరి ఆ పార్టీ విశ్వసనీయతను మరింత దిగజారుస్తోంది. సీదిరి అప్పలరాజు కేసులో బాధితుడికి ఒక న్యాయం, రాజమండ్రి కేసులో మరో న్యాయం అన్నట్లుగా రాజకీయాలు చేస్తున్నారు

# డీఎస్సీపై ఒంటరి పోరు

గుంటూరు, ఆగస్టు 11 వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డీఎస్సీ 2025 పై ఉద్యమం చేపడుతోంది. అయితే ఈ ఉద్యమం విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏం ఆశిస్తుందో తెలియడం లేదు కానీ.. ప్రజల్లోకి ఈ అంశం వెళ్లడం లేదు. పైగా కొన్ని వర్గాలు వ్యతిరేకిస్తున్నాయి. సమాజంలో అస్థిరతను, గందరగోళాన్ని సృష్టించేందుకే డీఎస్సీ పై విష ప్రచారం చేస్తున్నారు అంటూ కొంతమంది మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వాన్ని వ్యతిరేకించే న్యాయవాది జడ శ్రావణ్ కుమార్ సైతం ఈ విషయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీరును తప్పుపట్టారు. ఇప్పుడు జాతీయ పార్టీ కాంగ్రెస్ సైతం దీనిని తీవ్రంగా తప్పుపడుతోంది. వేలాదిమంది ఉపాధ్యాయుల్లో అశాంతి నింపడమే అవుతుందని తేల్చి చెబుతోంది. ప్రజా సమస్యలు గాలికి వదిలి డీఎస్సీ 2025 పై విషం చిమ్మడంపై తీవ్రస్థాయిలో ఆక్షేపిస్తోంది. కేంద్ర మాజీమంత్రి చింతామోహన్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతోపాటు జగన్మోహన్ రెడ్డి తీరుపై మండిపడ్డారు. ఇంత జరిగాక కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోంది.సమకాలీన అంశాలపై ఎప్పటికప్పుడు స్పందిస్తుంటారు కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డీఎస్సీ పై ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. అదే సమయంలో వేలాది మంది ఉపాధ్యాయులు కర్నూలు కొండారెడ్డి బురుజు సెంటర్ పై ఆత్మగౌరవం పేరుతో నిరసన చేపట్టారు. ఈ క్రమంలో రాయలసీమ వాసిగా.. బాధ్యతాయుతమైన కేంద్ర మాజీ మంత్రిగా స్పందించారు చింతా మోహన్. అసలు డీఎస్సీ పై ఉద్యమం ఎందుకు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఒక్క అక్రమం కూడా జరగలేదని తనకు తెలుసు అని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణ చేసినప్పుడు తాను దీనిపై లోతైన శోధన చేశానన్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రజల్లో అయోమయం సృష్టిస్తామంటే కుదిరే పని కాదని తేల్చి చెప్పారు.అయితే ఒక్క మాట మాత్రం నిజం. ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలను దూరం చేసుకుంటుంది. ప్రస్తుతం ఉపాధ్యాయ వర్గాన్ని దూరం చేసుకుంది. ఇంకోవైపు తనతో కలిసివచ్చే రాజకీయ పక్షాలు లేకుండా చేసుకుంటుంది. చింతా మోహన్ కేంద్ర మాజీ మంత్రి హోదాలో.. కాంగ్రెస్ పార్టీకి వీర విధేయుడు హోదాలో మాట్లాడుతారు. ఇప్పుడు అటువంటి వ్యక్తి డీఎస్సీలో అక్రమాలు జరగలేదని.. వైయస్సార్ కాంగ్రెస్ పోరాటాన్ని తప్పుపట్టారు. అయితే చింతా మోహన్ మాదిరిగా మరి కొంతమంది ముందుకు వచ్చే అవకాశం ఉంది. ఉపాధ్యాయుల జీవితాలకు సంబంధించిన అంశం కావడంతో మిగతా రాజకీయ పక్షాలు వారికి అండగా నిలిచే ఛాన్స్ కనిపిస్తోంది. అయితే నలుగురికి నచ్చేది తనకు నచ్చదు అన్న స్వభావం జగన్మోహన్ రెడ్డి ది. కచ్చితంగా డీఎస్సీ 2025 పై వైసిపి ఒకవైపు.. మిగతా రాజకీయ పక్షాలు మరోవైపు నిలిచే ఛాన్స్ కనిపిస్తోంది. అచ్చం అమరావతి మాదిరిగా వైసీపీ ఒంటరి కావడం ఖాయం.

# 12 ఏళ్లలో రైటాఫ్ రుణాల విలువ రూ. 10 లక్షల కోట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 11, (న్యూస్ పల్స్) బ్యాంకులు, ఆర్థిక సంస్థలు పెద్ద పెద్ద వ్యాపారులకు, కార్పొరేట్లకు, ఇతర సర్వీస్ సెక్టార్లో బారోవర్లకు పెద్ద మొత్తంలో లోన్లు ఇస్తుంటాయి. ఇక్కడ చాలా మంది తిరిగి చెల్లించక మొండి బకాయిలు పెద్ద మొత్తంలో పేరుకుపోతుంటాయి. వీటిని బ్యాంకింగ్ పరిభాషలో నాన్ పెర్ఫామింగ్ అసెట్స్ అంటారు. ఇక బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తాము ఇచ్చిన లోన్లను తిరిగి రాబట్టుకోవడం కష్టమనిపిస్తేవాటిని బ్యాంకులు తాత్కాలికంగా రద్దు చేస్తుంటాయి. దీనినే లోన్ రైటాఫ్ (లోన్లు సాంకేతికంగా రద్దు) అని పిలుస్తారు. ఇక్కడ గుర్తుంచుకోవాల్సింది ఏంటంటే రైటాఫ్ చేసినంత మాత్రాన లోన్లు రద్దయినట్లు కాదు. ఇది రుణ మాఫీ ఏ మాత్రం కాదు. లోన్ రికవరీ కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంటాయి. అయితే బ్యాలెన్స్ షీట్ నుంచి మాత్రమే ఈ లోన్లను తొలగిస్తారు. ఇక్కడ నిరర్థక ఆస్తుల్ని తగ్గించుకునేందుకు, లాభదాయకత చూయించుకునేందుకు బ్యాంకులు చేసే సాంకేతిక ప్రక్రియనే లోన్ రైటాఫ్ అంటారు.ఇక ఇలా గత 12 ఏళ్లలో చూస్తే ఇలా పెద్ద కార్పొరేట్ రుణ గ్రహీతలకు ఇచ్చిన దాదాపు రూ. 9.95 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ చేశాయి. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు వెల్లడించింది. ఇక్కడ రుణాల్ని రైటాఫ్ చేయడం అంటే రుణ గ్రహీతలకు అప్పును మాఫీ చేసినట్లు కాదని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ వివరాల్ని వెల్లడించారు. ఇక బ్యాంకుల రుణ రైటాఫ్‌లో గత కొన్నేళ్లుగా గణనీయమైన మార్పు కనిపిస్తోందని గణాంకాలు చెబుతున్నాయి.బ్యాంకులు రైటాఫ్ చేసిన రుణాల్లో అత్యధిక మొత్తం 2018-19 ఆర్థిక సంవత్సరంలో నమోదైంది. ఆ ఏడాదిలో ఏకంగా రూ. 1,48,753 కోట్ల రుణాల్ని బ్యాంకులు సాంకేతికంగా రద్దు చేశాయి. తర్వాతి సంవత్సరాల్లో చూస్తే రైటాఫ్ చేసిన రుణాల సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. కిందటి 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. 20,485 కోట్ల రుణాల్ని రైటాఫ్ చేసినట్లు కేంద్రం వెల్లడించింది. 2018-19తో పోలిస్తే 2025-26 లో రైటాఫ్ చేసిన రుణాల మొత్తం భారీగా తగ్గింది. ఇక గత 12 ఏళ్ల లెక్కల్ని చూస్తే మాత్రం దాదాపుగా రైటాఫ్ రుణాల విలువ రూ. 10 లక్షల కోట్లకు చేరడం గమనార్హం.చాలా మంది మాత్రం రుణాల రైటాఫ్ అంటే రుణ మాఫీగా భావిస్తుంటారు. కానీ ఈ రెండూ ఒకటి కాదు. బ్యాంకులు తమ బ్యాలెన్స్ షీట్లను సరిచేసుకునేందుకు, మొండి బకాయిల్ని పుస్తకాల నుంచి తొలగించేందుకు రైటాఫ్ ప్రక్రియను ఉపయోగిస్తుంటాయి. ఇక్కడ రైటాఫ్ చేసినా బ్యాంకులు వర్తించే నిబంధనలు, చట్టపర మార్గాల ప్రకారం ఆ లోన్లను తిరిగి వసూలు చేసేందుకు చర్యలు కొనసాగించవచ్చు. చెల్లింపులు చేయకపోతే రుణాలు మొండి బకాయిలుగా మారతాయి. అలాంటి ఖాతాలపై బ్యాంకులు రికవరీ చర్యలు చేపడతాయి. అయితే కొన్ని సందర్భాల్లో లోన్ తిరిగి వసూలు చేయడం కష్టంగా మారుతుంది. ఇలాంటి పరిస్థితుల్లోనే నిబంధనలకు అనుగుణంగా బ్యాంకులు లోన్లను రైటాఫ్ చేయొచ్చు.

# టీడీపీ గూటికి మేకపాటి ఫ్యామిలీ

నెల్లూరు, ఆగస్టు 11 తెలుగుదేశం పార్టీలో మళ్లీ చేరికలు మొదలయ్యే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా చాలామంది నేతలు టిడిపి తో పాటు కూటమి పార్టీల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే సరైన సమయం కోసం వేచి చూస్తూ వస్తోంది టీడీపీ. అవసరం అనుకున్న క్రమంలో ఒక్కో నేత చేరిక ఉండాలని భావించింది. అయితే ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక బలమైన కుటుంబాన్ని టిడిపిలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు పూర్తయినట్లు సమాచారం. త్వరలో ఆ బలమైన ఫ్యామిలీ టిడిపిలోకి రావడం ఖాయం అని తేలిపోయింది. దానిపైనే పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.గత కొన్ని రోజులుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో అంటి ముట్టనట్టుగా ఉంది మేకపాటి ఫ్యామిలీ. రాజకీయాలపై కాకుండా వ్యాపారాలపై ఎక్కువగా ఫోకస్ పెట్టింది. రాజకీయంగా మనసు మారింది అని ఆ ఫ్యామిలీ పై ఒక ప్రచారం ఉంది. అందుకు తగ్గట్టుగానే పరిస్థితులు ఉన్నాయి. ఆది నుంచి మేకపాటి ఫ్యామిలీ వ్యాపార రంగంలో స్థిరపడింది. కూటమి వచ్చిన తర్వాత ఆ ఫ్యామిలీ పై ఎటువంటి వివాదాలు కానీ కేసులు కానీ లేవు. వారి పని వారు చేసుకుంటున్నారు. కానీ వైసీపీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర ఆవేదనతో ఉన్నారు మేకపాటి రాజమోహన్ రెడ్డి. ఈ క్రమంలోనే జగన్ చుట్టూ ఉన్న కోటరీ మారాలని.. జగన్ వైఖరిలో మార్పు రావాలని కామెంట్స్ చేశారు మేకపాటి. అప్పటినుంచి ఆయన పార్టీ మారుతారు అన్న ప్రచారం పెద్ద ఎత్తున సాగింది. మధ్యలో ఆ ప్రచారానికి పడింది కానీ ఇప్పుడు మళ్లీ మొదలైంది.మేకపాటి రాజమోహన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి కి సన్నిహిత నేత. ఆ అభిమానంతోనే ఎంపీ పదవి విడిచిపెట్టి మరి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. జగన్మోహన్ రెడ్డి సైతం ఎంతగానో అభిమానం చూపారు ఆ కుటుంబం పై. మేకపాటి గౌతం రెడ్డికి క్యాబినెట్ మంత్రి పదవి ఇచ్చారు. కానీ ఆయన అకాల మరణం చెందారు. తర్వాత మేకపాటి విక్రమ్ రెడ్డికి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారు. అంతకుమించి ఏ అవకాశం ఇవ్వలేదు ఆ ఫ్యామిలీకి. మొన్నటి ఎన్నికల్లో నెల్లూరు నుంచి బలమైన నేతలు దూరం కావడంతో మేకపాటి రాజమోహన్ రెడ్డి తో పాటు ఆయన కుమారుడు విక్రమ్ రెడ్డికి టికెట్లు ఇచ్చారు. కానీ ఇద్దరూ ఓడిపోయారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నెల్లూరు జిల్లాలో పెద్దదిక్కుగా ఉన్న మేకపాటిని పెద్దగా పట్టించుకోలేదట జగన్. దానిపైనే అసంతృప్తిగా ఉన్న మేకపాటి మొన్న మధ్య జగన్ చుట్టూ ఉన్న కోటరి పై విమర్శలు చేశారు. అయినా సరే జగన్ పిలిచి మాట్లాడాక పోవడంతో పార్టీలో ఉండడం కంటే బయటకు వెళ్ళిపోవడమే మేలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. త్వరలో ఆయన టిడిపిలో చేరిక ఖాయమన్న ప్రచారం సాగుతోంది. రాజ్యసభ పదవితో పాటు నియోజకవర్గాల పునర్విభజన జరిగితే వారసులకు రాజకీయ ప్రాధాన్యం ఇస్తామన్న హామీ తోనే ఆయన పార్టీ మారేందుకు సిద్ధపడినట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# కాటా ఆమ్రపాలి.. స్మితా సబర్వాల్.. పోస్టింగ్ కోసం తిప్పలు




హైదరాబాద్, ఆగస్టు 11, కాటా ఆమ్రపాలి.. స్మితా సబర్వాల్.. మహిళా ఐఏఎస్ అధికారులు. వీరిద్దరిలో దూకుడు ఎక్కువ. డైనమిక్ గా పనిచేసే తీరు ఎక్కువ. పైగా వీరిని సూపర్ స్టార్ ఐఏఎస్ అధికారులు అని పిలిచేవారు. వార్తల్లో కూడా ఎక్కువగా కనిపించేవారు.అందానికి అందం.. పని తీరుకు పని తీరు.. ఫలితంగా వీరిద్దరూ మీడియాలో నిత్యం కనిపించేవారు. ఏకంగా ముఖ్యమంత్రి కార్యాలయాలలో పనిచేసే తమ సమర్థతను నిరూపించుకున్నారు. మీడియా వీరిద్దరి గురించి ఎక్కువగా వార్తలు రాస్తూ ఉండేది. సోషల్ మీడియాలో ఈ ఇద్దరు అధికారులు ఎక్కువగా యాక్టివ్ గా ఉండేవారు. విపరీతమైన ఫ్యాన్ బేస్ ఉన్న ఈ అధికారులకు పోస్టింగ్ ఎందుకు లభించలేదు.. గ్రాఫ్ ఎందుకు తగ్గిపోయింది.. రాజకీయ సమీకరణాలు.. ఇతర అంశాలు వీరికి ఇబ్బందికరంగా మారాయా..ఆమ్రపాలి తనకు పోస్టింగ్ కేటాయించే విషయంలో న్యాయపోరాటం చేసింది. అందులో గెలిచింది. ఈమెకు డిపార్ట్మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ కేటాయింపులలో ఏపీ క్యాడర్ లభించింది. ఈమెకు మొదటి నుంచి కూడా తెలంగాణ రాష్ట్రంలో పనిచేయాలనేది బలమైన ఆకాంక్ష. అనేక రకాలుగా పోరాటాలు చేసినప్పటికీ ఈమె ఏపీ క్యాడర్లో పనిచేయాల్సి వచ్చింది. సరైన ప్రాధాన్యం లభించకపోవడంతో వరుసగా సెలవులు తీసుకున్నారు. ఆ తర్వాత ఎటువంటి బాధ్యతలు లేని నార్మల్ ట్రాన్స్ఫర్ ను ఎదుర్కొన్నారు. ఈయనకు సమర్థత ఉంది. కాకపోతే సమీకరణాలవల్ల పోస్టింగ్ కు దూరంగా ఉండాల్సి వస్తోంది. గతంలోని వరంగల్ కలెక్టర్ గా.. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా పని చేశారు. ఆ అనుభవాన్ని కూడా ప్రభుత్వం వినియోగించుకోలేదు.ఈమె క్రేజీ అధికారిగా పేరు తెచ్చుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఎక్కువకాలం తెలంగాణ రాష్ట్రంలో పనిచేశారు. ఇక ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ముఖ్యమంత్రి కార్యాలయంలో కీలక అధికారిగా వ్యవహరించారు. ముఖ్యంగా మిషన్ భగీరథ వంటి ప్రాజెక్టులలో ముఖ్యపాత్ర పోషించారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈమెకు విపరీతమైన ఫ్రీ హ్యాండ్ ఇచ్చారు. ఒక దశలో ఈమె నెక్స్ట్ టు సీఎం అన్నట్టుగా వ్యవహరించారు. ప్రభుత్వం మారిన తర్వాత స్మితకు ప్రాధాన్యం తగ్గిపోయింది. పైగా అస్మిత సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పరోక్ష విధానంలో విమర్శలు చేయడం మొదలుపెట్టారు. ఈమె వ్యవహార శైలిపై కూడా ప్రభుత్వ పెద్దలకు ఆగ్రహం ఉండడంతో ప్రాధాన్యం లేని విభాగాలు కేటాయించారు. దీంతో ఆమె ఆ బాధ్యతలు స్వీకరించడం కంటే.. ఖాళీగా ఉండడానికి ఇష్టాన్ని చూపించారు.ప్రభుత్వాలు మారినప్పుడు అధికారులకు ఇంపార్టెన్స్ తగ్గిపోతూ ఉంటుంది. అయితే కొంతమంది అధికారులు ప్రభుత్వాలకు తగ్గట్టుగా మారకుండా.. తమకంటూ ఓన్ స్టైల్ క్రియేట్ చేసుకోవడమే ఇక్కడ ఇబ్బందికరంగా మారుతుంది. స్మిత.. ఆమ్రపాలి వీరిద్దరూ సమర్థవంతమైన అధికారులు. రాజకీయ కారణాలవల్ల పోస్టులు లభించకపోవడంతో దీర్ఘకాలం సెలవులో ఉన్నారు ఇటువంటి అధికారులకు పోస్టింగులు లభించకపోవడం ఒకరకంగా ప్రజలకు ఇబ్బంది. సమర్థత ఉన్న అధికారులు దీర్ఘకాలం విశ్రాంతి తీసుకుంటే ప్రజా సమస్యలు పరిష్కారం కావడం దాదాపు అసాధ్యం.

# తెలంగాణలో సర్వేల గుబులు.. రెండేళ్లకు ముందేనా

హైదరాబాద్, ఆగస్టు 11, తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, ప్రధాన పార్టీలయిన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ లు ఇప్పటి నుంచే ప్రైవేట్ సంస్థల ద్వారా సర్వేలు నిర్వహిస్తుండటంతో అధికార, ప్రతిపక్ష శిబిరాల్లో టెన్షన్ నెలకొంది. మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై వస్తున్న రహస్య సర్వే నివేదికలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. దీంతో అధికార పార్టీలో కలవరం రేగుతుంది. అదే సమయంలో ఈ సర్వేల్లో నిజమెంత? అబద్ధమెంత? అన్నది మాత్రం తెలియడం లేదు. తెలంగాణలో ఎన్నికలు జరగడానికి ఇంకా రెండేళ్లు సమయం ఉంది. జమిలీ ఎన్నికలు జరిగితే మూడేళ్ల తర్వాత కాని తెలంగాణలో ఎన్నికలు జరగవు... కానీ ముందే అనేక ప్రయివేటు సంస్థలు సర్వేలు నిర్వహిస్తు రాజకీయ పార్టీల్లో గుబులు రేపుతున్నాయి. అయితే ఇవి పెయిడ్ సర్వేలని తమకు అనుకూలంగా రాని పార్టీలు కొట్టిపారేస్తున్నా... ఎక్కడో ఏదో అనుమానం. ప్రజల్లో నిజంగా అసంతృప్తి ఉందా? అని అధికార పార్టీ, ప్రజల్లో తమ పార్టీకి అనుకూలత లేదా? అని విపక్ష పార్టీలు ఆందోళనలో పడ్డాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, హామీల అమలు తీరుపై ప్రజల నుంచి వస్తున్న స్పందనను అంచనా వేయడానికి పార్టీలు సర్వేలు చేపట్టాయి.నియోజకవర్గాల్లో నిధుల కొరత, ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటున్న కొంతమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు, మంత్రుల పనితీరు ఆశించదగ్గ రీతిలో లేదని సర్వేల్లో వస్తున్న టాక్ గుబులు పుట్టిస్తోంది.. భవిష్యత్తులో టికెట్ల కేటాయింపునకు ఈ సర్వేలనే ప్రామాణికంగా తీసుకుంటారనే ప్రచారం నాయకుల్లో ఆందోళన కలిగిస్తోంది.రాజకీయ పార్టీల వ్యూహాలుఅధికార కాంగ్రెస్ పార్టీ తరఫున అంతర్గత సర్వేల ద్వారా ప్రజాభిప్రాయాన్ని బేరీజు వేస్తుండగా, ప్రతిపక్ష బీఆర్ఎస్ , బీజేపీ కూడా గ్రౌండ్ రియాలిటీపై దృష్టి పెట్టాయి.ఎప్పటికప్పుడు మారుతున్న రాజకీయ సమీకరణాలు, ప్రజా స్పందన ఆధారంగా పార్టీల వ్యూహాలను మారుస్తున్నాయి. తమకు సానుకూలత, అనసుకూలత ఏ నియోజకవర్గాల్లో అంచనా వేసుకుని వాటిని దిద్దుకునే ప్రయత్నంలో ఉన్నాయి. మొత్తం మీద రెండేళ్ల ముందే సర్వేలు తెలంగాణ రాజకీయ పార్టీల్లో కాక రేపుతున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

# గెట్ రెడీ విత్ మీ అంటున్న మోడీ



న్యూఢిల్లీ, ఆగస్టు 11, (న్యూస్ పల్స్) దేశంలో జెన్ జీ ఉద్యమం ప్రారంభమైంది. ఇందులో సోషల్ మీడియా ప్రముఖ పాత్రే పోషించింది. దీంతో రాజకీయ నేతలు కూడా అలర్ట్ అయ్యారు. మరీ ముఖ్యంగా నిత్యం టెక్నాలజీని వాడటంలో ముందుండే ప్రధాని మోదీ టెక్నాలజీని మరింత విస్తృతంగా వాడేస్తున్నారు. ఏది చెప్పాలన్నా, వీడియో రూపంలోనే తన సందేశాన్ని ఇస్తున్నారు. జంతర్ మంతర్ దగ్గర నిరసన ప్రారంభమైన తర్వాత ప్రధాని మోదీ ఏకంగా నాలుగు వీడియోల ద్వారా తన సందేశాన్ని పంపించారు. అందులో "ఫ్రెండ్స్" అంటూనే సంబోధించారు. అప్పటి నుంచి ఇక.. వీడియోల ద్వారానే తన సందేశాన్ని పంపిస్తున్నారు.తాజాగా కూడా ప్రధాని మోదీ ఇదే చేశారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని మోదీ, ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇందులో కూడా యువతనే టార్గెట్ గా చేస్తూ సంభాషించారు.ఒక కొత్త ఇన్‌స్టాగ్రామ్ రీల్‌ను పోస్ట్ చేస్తూ, చేనేత దుస్తులతో "గెట్ రెడీ విత్ మీ" వీడియోలను రూపొందించడం ద్వారా జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకోవాలని యువ భారతీయులకు విజ్ఞప్తి చేశారు. ఈ ట్రెండ్ భారతదేశపు గొప్ప నేత సంప్రదాయాన్ని ప్రదర్శించడానికి మరియు కళాకారుల కుటుంబాలకు మద్దతు ఇవ్వడానికి సహాయపడుతుందని ఆయన అన్నారు.చేనేత వస్త్రాలు ధరించి భారతీయ చేనేత సంప్రదాయాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు చేనేత కార్మికులకు, చిరు వ్యాపారులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చేలా చిన్న వీడియోలను రూపొందించి సోషల్ మీడియాలో పోస్టు చేయాలని కోరారు. 1905 ఆగస్టు 7న బ్రిటీషర్లకు వ్యతిరేకంగా భారతీయులు స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించారని ఆయన తన వీడియో సందేశంలో తెలిపారు.

# కార్పొరేట్ పాఠశాలలా.. కబళించే స్కూళ్లా

హైదరాబాద్, ఆగస్టు 11, ఉత్తమమైన విద్య అందుతుందని.. ఉపాధ్యాయులు మెరుగ్గా బోధన చేస్తారని.. తమ పిల్లలు ప్రయోజకులవుతారని చాలామంది తల్లిదండ్రులు కార్పొరేట్ పాఠశాలలకు పంపిస్తుంటారు. అప్పులు తెచ్చి అయినా సరే తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తుంటారు.ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సదుపాయాలు ఉండవని.. ఉపాధ్యాయులలో జవాబుదారితనం కనిపించదని.. పిల్లలకు సక్రమమైన విద్య అందదని భావించే తల్లిదండ్రులు.. తమ స్తోమతకు మించినా సరే పిల్లలను కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పిస్తుంటారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని కాపాడి.. విద్యార్థులకు ఉత్తమమైన విద్య అందించి.. మెరుగైన సదుపాయాలు కల్పించాల్సిన యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. తల్లిదండ్రుల నుంచి లక్షలకు లక్షలు ఫీజులు వసూలు చేస్తూ.. విద్యార్థులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి.యాజమాన్యాల నిర్లక్ష్య వైఖరి విద్యార్థుల పాలిట శాపంగా మారుతుంది. పైగా ఆ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాల్సిన చోట దారుణంగా వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్ నగరానికి దగ్గరలో ఉన్న దమ్మాయిగూడ లో శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థుల మధ్య ర్యాగింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఒక పదవ తరగతి విద్యార్థిని తోటి విద్యార్థులు కర్రలతో కొట్టారు. బూటు కాళ్లతో తన్నారు.. ఈ విషయం ఆ విద్యార్థి తల్లిదండ్రుల పరిశీలనలో వెలుగులోకి వచ్చింది. తోటి విద్యార్థుల దాడిలో గాయపడిన అభిషేక్ అనే విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరోవైపు ఈ వ్యవహారాన్ని ఆసుపత్రి యాజమాన్యం మరో విధంగా చిత్రీకరించడం మొదలుపెట్టింది. ఆ విద్యార్థి మెట్లపై నుంచి పడినట్టు చెబుతోంది. వాస్తవానికి విద్యార్థుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండేలాగా యాజమాన్యం కృషి చేయాలి. విద్యార్థుల మెరుగైన భవిష్యత్తు కోసం బాటలు పరచాలి. తోటి విద్యార్థుల మధ్య ఈ స్థాయిలో ర్యాగింగ్ జరిగింది అంటే అది ముమ్మాటికి యాజమాన్యం నిర్లక్ష్యమే.ఉన్నతమైన చదువులు చెప్తారని శ్రీ చైతన్య లో చేర్పించాం. భారీగా ఫీజులు కూడా చెల్లిస్తున్నాం. అయినప్పటికీ ఇక్కడ విద్యార్థులకు సరైన సెక్యూరిటీ లేదు. తోటి విద్యార్థులు ఒకరిని ఒకరు కొట్టుకుంటుంటే మేనేజ్మెంట్ ఏం చేస్తోంది.. విద్యార్థులను పర్యవేక్షించాలి కదా.. నిత్యం కనిపెట్టుకొని ఉండాలి కదా. ఇంతలా దాడులు చేసుకున్నారంటే ఏమనుకోవాలి.. ర్యాగింగ్ విష సంస్కృతి ఈ స్థాయిలో పెచ్చరిల్లిపోతుంటే మేనేజ్మెంట్ నిశ్శబ్దంగా ఉంది.. మా అబ్బాయి పరిస్థితి చూస్తే దారుణంగా ఉందని అభిషేక్ తల్లిదండ్రులు చెప్తున్నారు. మరి దీనిపై యాజమాన్యం ఇంతవరకు స్పందించలేదు.

# రీల్ టీచర్స్...

ఖమ్మం, ఆగస్టు 11, ఆమె పేరు గౌతమి రాథోడ్. పేరుకు తగ్గట్టుగానే అందంగా ఉంటుంది. గొంతు కూడా శ్రావ్యంగా ఉంటుంది. పైగా గవర్నమెంట్ టీచర్. రీల్స్ చేయడం ఆమె చాలా ఇంట్రెస్ట్. తాను పనిచేస్తున్న స్కూల్లో రీల్స్ చేసేది.రీల్స్ ద్వారా ఆమె సోషల్ మీడియాలో విపరీతంగా పాపులారిటీ సంపాదించుకుంది. సెలబ్రిటీ అయిపోయింది. అనుసరించే వారు కూడా భారీగా ఉండటంతో ఆమె రేంజ్ పెరిగిపోయింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. వచ్చిన ఫేమ్ ద్వారా ఆమె కొన్ని ప్రవేట్ సంస్థలకు ప్రచారం చేస్తున్నట్టు విద్యాశాఖకు ఫిర్యాదులు అందాయి. దీంతో విద్యాశాఖ అధికారులు రంగంలోకి దిగారు. విచారణ నిర్వహించారు. ఆమెను సస్పెండ్ చేశారు.ఇటీవల ఆమెకు పోస్టు లభించింది. విధుల్లోకి వెళ్లాల్సిన ఆమె సోషల్ మీడియా ద్వారా ఒక వీడియో రిలీజ్ చేశారు. తన ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఆమె నిర్ణయం ఒక రకంగా సంచలనం కలిగించింది. ఆమె రీల్స్ చేస్తున్నప్పుడు తోటి ఉద్యోగులు హేళనకు గురిచేసారట. ఆమెను ఇబ్బంది పెట్టారట. తట్టుకోలేక కష్టపడి సాధించిన ఉద్యోగాన్ని వదులుకున్నానని గౌతమి సోషల్ మీడియాలో ఒక వీడియో విడుదల చేసింది. తాను స్కూల్లో.. విద్యార్థులకు పాఠాలు చెప్పే సమయంలో ఎటువంటి రీల్స్ చేయలేదని ఆమె స్పష్టం చేసింది. ఒకవేళ తాను అలా రీల్స్ చేసి ఉంటే విద్యార్థులు లేదా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు తనమీద ఫిర్యాదు చేసి ఉండేవారు కదా అంటూ ఆమె ప్రశ్నించారు.అప్పట్లో గౌతమి మీద విద్యాశాఖ సస్పెన్షన్ వేటు వేసినప్పుడు.. దానిని తొలగించాలని ఆమె ఏకంగా ఆరు నెలల పాటు విద్యాశాఖ కార్యాలయం చుట్టూ తిరిగింది. చైతన్య జై ని ఆమెను కనీసం పట్టించుకోలేదు. తనను మనిషిలా కూడా చూడలేదని గౌతమి తన సెల్ఫీ వీడియోలో వాపోయింది. ఒక దశలో చైతన్య ఆమెను ఉద్దేశించి నువ్వు నా దగ్గరికి రావద్దు.. వెళ్లిపో అంటూ గట్టిగా కేకలు వేశారని గౌతమి సోషల్ మీడియాలో వాపోయింది. తన మీద ఆరు నెలలపాటు సస్పెన్షన్ వేటి వేసినప్పుడు తోటి ఉపాధ్యాయులు.. ఉపాధ్యాయ సంఘాలు కనీసం అండగా నిలబడలేదని గౌతమి వాపోయింది.సరిగ్గా 6 నెలల క్రితం గౌతమి గురించి తెలంగాణ వ్యాప్తంగా చర్చ నడిచింది. రీల్స్ టీచర్గా ఆమె పేరు పొందింది. అయితే వచ్చిన పేరును ఆమె ఒక ప్రైవేట్ సంస్థ ప్రమోషన్ కోసం ఉపయోగించుకుంది.

అందువల్ల విద్యాశాఖ అధికారులు ఆమె వ్యవహరించిన తీరును తీవ్రంగా తప్పుపట్టారు. అంతేకాదు ఆమెను సస్పెన్షన్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అప్పట్లో ఈయన వ్యవహారం తెలంగాణ వ్యాప్తంగా సంచలనంగా మారింది. చివరికి ఆమె తన ఉద్యోగానికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

## నారాయణపూర్ ముంపు బాధితుల పోరాటం

### - "ఇళ్లకు కాదు.. గ్రామానికే పరిహారం ఇవ్వాలి"

### - బాధితులకు అండగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కరీంనగర్ జిల్లాలోని గంగాధర మండలం నారాయణపూర్ గ్రామంలో చెరువు విస్తరణ, ఎల్లంపల్లి జలాశయం నుంచి నీటి నింపుదలతో ముంపు ముప్పు పెరిగిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు విస్తరణ కోసం ప్రభుత్వం నిధులు కేటాయించడంతో పాటు, కట్ట కింద ఉన్న కొన్ని ఇళ్లకు మాత్రమే పరిహారం మంజూరు చేయడాన్ని గ్రామస్థులు వ్యతిరేకిస్తున్నారు.నారాయణపూర్‌తో పాటు ఇస్తారుపల్లి, చర్లపల్లి, ఎన్.మంగపేట గ్రామాలకు ముంపు భయం ఉందని, గ్రామంలోని సుమారు 300 కుటుంబాలకు పరిహారం అందించి మొత్తం గ్రామాన్నే ముంపు గ్రామంగా ప్రకటించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.ఎన్నికల సమయంలో ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హామీలు ఇచ్చారని ... ఇప్పుడు ముంపు సమస్యపై ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి భయపెడుతున్నారంటూ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇటీవల గ్రామంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో నమోదైన కేసులను ఎత్తివేయాలని కూడా డిమాండ్ చేస్తున్నారు.ఈ నేపథ్యంలో నారాయణపూర్ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దీక్షకు చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సంఘీభావం తెలిపి బాధితులకు అండగా నిలిచారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, తమ సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రజలపై కేసులు పెట్టడం సరికాదని సుంకె రవిశంకర్ విమర్శించారు. "ప్రజల గొంతు నొక్కడం కాదు.. వారి సమస్యకు పరిష్కారం చూపాలి. నారాయణపూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించి బాధితులకు న్యాయం చేయాలి" అని డిమాండ్ చేశారు.నారాయణపూర్ ముంపు సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు

# డబుల్‌డెక్ కారిడార్ డీపీఆర్ రెడీ

హైదరాబాద్, ఆగస్టు 11, హైదరాబాద్?ముంబయి జాతీయ రహదారిలో చందానగర్?గంగారం వద్ద ఫ్లైఓవర్‌పై మెట్రో వయాడక్ట్ ఉండేలా డబుల్‌డెక్ డిజైన్‌ను ఔఊంఎ, ఊఓఖీఓ సంయుక్తంగా ఖరారు చేశాయి. మియాపూర్?పటాన్‌చెరు మెట్రో విస్తరణతో సమన్వయం చేసేందుకు ఈ నమూనాను ప్రతిపాదించారు. మరోవైపు ఎల్బీనగర్?హయత్‌నగర్‌లోనూ డబుల్‌డెక్ నిర్మించాలని మంత్రి కోమటిరెడ్డి కోరుతున్నారు. అయితే అక్కడ మెట్రో అలైన్‌మెంట్ ఇప్పటికే సర్వీస్ రోడ్డు వెంట ఖరారై,డీపీఆర్ కేంద్రానికి చేరడంతో మార్పులు చేస్తే ఆలస్యం, వ్యయం పెరుగుతాయని అధికారులు చెబుతున్నారు.హైదరాబాద్ నగరంలో రోడ్డు, మెట్రో మౌలిక వసతులను సమన్వయంతో అభివృద్ధి చేసేందుకు మరో కీలక అడుగు పడింది. నగరం నుంచి ముంబయి వైపు వెళ్లే జాతీయ రహదారి మార్గంలో చందానగర్?గంగారం ప్రాంతం వద్ద డబుల్‌డెక్ నిర్మాణానికి సంబంధించిన డిజైన్‌ను జాతీయ రహదారుల సంస్థ, హైదరాబాద్ మెట్రోరైలు లిమిటెడ్ సంయుక్తంగా ఖరారు చేసినట్లు తెలిసింది. ఈ మార్గంలో ఒకే కారిడార్‌లో రహదారి ఫ్లైఓవర్‌తో పాటు దాని పైన మెట్రో వయాడక్ట్ నిర్మించేలా డిజైన్ రూపొందించారు.ప్రస్తుతం మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు మెట్రోరైలు విస్తరణకు ప్రతిపాదనలు ఉన్నాయి. ఇదే మార్గంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు జాతీయ రహదారుల సంస్థ ఫ్లైఓవర్ల నిర్మాణాన్ని చేపడుతోంది. ఒకే ప్రాంతంలో భవిష్యత్తులో రోడ్డు ఫ్లైఓవర్, మెట్రో మార్గాలను వేర్వేరుగా నిర్మిస్తే భూసేకరణ, స్థల లభ్యత, నిర్మాణ వ్యయం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. దీంతో రెండు ప్రాజెక్టులను సమన్వయం చేసి డబుల్‌డెక్ రూపంలో నిర్మించాలనే ఆలోచనకు ప్రాధాన్యం లభించింది.ఫ్లైఓవర్ నిర్మించాల్సిన ప్రాంతాల్లో భవిష్యత్తులో మెట్రో విస్తరణ ఉంటే ముందుగానే డబుల్‌డెక్ నమూనాను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గతంలో సూచించారు. కింద రహదారి వాహనాల కోసం ఫ్లైఓవర్, దాని పైన మెట్రో వయాడక్ట్ ఉండే విధంగా ఈ నిర్మాణం ఉంటుంది. నాగ్‌పుర్‌లో ఇలాంటి డబుల్‌డెక్ కారిడార్‌ను దేశంలోనే తొలిసారిగా నిర్మించారు. ఒకే మార్గంలో రెండు రవాణా వ్యవస్థలకు స్థలం కల్పించడం ద్వారా భూసేకరణ అవసరాన్ని తగ్గించడంతో పాటు నగరాల్లో పరిమిత స్థలాన్ని సమర్థంగా వినియోగించుకోవచ్చన్నది ఈ నమూనా ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు. ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ మార్గంలోనూ డబుల్‌డెక్ నిర్మించాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పట్టుబడుతున్నారు. అయితే చందానగర్?గంగారం మార్గంతో పోలిస్తే ఇక్కడ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఎల్బీనగర్?హయత్‌నగర్ మెట్రో విస్తరణకు సంబంధించిన అలైన్‌మెంట్‌ను ఇప్పటికే సర్వీస్ రహదారి వెంబడి ప్రతిపాదించారు. దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు కూడా కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. ఇప్పుడు ఈ అలైన్‌మెంట్‌ను మార్చి ఫ్లైఓవర్‌పై మెట్రోను ఏర్పాటు చేసేలా డబుల్‌డెక్ నమూనాను అమలు చేస్తే ఇప్పటికే సిద్ధం చేసిన డీపీఆర్‌లో మార్పులు చేయాల్సి ఉంటుంది.డీపీఆర్‌లో మార్పులు, కొత్త డిజైన్, సాంకేతిక పరిశీలనలు, అనుమతుల ప్రక్రియ కారణంగా ప్రాజెక్టు అమలులో జాప్యం జరిగే అవకాశం ఉందని మెట్రోరైలు అధికారులు మంత్రికి వివరించినట్లు సమాచారం. అదనంగా నిర్మాణ వ్యయం కూడా పెరిగే అవకాశముందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ప్రతిపాదించిన మెట్రో అలైన్‌మెంట్‌ను కొనసాగిస్తే పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉంటుందని వారు సూచించినట్లు తెలిసింది.మరోవైపు హైదరాబాద్ మెట్రో రెండోదశకు కేంద్ర అనుమతులు త్వరలో వచ్చే అవకాశం ఉందన్న ఆశాభావం ప్రభుత్వ వర్గాల్లో వ్యక్తమవుతోంది. మరో రెండు నెలల్లో రెండోదశకు సంబంధించిన అనుమతులు వస్తాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆశాభావం వ్యక్తం చేసిన నేపథ్యంలో, మెట్రో మార్గాల తుది అలైన్‌మెంట్, ఫ్లైఓవర్లతో సమన్వయం వంటి అంశాలు కీలకంగా మారాయి. భవిష్యత్తులో ట్రాఫిక్ పెరుగుదలను దృష్టిలో పెట్టుకుని రహదారి, మెట్రో ప్రాజెక్టులను సమగ్రంగా ప్రణాళిక చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు

# 71 లక్షల మంది ఓట్ల తొలగింపు..

## ముగిసిన ఎస్ఐఆర్ డెడ్‌లైన్..

## తుది జాబితాపై తీవ్ర ఉత్కంఠ!

హైదరాబాద్, ఆగస్టు 11, తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రంలోని 3.38 కోట్ల మంది ఓటర్లలో దాదాపు 71 లక్షల మంది ఓటర్లు అన్‌కలెక్టబుల్ కేటగిరీలో ఉన్నట్లు తేలింది. ఇందులో సగానికి పైగా హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోనే ఉన్నట్లు వెల్లడైంది. ఇక నేటితో ఎస్ఐఆర్ గడువు ముగియడంతో ఇప్పుడు ఫారాల పరిశీలన, ధ్రువీకరణ అనంతరం తుది ఓటర్ల జాబితా ఎలా ఉండబోతోందన్న దానిపై సర్వత్రా తీవ్ర ఉత్కంఠ నెలకొంది.తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో కీలక ఘట్టం ముగిసింది. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించేందుకు ఇచ్చిన గడువు ముగిసింది. దీంతో రాష్ట్రంలో దాదాపు 71 లక్షల మంది ఓటర్ల వివరాలపై ఇప్పుడు తీవ్ర ఆసక్తి నెలకొంది. ఈ ఓటర్లను అన్‌కలెక్టబుల్ కేటగిరీలో గుర్తించిన నేపథ్యంలో.. తుది ఓటర్ల జాబితాలో వీరి పేర్లు కొనసాగుతాయా లేక తొలగిస్తారా అనేది కీలకంగా మారింది. తెలంగాణలో మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. సుమారు 70.8 లక్షల మంది ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాలు అందుబాటులో లేని లేదా సేకరించలేని కేటగిరీలో ఉన్నట్లు తాజా గణాంకాలు వెల్లడించాయి.ఈ సంఖ్య రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో దాదాపు 21 శాతానికి సమానమని ఎన్నికల సంఘం గణాంకాలు పేర్కొంటున్నాయి. వీరిలో సుమారు 9.1 లక్షల మంది మరణించినవారు ఉండగా.. 10.3 లక్షల మంది గైర్హాజరు లేదా ఆచూకీ లభించని వారిగా గుర్తించారు. మరో 43 లక్షల మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయినట్లు.. 6.6 లక్షల మంది డూప్లికేట్ ఓటర్లుగా గుర్తించినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.ఇప్పటికే అన్‌కలెక్టబుల్ కేటగిరీలోకి వచ్చే ఓటర్ల పేర్లను తొలగించే ప్రక్రియ ఉంటుందని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సీ. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే గడువు ముగియగా.. ప్రక్రియ పూర్తి అయ్యే సమయానికి మరిన్ని ఎన్యూమరేషన్ ఫారాలు అందే అవకాశం ఉండటంతో తుది తొలగింపు సంఖ్యలో మార్పు రావచ్చని భావిస్తున్నారు. ఆగస్ట్ 9వ తేదీ నాటికి సుమారు 3.2 లక్షల ఫారాలు మాత్రమే డిజిటలైజ్ కావాల్సి ఉండగా.. మిగిలిన ప్రక్రియను అధికారులు పూర్తి చేయనున్నారు.ఎస్ఐఆర్‌లో అత్యధికంగా అన్‌కలెక్టబుల్ ఫారాలు నమోదైన ప్రాంతంగా గ్రేటర్ హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతం నిలిచింది. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాలు కలిపి సుమారు 41.5 లక్షల అన్‌కలెక్టబుల్ ఫారాలు నమోదు అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 70.8 లక్షలతో పోలిస్తే ఇవి దాదాపు 58.6 శాతానికి సమానం.ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల వివరాలను సేకరించడంలో అనేక ఇబ్బందులు ఎదురైనట్లు తెలుస్తోంది. అద్దె ఇళ్లలో ఉండేవారు తరచూ ఇళ్లను మార్చడం.. శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడం.. మూసివేసిన ఇళ్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో ఓటర్లను గుర్తించడం కష్టంగా ఉండటం, మరణించిన ఓటర్ల పేర్లు కొనసాగడం వంటి కారణాలు అన్‌కలెక్టబుల్ కేసులు పెరగడానికి కారణాలుగా కనిపిస్తున్నాయి.మరోవైపు ఉత్తర, పశ్చిమ తెలంగాణలో ఓటర్ల వివరాల్లో అనామలీస్ (వివరాల్లో తేడా ఉండటం) శాతం ఎక్కువగా నమోదైంది. జిల్లా స్థాయిలో ఆదిలాబాద్‌లో 28.5 శాతం ఓటర్ల వివరాల్లో అనామలీస్ గుర్తించారు. నిజామాబాద్‌లో 27.4 శాతం, నిర్మల్‌లో 26.1 శాతం, మెదక్‌లో 24.6 శాతం, కామారెడ్డిలో 23.9 శాతం, సంగారెడ్డిలో 23.8 శాతం నమోదు అయ్యాయి. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూస్తే ఆదిలాబాద్‌లో 30.4 శాతం అనామలీస్‌తో అత్యధికంగా ఉండగా.. నారాయణఖేడ్‌లో 29.3 శాతం, నిజామాబాద్ అర్బన్‌లో 28.4 శాతం, షాద్‌నగర్‌లో 28.3 శాతం, నిర్మల్‌లో 28.29 శాతం, నిజామాబాద్ రూరల్‌లో 28.1 శాతం నమోదయ్యాయి.ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇప్పటివరకు సుమారు 2.64 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేసి.. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ధ్రువీకరించినట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇది రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో 78.1 శాతానికి సమానం. ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు గడువు ముగియడంతో ఇప్పుడు అధికారుల తదుపరి చర్యలపై దృష్టి నెలకొంది. ఇప్పటికే అందిన ఫారాల పరిశీలన, డేటా ధ్రువీకరణ, అభ్యంతరాలు-దరఖాస్తుల పరిశీలన వంటి ప్రక్రియల తర్వాతే తుది ఓటర్ల జాబితాలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయన్నది స్పష్టమవుతుంది.మరీ ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్‌లో భారీగా అన్‌కలెక్టబుల్ కేసులు.. ఉత్తర-పశ్చిమ తెలంగాణలో అధిక అనామలీస్ నమోదైన నేపథ్యంలో.. ఎస్ఐఆర్ తుది ఫలితాలు రాష్ట్ర ఓటర్ల జాబితాపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందని అర్థమవుతోంది. ప్రస్తుతం 71 లక్షలుగా ఉన్న అన్‌కలెక్టబుల్ ఓటర్ల సంఖ్యలో చివరకు ఎంతమంది పేర్లు తొలగింపునకు గురవుతాయన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

## కలగర లో భారీ చోరీ

ఎన్టీఆర్ విస్సన్నపేట మండలం కలగర గ్రామంలో ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. కలగర గ్రామానికి చెందిన (పోస్ట్ మాస్టర్) పసుపులేటి శ్రీనివాసరావు ఇంట్లోకి చొరబడిన దుండగులు సుమారు భారీగా బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. విషయం తెలుసుకున్న విస్సన్నపేట ఎస్సై ఎం అర్జున్ రావు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు.

# హైదరాబాద్ ట్రాఫిక్, అధిక ఉష్ణోగ్రతలు..

## ఏటా 200 గంటలు నష్టపోతున్న నగరవాసులు

హైదరాబాద్, ఆగస్టు 11, హైదరాబాద్‌వాసులకు ట్రాఫిక్ రద్దీ, పెరుగుతున్న రాత్రి ఉష్ణోగ్రతలు కొత్త సమస్యగా మారాయి. తాజా అధ్యయనాల ప్రకారం హైదరాబాద్ నగర ప్రజలు ఈ రెండు సమస్యలతో ఏటా 200 గంటలు నష్టపోతున్నారని తేలింది. ట్రాఫిక్ కారణంగా ఏడాదికి సుమారు 123 గంటలు కోల్పోతుండగా.. రాత్రి అధిక ఉష్ణోగ్రతల కారణంగా మరో 75 గంటల నిద్రను కోల్పోతున్నారని వెల్లడైంది. ఇక హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ స్థాయి 55.5 శాతంగా ఉన్నట్లు తేల్చింది. వాహనాల పెరుగుదల, రహదారుల కొరత, ప్రజా రవాణా సామర్థ్యం, వాతావరణ మార్పులు ఈ సమస్యలకు ప్రధాన కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు. హైదరాబాద్‌లో జీవనం రోజురోజుకూ వేగంగా మారుతున్నా.. నగరవాసులు మాత్రం భారీగా సమయాన్ని నష్టపోతున్నారు. ఒకవైపు రోడ్లపై పెరుగుతున్న ట్రాఫిక్ గంటల కొద్దీ సమయాన్ని మింగేస్తుండగా.. మరోవైపు రాత్రివేళ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు నగరవాసులకు నిద్రను దూరం చేస్తున్నాయి. తాజా అధ్యయనాల ప్రకారం హైదరాబాద్‌వాసులు ట్రాఫిక్ రద్దీ, వేడి రాత్రుల కారణంగా ఏడాదికి దాదాపు 200 గంటల సమయాన్ని కోల్పోతున్నారని వెల్లడైంది. అంటే ప్రతీ సంవత్సరం 8 రోజులకు పైగా సమయం హైదరాబాద్ నగర జీవన పరిస్థితుల కారణంగా వృథా అవుతున్నట్టేనని తేలింది. టామ్‌టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ తాజా రిపోర్ట్ ప్రకారం హైదరాబాద్‌లో ప్రయాణికులు తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ కారణంగా ఏడాదికి సుమారు 123 గంటలు కోల్పోతున్నారని తేలింది. ఇది 5 రోజులకు సమానం. నగరంలో ట్రాఫిక్ రద్దీ స్థాయి 55.5 శాతంగా నమోదైంది. సాధారణంగా 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి సగటున 32.37 నిమిషాలు పడుతుండగా.. సాయంత్రం రద్దీ వేళల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. అదే 10 కిలోమీటర్ల ప్రయాణానికి సగటున 39.5 నిమిషాలు పడుతున్నట్లు ఈ నివేదిక వెల్లడించింది. హైదరాబాద్‌లో వాహనాల సంఖ్య భారీగా పెరగడం ఈ పరిస్థితికి ప్రధాన కారణాల్లో ఒకటిగా నిపుణులు చెబుతున్నారు. నగరంలో వాహనాల సంఖ్య దాదాపు 80 లక్షలకు చేరినట్లు ఒక అంచనా ఉంది. దీంతో గత దశాబ్దంలో వాహనాల సంఖ్య దాదాపు రెట్టింపు అయినప్పటికీ.. అందుకు అనుగుణంగా రహదారుల విస్తరణ, ప్రజా రవాణా సామర్థ్యం పెరగలేదని నిపుణులు పేర్కొంటున్నారు. మహానగరాల్లో ట్రాఫిక్ వేగం గంటకు 25 నుంచి 30 కిలోమీటర్ల మధ్య ఉండటం ఆదర్శంగా భావిస్తే.. హైదరాబాద్‌లో సగటు వేగం 15 కిలోమీటర్లకు మాత్రమే పరిమితమవుతోందని తేలింది. ఇక సాయంత్రం వేళ పీక్ అవర్స్‌లో ఇది 10 కిలోమీటర్లకు కూడా పడిపోతోందని రిటైర్డ్ ఇంజనీర్ టి సత్యనారాయణరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌వాసులు సమయాన్ని కోల్పోవడం కేవలం రోడ్లపైనే ఆగిపోవడం లేదు. రాత్రివేళ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కూడా నగరవాసులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అమెరికాకు చెందిన క్లైమేట్ సెంట్రల్ సంస్థ 1,338 నగరాలపై నిర్వహించిన విశ్లేషణలో హైదరాబాద్‌లో అధిక రాత్రి ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు ఏడాదికి సుమారు 75 గంటల నిద్రను కోల్పోతున్నట్లు తేల్చింది. ఇందులో సుమారు 7 గంటల నిద్ర నష్టానికి నేరుగా వాతావరణ మార్పులే కారణమని ఈ అధ్యయనం అంచనా వేసింది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఏడాదికి సగటున 56 గంటల నిద్ర కోల్పోతుండగా.. హైదరాబాద్‌లో ఈ సంఖ్య 75 గంటలుగా ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. 2020 నుంచి 2025 వరకు ఉన్న డేటాను విశ్లేషించిన ఈ అధ్యయనం వెల్లడించిన వివరాల ప్రకారం దక్షిణ భారతదేశంలోని ప్రజలు వేడి రాత్రుల కారణంగా ఏడాదికి 70 నుంచి 90 గంటల వరకు నిద్ర కోల్పోతున్నారని తేలింది. పట్టణ ప్రాంతాల్లో కాంక్రీట్ భవనాలు, తారు రోడ్లు పగటి వేడిని ఎక్కువగా గ్రహించి రాత్రివేళ నెమ్మదిగా విడుదల చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో సూర్యాస్తమయం అయిన తర్వాత కూడా నగరాల్లో ఉష్ణోగ్రతలు త్వరగా తగ్గకపోవడం వేడి సమస్యను మరింత తీవ్రం చేస్తోంది. పని వేళలు, ఒత్తిడి, ఆరోగ్య పరిస్థితులు, కెఫైన్ వినియోగం, వెలుతురు, శబ్దం, బెడ్‌రూమ్ పరిస్థితులు, తేమ వంటి అనేక అంశాలు నిద్ర నాణ్యతను ప్రభావితం చేస్తాయని పేర్కొంటున్నారు. అయితే వాతావరణ మార్పులు, పెరుగుతున్న రాత్రి ఉష్ణోగ్రతలు కూడా ఇప్పుడు తగినంత నిద్రకు అడ్డంకులుగా మారుతున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. మొత్తంగా చూస్తే.. హైదరాబాద్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్, రాత్రివేళ వేడి కలిసి నగరవాసుల విలువైన సమయాన్ని, విశ్రాంతిని రెండింటినీ హరిస్తున్నాయని అర్థం అవుతోంది.

# బీఆర్ఎస్ పార్టీని ఆక్రమించడమే లక్ష్యంగా బీజేపీ

వరంగల్ ఆగస్టు 11, తెలంగాణలో సంచలనాలు సృష్టించేందుకు బీజేపీ పదునైన వ్యూహానికి పదును పెట్టింది. ఢిల్లీ వేదికగా జరిగిన ఒక కీలక ఉన్నత స్థాయి భేటీలో, తెలంగాణ కమలనాథులకు పార్టీ అధిష్ఠానం అత్యంత స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. పదేళ్ల పాటు అధికారంలో ఉండి, విపక్షంలోకి వెళ్లాక తీవ్రమైన సవాళ్లతో సతమతమవుతున్న బీఆర్ఎస్ పార్టీని సంపూర్ణంగా ఆక్రమించడమే లక్ష్యంగా బీజేపీ అడుగులు వేస్తోంది. గులాబీ పార్టీ నైతిక ధైర్యం దెబ్బతీసి, తెలంగాణలో ఇకపై కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ మధ్యనే పోరాటం సాగాలని దిశానిర్దేశం చేసింది. ఈ మేరకు పార్టీ కేడర్ పనిచేయాలని స్పష్టం చేసింది. ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించడంలో బీఆర్ఎస్ ఎక్కడైతే వెనకబడుతోందో, ఆ ప్రతికూలతనే తమ రాజకీయ అవకాశంగా మలుచుకోవాలని బీజేపీ యోచిస్తోంది. ప్రజాపోరాటాల్లో బీఆర్ఎస్‌కు ఎలాంటి మైలేజ్ దక్కకుండా చెక్ పెడుతూ, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసే ఏకైక నిజమైన విపక్షం తమదేనని నిరూపించుకోవాలని భావిస్తోంది. విద్యార్థులు, రైతులు, చేతివృత్తుల వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు, ఆరు గ్యారెంటీలు, రైతు రుణాలు, నిరుద్యోగ భృతి, మహిళా పథకాల అమలులో క్షేత్రస్థాయిలో వ్యక్తమవుతున్న అసంతృప్తిని క్షేత్రస్థాయి ఆందోళనల ద్వారా ఆయుధంగా మలచుకోవాలని అధిష్ఠానం పిలుపునిచ్చింది. కాంగ్రెస్ హామీలు ఉత్తుత్తివేనని, ప్రధాని నరేంద్ర మోదీ సంక్షేమ మోడల్ మాత్రమే శాశ్వతమని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ప్రధాన్ ఎజెండాకొంతకాలంగా తెలంగాణ బీజేపీని వేధిస్తున్న అంతర్గత విభేదాలపై కేంద్ర నాయకత్వం సీరియస్ క్లాస్ తీసుకుంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర కమిటీ సభ్యులు తమ వ్యక్తిగత ప్రయోజనాలు, వ్యాఖ్యలను పక్కనబెట్టి ఒకే టీమ్‌గా పనిచేయాలని స్పష్టం చేసింది. ఒకరిపై ఒకరు బహిరంగ విమర్శలు చేసుకుంటే ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పిన నేతలు, సమష్టి నాయకత్వంతో పోరాడితేనే 2028లో అధికార పీఠం సాధ్యమవుతుందని మార్గదర్శనం చేశారు. కేవలం అర్బన్ ఏరియాలకే పరిమితం కాకుండా గ్రామ పంచాయతీల నుంచి పార్టీ నెట్‌వర్క్‌ను బలపరచాలని ఆదేశించారు. త్వరలో జరగబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలను సెమీఫైనల్స్‌గా భావించి సమరశంఖం పూరించనున్నారు. మత ఆధారిత రిజర్వేషన్లు, ముస్లిం ఓటు బ్యాంక్ రాజకీయంపై కాంగ్రెస్‌ను నిలదీస్తూనే, సనాతన ధర్మ పరిరక్షణను ఎజెండాగా మార్చుకోవాలని సూచించారు. అదే సమయంలో కేంద్రం నుంచి తెలంగాణకు అందిన ఎయిమ్స్, కాజీపేట వ్యాగన్ తయారీ యూనిట్, ఎలివేటెడ్ కారిడార్లు, జాతీయ రహదారుల నిధుల వివరాలను గడపగడపకూ చేరవేయనున్నారు. ఈ ఢిల్లీ భేటీతో తెలంగాణలో బీజేపీ వ్యూహం రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. బీఆర్ఎస్‌ను గతంగానూ, కాంగ్రెస్‌ను వైఫల్యంగానూ చిత్రీకరిస్తూ.. బీజేపీ మాత్రమే రాష్ట్ర భవిష్యత్తు అనే నరేటివ్‌ను బలంగా తీసుకెళ్లాలని కమల దళం యుద్ధానికి సిద్ధమవుతోంది.

# ఘనంగా మైసమ్మ తల్లి బోనాలు

### దసరా నాటికి నూతన ఆలయం నిర్మిస్తాం: ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ కోతీరాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని మైసమ్మ తల్లి ఆలయం వద్ద మంగళవారం బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. సరస్వతి నగర్, గిద్దె పెరుమాండ్ల కాలనీవాసుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి శాశ్వత ఆలయం నిర్మించాలని భక్తులు కోరగా, వచ్చే దసరా నాటికి ప్రజల సహకారంతో నూతన ఆలయాన్ని నిర్మిస్తామని గంగుల హామీ ఇచ్చారు. శివశక్తుల పూనకాలు, మహిళా భక్తుల బోనాలతో వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక కాలనీవాసులు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# 2028 గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్

హైదరాబాద్ ఆగస్టు 11, 2028 అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో మళ్లీ అధికారంలోకి రావడమే ఏకైక లక్ష్యంగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సరికొత్త సంస్థాగత వ్యూహానికి తెరలేపింది. సాధారణంగా కేడర్‌కు ఇచ్చే పార్టీ పదవులను ఈసారి నేరుగా గెలిచిన ప్రజాప్రతినిధులకే కట్టబెడుతోంది. 2028 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని మెజార్టీతో మళ్లీ అధికారంలోకి వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే వ్యక్తం చేస్తున్న ధీమా వెనుక ఈ పక్కా సంస్థాగత ప్రణాళికే కారణమని తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ప్రక్షాళన ప్రక్రియను పార్టీ అధిష్టానం ఏడాది కిందటే ప్రారంభించింది. జనవరి 2024లో ఎమ్మెల్యే కోటా కింద ఎమ్మెల్సీగా ఎన్నికైన బి. మహేష్ కుమార్ గౌడ్‌కు సెప్టెంబర్ 2024లో టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత కీలక పదవుల్లో ప్రజాప్రతినిధులకు పెద్దపీట వేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షులుగా నల్గొండ ఎంపీ కె. రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, బసవరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయని రాజేందర్ రెడ్డి, సి. వంశీకృష్ణలకు కట్టబెట్టింది. అలాగే టీపీసీసీ ప్రధాన కార్యదర్శులుదా ఎమ్మెల్యేలు వేడ్మ బొజ్జు, డాక్టర్ చిట్టెం పరిణికా రెడ్డి, డాక్టర్ మట్ట రాగమయిలను నియమించింది.. పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్ష పదవులను కూడా ప్రజాప్రతినిధులకే కేటాయించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్యను టీపీసీసీ ఓబీసీ సెల్ ఛైర్మన్‌గా, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను ఎస్సీ సెల్ ఛైర్మన్‌గా, ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌ను ఎస్టీ సెల్ అధిపతిగా నియమించారు. నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవికి టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్ బాధ్యతలు వహించారు. తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పరిణికా రెడ్డి పేరును పరిశీలించినప్పటికీ, వ్యక్తిగత కారణాలతో ఆమె తిరస్కరించడంతో వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణను ఆ పదవిలో నియమించారు. ఇటీవల భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్‌గా నియమించగా, జిల్లా స్థాయిలోనూ ఐదుగురు ఎమ్మెల్యేలను డీసీసీ అధ్యక్షులుగా నియమించారు. వారిలో బీర్ల ఐలయ్య, మేడిపల్లి సత్యం, చిక్కుడు వంశీకృష్ణ, వేడ్మ బొజ్జు , ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఉన్నారు. ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు పార్టీ బాధ్యతలు ఇవ్వడం వెనుక ఉన్న సామాజిక, రాజకీయ కారణాలను టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్షాల విమర్శలను, ఆరోపణలను బలంగా ఎదుర్కోవాలంటే అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు ముందుకు రావడం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. పవర్ ఉన్న నేతలు కౌంటర్ ఇచ్చినప్పుడే దానికి ప్రాధాన్యత, విలువ ఉంటాయి. పదవులతో పాటు జవాబుదారీతనం, బాధ్యత పెరుగుతాయి. ఇది క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతుందనేది కాంగ్రెస్ పార్టీ ఆలోచనగా ఉంది. పార్టీ అధిష్టానం త్వరలోనే ఎంపీలు లేదా ఎమ్మెల్యేల నుంచి కనీసం ఇద్దరిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా నియమించే ఆలోచనలో ఉంది. ప్రస్తుతం కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ పేర్లు ఈ రేసులో బలంగా వినిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో కేవలం పార్టీ పదవులే కాకుండా, ప్రభుత్వం తరపున ఇచ్చే పలు కీలక నామినేటెడ్ పోస్టులను కూడా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అప్పగించి, పార్టీ సంస్థాగత పునాదులను రాష్ట్రవ్యాప్తంగా మరింత పటిష్టం చేయాలనేది కాంగ్రెస్ ప్రణాళిక.

# కాంగ్రెస్ నేత గూడూరు స్వామి రెడ్డి తీరుపై హుజురాబాద్ జర్నలిస్టులు మండిపాటు

### -రేపటి నుంచి ఆందోళనలకు పిలుపు..



హుజురాబాద్ జర్నలిస్టుల ఇండ్ల స్థలాల వివాదంపై స్పందించడానికి నిరాకరించడమే కాకుండా, స్వపక్ష ప్రభుత్వంపైనే తీవ్ర వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకుడు గూడూరి స్వామి రెడ్డి వైఖరిని నిరసిస్తూ రేపటి నుంచి దశలవారీ ఆందోళనలు చేపట్టనున్నట్లు ప్రెస్ క్లబ్ అధ్యక్ష,కార్యదర్శి కాయిత రాములు, కామని రవీందర్ లు ప్రకటించారు.?గత ప్రభుత్వంలో జర్నలిస్టులకు కేటాయించిన ఇండ్ల స్థలాలపై స్వామి రెడ్డి కోర్టులో కేసు వేసిన నేపథ్యంలో, సమస్యను పరిష్కరించుకోవాలనే ఉద్దేశంతో ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ఆయన స్వగ్రామమైన ఇప్పల నర్సింగాపూర్ లో ని ఆయన గృహానికి వెళ్లి బొకే ఇచ్చి విజ్ఞప్తి చేశారు. అయితే, కేసును ఉపసంహరించుకోవడానికి ఆయన నిరాకరించినట్లు వారు పేర్కొన్నారు.?ఈ క్రమంలోనే గూడూరు స్వామి రెడ్డి స్పందిస్తూ... "ఇదో చెత్త ప్రభుత్వం, ఈ ప్రభుత్వంతో పనులు అయ్యేది లేదు.. పోయేది లేదు" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు వారు తెలిపారు.?కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత హుజురాబాద్ నియోజకవర్గంలో అన్ని రకాల ప్రయోజనాలు పొందిన స్వామి రెడ్డి, సొంత ప్రభుత్వంపైనే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం వచ్చాక తన సతీమణి గూడూరు రాజేశ్వరిని మార్కెట్ చైర్మన్‌గా నామినేట్ చేయించుకోవడంతో పాటు, ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో కోడలు గూడూరు అంజలి ను మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా ఎంపిక చేయడంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్ బాబుతో పాటు మంత్రుల సహకారాన్ని ఆయన పూర్తిగా వాడుకున్నారని జర్నలిస్టులు గుర్తుచేశారు.?సొంత పదవుల కోసం ప్రభుత్వాన్ని వాడుకుని, జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయంలో మాత్రం పట్టుదలకు పోతూ ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని ప్రెస్ క్లబ్ తీవ్రంగా ఖండించింది. బొకే ఇవ్వడానికి వెళ్లిన జర్నలిస్ట్ ప్రతినిధుల పట్ల ఆయన వ్యవహరించిన తీరుకు నిరసనగా రేపటి నుంచి ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హుజురాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, కార్యదర్శి కామని రవీంద ర్ లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ లు కోరం సుధాకర్ రెడ్డి,నంబీ భరణికుమార్ , కేదాసి శ్రీధర్, టేకుల సాగర్, ఎడ్ల కుమార్,నిమ్మటూరి సాయి కృష్ణ, పబ్బతిరుపతి, మచ్చిక చందు, గొపగాని మహేష్, ఎన్ టివి రాజు, పోతరాజు సంపత్,పయిమ్, నాగవెల్లి రాజు,భారత రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు రైజింగ్ సన్ విద్యార్థి




పెద్దపల్లి రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు రైజింగ్ సన్ విద్యార్థి ముబస్సిర్ ఎంపికైనట్లు పాఠశాల కరెస్పాండెంట్ సయీద్ అహ్మద్ తెలిపారు. ఈనెల 4న సుల్తానాబాద్ పట్టణం లోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియే షన్ ఆధ్వర్యంలో జరిగిన టేబుల్ టెన్నిస్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరి చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. కాగా ఈనెల 12న సికింద్రాబాద్ జి.ఎస్.ఎం టేబుల్ టెన్నిస్ అకాడమిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొననున్న విద్యార్థి ముబస్సిర్, వ్యాయామ ఉపాధ్యాయుడు తగురం తిరుపతిని పాఠశాల కరస్పాండెంట్ సయీద్ అహ్మద్ ప్రధానోపాధ్యాయు లు హకీమ్ ఖాన్ అభినందిం చారు. అలాగే రాష్ట్రస్థాయి లో రాణించి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

# గ్రామీణ వైద్య భద్రతకు భరోసా కల్పించాలి

## (హెచ్.ప్రతాప్)

ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం బస్వాపురంలో 14 ఏళ్ల ఎనిమిదో తరగతి విద్యార్థిని చల్లా హేమశ్రీ మృతి ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. జలుబు, జ్వరంతో బాధపడుతున్న బాలికకు స్థానిక ఆర్ఎంపీ ఇంజెక్షన్ ఇచ్చిన అనంతరం శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెను ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల ప్రకారం, సంబంధిత వ్యక్తికి నిర్వహించిన బ్రీత్ అనలైజర్ పరీక్షలో మద్యం సేవించినట్లు తేలింది. ఈ ఘటనపై సోషల్ మీడియాలో విస్తృత చర్చ జరుగుతున్నప్పటికీ, చికిత్సలో జరిగిన తప్పిదాలు, మృతికి ఖచ్చితమైన వైద్య కారణం దర్యాప్తులోనే తేలాల్సి ఉంటుంది.

ఈ విషాదం ఒక వ్యక్తి నిర్లక్ష్యానికి సంబంధించిన కేసుగా మాత్రమే మిగిలిపోకూడదు. గ్రామీణ భారతంలో వైద్య సేవల కొరత, అర్హతలేని వ్యక్తుల వైద్యచర్యలు, మందుల దుర్వినియోగం, నకిలీ లేదా నాసిరకం ఔషధాల సరఫరా వంటి సమస్యలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరాన్ని ఇది గుర్తుచేస్తోంది.

నగరాలతో పోలిస్తే మారుమూల గ్రామాల్లో వైద్యులు, పరీక్షా కేంద్రాలు, అత్యవసర సేవలు పరిమితంగా ఉంటాయి. సమీపంలో వైద్యుడు అందుబాటులో లేకపోవడం, రవాణా సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు ప్రజలను స్థానికంగా అందుబాటులో ఉన్న వ్యక్తులపై ఆధారపడేలా చేస్తున్నాయి. ఈ ఖాళీని అర్హతలేని వ్యక్తులు దుర్వినియోగం చేసే పరిస్థితికి ఇక ముగింపు పలకాలి.

ప్రతి గ్రామీణ ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను సిబ్బంది, మందులు, అత్యవసర పరికరాలతో బలోపేతం చేయాలి. తెలంగాణలో అమలులో ఉన్న క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టాన్ని క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేసి, ప్రైవేటు క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ కేంద్రాల రిజిస్ట్రేషన్, తనిఖీలను క్రమబద్ధీకరించాలి.

అర్హతలేని వ్యక్తులు వైద్యులుగా చలామణి కాకుండా జిల్లా స్థాయిలో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలి. ఇంజెక్షన్లు, ఐవీ చికిత్స వంటి అధిక ప్రమాదం కలిగిన వైద్యచర్యలను ఎవరు నిర్వహించవచ్చో స్పష్టంగా పర్యవేక్షించాలి. అత్యవసర పరిస్థితుల్లో రోగులను సమీప ఆసుపత్రికి తరలించే రిఫరల్ వ్యవస్థను కూడా బలోపేతం చేయాలి.

మరోవైపు ఔషధ నాణ్యతపై పర్యవేక్షణ మరింత కట్టుదిట్టం కావాలి. కేంద్ర ఔషధ ప్రమాణ నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) ఎన్ఎస్‌క్యూ, స్ప్యూరియస్ డ్రగ్స్‌పై క్రమం తప్పకుండా అలర్ట్‌లు విడుదల చేస్తోంది. రాష్ట్ర స్థాయిలో ఔషధ దుకాణాల తనిఖీలు, బ్యాచ్ నంబర్ల ట్రాకింగ్, అనుమానాస్పద మందుల తక్షణ ఉపసంహరణ వేగవంతం చేయాలి.

ఆరోగ్య సేవ అందుబాటులో లేకపోవడం ఒక సమస్య; అర్హతలేని వ్యక్తి చేతుల్లో ప్రాణం పెట్టాల్సిన పరిస్థితి మరింత తీవ్రమైన సమస్య. ఖమ్మం ఘటన నుంచి పాఠం నేర్చుకుని, నకిలీ వైద్యులపై కఠిన పర్యవేక్షణ, నాణ్యమైన గ్రామీణ వైద్యం, సురక్షిత ఔషధ సరఫరా వ్యవస్థను ప్రభుత్వం అత్యవసర ప్రాధాన్యంగా చేపట్టాలి. వైద్యం ప్రయోగం కాదు.. ప్రజల ప్రాణాలకు అది బాధ్యత.

# రేవంత్ ను గద్దె దించడమే మాల అమరులకు నిజమైన నివాళులు




హైద్రాబాద్ ఆగస్ట్ 11; రేవంత్ ను గద్దె దించడమే మాల అమరులకు నిజమైన నివాళులు అని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ అన్నారు. ఎస్సి వర్గీకరణకు వ్యతిరేకంగా 1997 ఆగస్టు 11వ తేదీన ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో మాల మహానాడు వ్యవస్థ అధ్యక్షులు పి వి రావ్ పిలుపు మేరకు ఛలో సెక్రటరియేట్ ముట్టడి లో అసువులు బాసిన గోపతోటి నారాయణ, పాణంగి శేషయ్య, రెడ్డి సుదర్శన్ లకు మాల మహానాడు నేడు హైదర్ గూడ ఎన్ ఎస్ ఎస్ ప్రెస్ క్లబ్ లో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పి వి రావ్ చిత్ర పటానికి పూల మాల వేసిన నివాళ్ళు అర్పించారు.అనంతరం డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ మాట్లాడుతూ మాల లకే కాదు ఎస్సి వర్గీకరణ తో పేద ఎస్సి ల అందరికి అన్యాయం చేసిన రేవంత్ సర్కార్, బాబు సర్కార్ లకు బాబాసాహెబ్ ఇచ్చిన ఓటు అనే ఆయుధం తో ఓడించి తగిన బుద్ధి చెప్పాలని తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ మాల లకు పిలుపు ఇచ్చారు. నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, డేవిడ్ అలియాస్ అద్దంకి దయాకర్ లు మొదటి నుండి విభీషణ పాత్ర పోసిస్తూ మాల కులాన్ని నాశనం చేస్తున్నారు అందులో భాగంగా నే కొంతమంది బ్రోకర్స్ తిరిగి మల్లు రవిని, గడ్డం వివేక్ ను కలవడం ధర్నాల పేరుతో మాల ల వ్యతిరేకతను తగ్గించే ప్రయత్నలు చేస్తున్నారు. కాబట్టి ఎట్టి పరిస్థితి లో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ కు మాలలు ఓటు వేయవద్దు అని డాక్టర్ పబ్బతి విజ్ఞప్తి చేశారు. ఒక వేల రేవంత్ సర్కార్ కు ఓటు వేస్తె మనల్ని మనం చంపుకోవడానికి వాళ్ళకు కత్తి ఇచ్చినట్లే అని శ్రీకృష్ణ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి లో ఉమ్మడి హైదరాబాద్ అధ్యక్షులు ఎ ఎన్ వినయ్ కుమార్ కాంటోన్మెంట్ ప్రధాన కార్యదర్శి ఎంజీ వినయ్ కుమార్ ముషీరాబాద్ అధ్యక్షులు కే శేఖర్, నాగరాజు, జెట్టి హరిభూషణ్, తదితరులు హాజరయ్యారు

### పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక దృష్టి

**పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను 15 రోజుల్లోగా పూర్తి చేయాలి**

**తరగతి గదిలో వంట చేయడం పట్ల కలెక్టర్ అసంతృప్తి..**

**వంట గదిలో మాత్రమే మధ్యాహ్న భోజనం తయారు చేయాలని ఆదేశం**

**పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి**

**విద్యార్థులకు ఆహ్లాదకరమైన, సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించాలి**

**రఘునాథపల్లి మండలం, కోమల్ల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆకస్మిక తనిఖీ**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

జనగామ మంగళవారం, జిల్లాలోని రఘునాథపల్లి మండలం, కోమల్ల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా సందర్శించి, పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, మౌలిక వసతులు, ఏకరూప దుస్తుల పంపిణీ, పారిశుద్ధ్యం, మధ్యాహ్న భోజన నిర్వహణ, తదితర అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని తరగతి గదులను సందర్శించి, విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. విద్యార్థుల అభ్యసన స్థాయి, పాఠ్యాంశాలపై వారి అవగాహనను పరిశీలించారు.5వ తరగతిలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు? అని హెడ్ మాస్టర్ ను అడుగగా, 13 మంది విద్యార్థులు ఉన్నట్లు కలెక్టర్ కు వివరించారు. అదే విధంగా పాఠశాలలో మొత్తం 45 మంది విద్యార్థులు ఉన్నట్లు హెడ్ మాస్టర్ ను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, తరగతి గదుల్లో బోధనా విధానం పర్యవేక్షించి, పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఏకరూప దుస్తులు అందాయా? అనిఉపాధ్యాయులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.అసంపూర్తిగా ఉన్న పాఠశాల అదనపు తరగతి గదుల భవనాన్ని పరిశీలించిన కలెక్టర్, గోడలు, విద్యుత్, తలుపుల ఏర్పాటు, ప్లాస్టరింగ్ వంటి నిర్మాణ పనులను 15 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.పాఠశాలలోని తరగతి గదిలోనే వంట చేస్తున్న విషయాన్ని గమనించిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుకునే తరగతి గదులను వంట కోసం వినియోగించడం సరికాదని తెలిపారు. మధ్యాహ్న భోజనం కోసం ఏర్పాటు చేసిన వంట గదిలోనే వంట చేయాలని ఆదేశించారు.వంట సమయంలో పొగ, వేడి, ఆహార పదార్థాల వల్ల తరగతి గదులు అపరిశుభ్రంగా మారడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచుతూ, విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన మధ్యాహ్న భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పాఠశాల ఆవరణ, టాయిలెట్స్, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో ఎక్కడా చెత్త, వ్యర్థాలు పేరుకుపోకుండా నిరంతరం శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని అదేశించారు.ఈ పరిశీలనలో హెడ్ మాస్టర్ జాన్, సర్పంచి, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం వీకే వర్క్‌షాప్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**- వీకే వర్క్‌షాప్ కార్మికులను కలిసిన నూతన ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి గట్టయ్య**

కొత్తగూడెం కొత్తగూడెం ఏరియాలోని వీకే వర్క్‌షాప్‌ను నూతన ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి గట్టయ్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్‌లోని అన్ని సెక్షన్ల కార్మికులు, పిట్ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వర్క్‌షాప్ హెచ్ఓడీ క్రిస్టోఫర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కార్మికుల సమస్యలపై చర్చించారు. వర్క్‌షాప్‌లో మ్యాన్‌పవర్ పెంపు, కార్మికులకు ప్లే డేలు, పీహెచ్‌డీలు పెంపు, క్యాంటీన్ హాల్ ఏర్పాటు, ఎలక్ట్రీషియన్లకు రైన్‌కోట్లు, ప్యాంట్, షర్ట్ అందజేత, ఈఓటీ యంత్రాలను త్వరగా సమకూర్చడం వంటి డిమాండ్లను ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా మహిళా కార్మికుల కోసం ప్రత్యేక రెస్ట్‌రూమ్, ఇండోర్ కార్మికులకు రెస్ట్‌రూమ్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్మికుల భద్రత, సౌకర్యాల విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని గట్టయ్య విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలపై వర్క్‌షాప్ హెచ్ఓడీ క్రిస్టోఫర్ సానుకూలంగా స్పందించారు. గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ కార్యదర్శిగా ఎన్నికైన గట్టయ్యకు అభినందనలు తెలిపారు. వర్క్‌షాప్ సమస్యలపై ఇప్పటికే ఉన్నతాధికారులతో చర్చిస్తున్నామని, త్వరలోనే సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. వర్క్‌షాప్ ఇంజినీర్లు డీవైఎస్ఈలు శంకర్, అనిల్‌కుమార్, ఉపేందర్‌బాబు గట్టయ్యను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అన్ని సెక్షన్లకు చెందిన కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన బ్రాంచ్ కార్యదర్శికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి మధుకృష్ణ, కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ బ్రాంచ్ ఆఫీస్ బేరర్ గుమ్మడి వీరయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్ గుమ్మడి మురళి, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ మెంగని రోషన్, పిట్ కమిటీ సభ్యులు సిద్దిరాల రాజకుమారస్వామి, పీఆర్‌సీ రెడ్డి, నరేష్, ప్రభాకర్, పరశురాములు, కస్తూరి రమేష్, అనూష, వెంకటదుర్గ, వసంతిక, రమణ, సంధ్యారాణి, శ్రీమన్నారాయణ, సత్యనారాయణ, ఈశ్వర్, మహేష్, యాకుబుద్దీన్, టీఆర్ఎస్ రాజు, రాజయ్య, బొజ్జ వెంకటస్వామి, అత్తహర్ పాషా, దుర్గ, హరీష్, సామ్యూల్ సుధాకర్, గోపాల్, వెంకట్, ఐఎస్ చిరంజీవి, సమ్మయ్య, తుమ్మల శ్రీనివాస్, మురళి, రమేష్, బాబాదిన్, కిరణ్, సలిగంటి శ్రీనివాస్, సముద్రాల శ్రీనివాస్, రహీం పాషా, ప్రకాష్, ప్రవీణ్, కళ్యాణ్, కుమార్, ఎల్లయ్య, అభిషేక్, ఉమామహేశ్వరరావు, జాన్సన్, గౌస్, అజ్గర్, రాజలింగయ్య, మోహన్, జయరాజు, చంద్రశేఖర్, చందూలాల్, యేసురత్నం, మోహన్‌లాల్, కిషన్, గోపీనాథ్, ప్రభాకర్, ట్రేడ్ అప్రెంటిస్‌లు పాల్గొన్నారు.



# జివో నంబర్ 3 కు ప్రత్యామ్నాయ జీఓ జారీపై హైపవర్ కమిటి వేసి కాలయాపన చెయ్యొద్దు చట్టబద్ధతకు తక్షణమే ఆర్డినెన్సు జారీ చెయ్యాలి




అరకులోయ జివో నంబర్ 3 కు ప్రత్యామ్నాయ చట్టంపై హై పవర్ కమిటీ పేరుతో కాలయాపన చేయవద్దని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అరకులో జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో జీఓ నెంబర్ 3 పై మాట్లాడిన విధానం చేసిన ప్రకటన కాలయాతనతో కాలం గడిపే విధంగా ఉందని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లోసురేంద్ర ,జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ అరకులో జరిగిన మీడియా సమావేశంలో డిమాండ్ చేశారు.అనంతరం మీడియా సమావేశంలో కిల్లో సురేంద్ర, పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అరకులో ఆగస్టు 10 తేదీన జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సభ సందర్భంగా జీఓ నంబర్ 3 కు ప్రత్యామ్నాయ చట్టం తీసుకురవడానికి హైపవర్ కమిటీ వేసి న్యాయ నిపుణులతో చర్చించి జీఓ నంబర్ 3 ప్రత్యామ్నాయ చట్టం తీసుకు రావాలని చెప్పడం ఆదివాసీ ప్రజలకు దగ చెయ్యడమే అవుతుందనీ విమర్శించారు గతంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి తో సాలూరులో ఆదివాసీ సంఘాల సమావేశంలో చర్చ జరిగిందని రంపచోడవరంలో గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం ఎం నాయక్ (ఐఎస్ఐ)తో చర్చలు జరిగిందని పాడేరు,రంపచోడవరం, పార్వతీపురం ఐటీడీఏల్లో గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సదా భార్గవి (ఐఏఎస్) తో వర్క్ షాప్ విర్వహించారని 2026 జూలై 28 న పాడేరు లో రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, అల్లూరి సీతారామరాజు,పోలవరం, మన్యం పార్వతీపురం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు ,ఉన్నత అధికారులు ఆదివాసీ ప్రజాసంఘాలు,ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపారని రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 3, 1/70 చట్టం పరిరక్షణకు స్పష్టమైన సమాధానం చెప్పకుండా ఇప్పుడూ చట్టబద్ధత లేని హై పవర్ కమిటితోనే జివో నంబర్ 3 కు ప్రత్యామ్నాయ చట్టం తెస్తామని మంత్రి ప్రకటన కాలయాపన చెయ్యడానికే తప్ప జివో నంబర్ 3 చట్టబద్ధతకు నిర్దిష్ట సమయంలో చట్టం చేసి ఆదివాసులకు 100% రిజర్వేషన్ కల్పించే విధంగా లేదని గతంలో గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శితో రంపచోడవరంలో జరిగిన ఆదివాసి సంఘాలతో నిర్వహించిన సమావేశం పాడేరు,రంపచోడవరం, పార్వతీపురం ఐటీడీఏల్లో నిర్వహించిన ప్రజాభిప్రయ సేకరణ ఏమైందని గిరిజన మంత్రి గుమ్మడి సంధ్యారాణి ని ప్రశ్నించారు హై పవర్ కమిటీ పేరుతో కాలయాపన చేయవద్దనీ తక్షణమే జీఓ నంబర్ 3 కు ప్రత్యామ్నాయంగా ఆర్డినెన్సు తీసుకుని రావాలని అక్టోబర్ నెలలో డీఎస్సీ నిర్వహణ ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో జీఓ నెంబర్ 3 కు ప్రత్యామ్నాయ జీఓ జారీకి ఆర్డిన్స్ తీసుకురావాలని ఆరు నెలల్లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు.

### రాజానగరం హైస్కూల్లో విద్యార్థులతో పనులు.

### పర్యవేక్షణ మరిచిన ఎంఇఓ

శిరివెళ్ల మండల పరిధిలోని రాజనగరం గ్రామంలో గల జిల్లా పరిషత్ హై స్కూల్లో విద్యార్థులతో తరచూ గ్రౌండ్ లోని ఇచ్చి మొక్కలను కలుపుగడ్డిని విద్యార్థులచే ఉపాధ్యాయులు దగ్గర ఉండి చేపిస్తున్నారు. విద్యాబుద్ధులు నేర్చుకుని ప్రయోజకులు కావాలని తల్లిదండ్రులు పాఠశాలకు పంపిస్తే రాజానగరం జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఉదయం బడి గంటల సమయంలోనే పనులు చేపించడం జరుగుతుంది. ఎంఈఓ 2 నాగార్జున రెడ్డి ఆన్లైన్ లో పాఠశాల సందర్శన పరిశీలన చూసుకోవడం తప్ప క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఏమాత్రం పట్టించుకోడు లేదన్న అపవాదు ఆరోపణలు విమర్శలు మండల విద్యాశాఖలో కొనసాగుతున్నాయి. పిచ్చి మొక్కలు గడ్డి మొక్కలు ఇతర ఫంగస్ అలర్జీ మొక్కల వల్ల విద్యార్థులు పలు శ్వాస కోసం వ్యాధులు చర్మవ్యాధులకు గురయ్యే అవకాశం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. తరచూ విద్యార్థులతో ప్లే గ్రౌండ్ లో చేపించడం బడి గంటలకు విద్యాబోధనకు స్వస్తి పలకడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి ఎంఈఓపై జిల్లా పరిషత్ హై స్కూల్ ఉపాధ్యాయులపై తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొంటున్నారు

# ఎస్ఐఆర్ ప్రక్రియలో ములుగు నియోజకవర్గం 100 శాతం పూర్తి

## 2,36,970 మంది ఓటర్లలో 2,09,128 మంది వివరాల డిజిటలైజేషన్

## జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 11 కలెక్టరేట్**ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ములుగు నియోజకవర్గంలో ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం జూన్ 25వ తేదీన ప్రారంభమైందని తెలిపారు. తొలి దశలో జూన్ 25 నుంచి జూన్ 30వ తేదీ వరకు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం జూలై 1 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించడంతో పాటు ఓటర్ల వివరాల పరిశీలన, ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను చేపట్టారని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, పరిశీలన, డిజిటలైజేషన్ ప్రక్రియను ములుగు నియోజకవర్గంలో నూరు శాతం పూర్తి చేసినట్లు వెల్లడించారు.



ములుగు నియోజకవర్గంలో మొత్తం 2,36,970 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,09,128 మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ చేసినట్లు తెలిపారు. ఇది మొత్తం ఓటర్లలో 88.25 శాతంగా ఉందని పేర్కొన్నారు.

మిగిలిన 27,842 మంది ఓటర్లను అన్‌కలెక్టబుల్‌గా గుర్తించినట్లు తెలిపారు. వీరిలో 8,354 మంది మరణించిన వారు, 4,015 మంది డబుల్ ఎంట్రీలు ఉన్నవారు, 14,207 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు, 1,219 మంది ఆచూకీ లభించని వారు ఉన్నారని వెల్లడించారు. అన్‌కలెక్టబుల్‌గా గుర్తించిన వారి శాతం 11.75 శాతంగా ఉందన్నారు. డిజిటలైజేషన్ పూర్తయిన 88.25 శాతం, వివిధ కారణాలతో అన్‌కలెక్టబుల్‌గా గుర్తించిన 11.75 శాతం కలిపి ములుగు నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులో సమర్థవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేసిన ఎన్నికల అధికారులు, ఈఆర్ఓ, ఏఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలను జిల్లా కలెక్టర్ అభినందించారు.

# అర్హులైన ఎస్సీ ఎస్టీలకు"డా. అంబేద్కర్ వైద్య సహాయ పథకం" ద్వారా వైద్య సహాయం:

## జిల్లా కలెక్టర్ మను చౌదరి

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఆగస్టు 11:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యొక్క భావజాలం మరియు తత్వాన్ని ప్రచారం చేయడం, అలాగే డాక్టర్ అంబేద్కర్ జన్మ శతాబ్ది ఉత్సవాల కమిటీ సిఫార్సుల నుండి ఉద్భవించిన కీలక సంక్షేమ పథకాలను నిర్వహించడం లక్ష్యంగా ఏర్పాటైన డాక్టర్ అంబేద్కర్ ఫౌండేషన్ భారత ప్రభుత్వ సామాజిక న్యాయ మరియు సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్థాపించబడిన స్వయంప్రతిపత్తి గల సంస్థ

జనవరి 2004 నుండి "డాక్టర్ అంబేద్కర్ వైద్య సహాయ పథకాన్ని" అమలు చేస్తోందని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ పథకం, అవయవ మార్పిడి, వెన్నెముక శస్త్రచికిత్సలు, కిడ్నీ, క్యాన్సర్, మెదడు సంబంధిత వ్యాధులతో సహా తీవ్రమైన ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న షెడ్యూల్డ్ కుల (ఎస్సీ) మరియు షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ) వర్గాలకు చెందిన రోగులకు కీలకమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని, వీరి వార్షిక కుటుంబ ఆదాయం 5,00,000/- (ఐదు లక్షల రూపాయలు మాత్రమే) కంటే తక్కువగా ఉండాలని, వ్యాధుల వారీగా గరిష్ట పరిమితి మొత్తం వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయని: -



గుండె శస్త్రచికిత్స - వ్యాధి
రూ. 1.50 లక్షలు
మూత్రపిండాల శస్త్రచికిత్స/డయాలసిస్ - రూ. 3.50 లక్షలు
క్యాన్సర్/శస్త్రచికిత్స/కీమోథెరపీ/రేడియోథెరపీ
రూ. 2.50 లక్షలు
బ్రెయిన్ సర్జరీ -
రూ. 2.00 లక్షలు
మూత్రపిండం/అవయవ మార్పిడి -
రూ. 3.50 లక్షలు
వెన్నెముక శస్త్రచికిత్స -
రూ. 1.50 లక్షలు
ఇతర ప్రాణాంతక వ్యాధులు
గరిష్ట పరిమితి (రూ.)
రూ. 2.00 లక్షలు

ఈ సంక్షేమ పథకం యొక్క పరిధిని, ప్రభావాన్ని విస్తృతం చేయడానికి, "డాక్టర్ అంబేద్కర్ వైద్య సహాయ పథకం"ను 2026లో సమగ్రంగా సవరించడం జరిగిందని, ఈ సవరణలు అర్హత గల వ్యాధుల పరిధిని మరియు ఎంప్యానెల్డ్ ఆసుపత్రులను విస్తరిస్తాయని అర్హులైన అభ్యర్థులు పోస్ట్ ద్వారా వైద్య సహాయం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తులను నిర్దేశించిన దరఖాస్తు ఫార్మాట్‌లో (ముద్రిత రూపంలో గానీ లేదా నిర్దేశించిన ప్రోఫార్మా ప్రకారం సాదా కాగితంపై ముసాయిదా రూపంలో గానీ) సమర్పించాలని, దరఖాస్తు మార్గదర్శకాలు, ఫారమ్‌లు మరియు మరిన్ని వివరాలు అధికారిక ణూఖీ వెబ్‌సైట్ నశీంయివ.స్త్రశీజ.ఱఅ సంప్రదించవలసి ఉంటుందని జిల్లా కలెక్టర్ వివరించారు.

# వైరా లయన్స్ క్లబ్ ఆఫ్ అవని ఆధ్వర్యంలో అల్పాహారం వితరణ...

## రానున్న రోజుల్లో జిల్లాల్లో లయన్స్ క్లబ్ ట్రస్ట్ ఏర్పాటు ..

## సేవ చేయడం అసలైన భాగ్యం డాక్టర్ కాపా మురళీకృష్ణ

**ఖమ్మం వైరా ఆగస్టు11 ప్రజాబలం:**నిరుపేద ప్రజలకు సేవ చేయడం మించిన భాగ్యం వేరే లేదని ఫాస్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ సూచించారు. వైరా లోని పాత బస్టాండ్ సెంటర్లో మహిళలయన్స్ క్లబ్ ఆఫ్ ఆవని ఆధ్వర్యంలో లయన్ సెక్రెటరీ సుగ్గల మాధవి విజయ్ దంపతుల కుమార్తె లిఖిత పుట్టినరోజు పురస్కరించుకొని మంగళవారం వందమందికి పైగా అల్పాహారాన్ని ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో దారిద్యానికి దిగువున ఎంతో మంది జీవిస్తున్నారని కనీసం వారికోసం ప్రతి ఒక్కరు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. అదేవిధంగా రానున్న రోజుల్లో జిల్లాలో లయన్స్ క్లబ్ ట్రస్ట్ ను ఏర్పాటు చేసి క్లబ్బులో ఉన్న సీనియర్ సభ్యులకు ఇన్సూరెన్స్ సౌకర్యం ప్రమాద భీమా ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. మహిళ లయన్స్ క్లబ్ సేవనందించడంలో ముందు కూడా చురుకైన పాత్ర వహించాలని ఆయన సూచించారు. ఈరోజు ఈ





కార్యక్రమం ఏర్పాటు చేయడం పట్ల ఆయన అవని మహిళా సభ్యులను అభినందించారు. కుమారి లికితకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎల్ సి ఎఫ్ ఐ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ రావు జిల్లా జిఈటి కోఆర్డినేటర్ ఉంద్రు శ్యాంబాబు జిల్లా క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ పెనుగొండ ఉపేందర్ రావ్ రీజియన్ చైర్మన్ నూకల శ్రీనివాసరావు రీజన్ సెక్రెటరీ వైబుచ్చిరామరావు జిల్లా కమిటీ సభ్యులు వనమా విశ్వేశ్వరరావు నూకల ప్రసాదరావు మాదినేని సునీత లయన్స్ క్లబ్ ఆఫ్ అవని అధ్యక్షురాలు గద్దెనీరజ సెక్రటరీ సుగ్గల మాధవి కోశాధికారి కొదుమూరి భాగ్యలక్ష్మి లయన్స్ క్లబ్ వైరా అధ్యక్షులు కొల్లా రాంబాబు సెక్రెటరీ కొదుమూరు రవి గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షులు ఉయ్యూరు రామకృష్ణ లయన్స్ సభ్యులు చెరుకూరి శ్రీనివాసరావు కొమిరిశెట్టి శ్రీధర్ మాదినేని దుర్గాప్రసాద్ వ జినేపల్లి చక్రవర్తి నాళ్ళ నాగేశ్వరరావు గజ్జల కృష్ణమూర్తిఅవని మహిళా సభ్యులు నాగమల్లేశ్వరి సునీత శేషు , రజిని విజయలక్ష్మి శ్రీవాణి విజయ రాణి శ్రావణి అరుణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణహిత నీటిని వినియోగించేందుకు తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించాలి

## సుందిళ్ల బ్యారేజీపై డ్యామ్ సేఫ్టీ సంస్థ నిర్ణయమే కీలకం..

## నిపుణులతో చర్చించి ప్రభుత్వానికి ప్రతిపాదన ఇవ్వాలి

హైదరాబాద్: తెలంగాణలో సాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రాణహిత జలాలను వినియోగించుకోవడం అత్యంత కీలకమని, అందుకు తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం చేయడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని పలువురు నిపుణులు, సాగునీటి ఉద్యమకారులు అభిప్రాయపడ్డారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రాణహిత నుంచి నీటిని వినియోగించుకునే తాత్కాలిక, దీర్ఘకాలిక మార్గాలను ప్రభుత్వం పరిశీలించాలని కోరారు.కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై భద్రతాపరమైన సమస్యలు ఉన్న నేపథ్యంలో, సంబంధిత డ్యామ్ సేఫ్టీ సంస్థలు ఇచ్చే సాంకేతిక నివేదికలు, నిర్ణయాలను ప్రభుత్వం తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. బ్యారేజీలను ఉపయోగించరాదని సాంకేతికంగా నిర్ణయించిన పరిస్థితుల్లో, సంబంధిత అధికారులైనా, మంత్రులైనా, ప్రభుత్వం అయినా స్వతంత్రంగా వాటిని వినియోగించడానికి నిర్ణయం తీసుకోకూడదని అన్నారు.బ్యారేజీలకు అవసరమైన మరమ్మతులు పూర్తయ్యాయని, భద్రతకు ఎలాంటి ప్రమాదం లేదని సంబంధిత నిపుణుల సంస్థలు స్పష్టంగా ధ్రువీకరించిన తర్వాత మాత్రమే వాటి వినియోగంపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

ప్రాణహిత జలాలే ప్రత్యామ్నాయం

మరోవైపు తెలంగాణలో నీటి అవసరాలను తీర్చగలిగే స్థాయిలో ప్రాణహిత నదిలో నీటి లభ్యత ఉందని, ఆ నీటిని వినియోగించుకోవడానికి తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం కీలకమని పేర్కొన్నారు.తుమ్మిడిహెట్టి నుంచి మైలారం వైపు ఇప్పటికే పెద్దమేరకు కాలువ నిర్మాణం పూర్తయిందని, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి, అవసరమైతే తాత్కాలికంగా మోటార్లు, పంపుల ద్వారా ప్రాణహిత నీటిని కాలువలోకి ఎత్తిపోసి వినియోగించుకునే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు.కాలువ వ్యవస్థను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి, భవిష్యత్తులో శాశ్వత పరిష్కారంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు.ఉమ్మడి ఆదిలాబాద్ అవసరాలకు తుమ్మిడిహెట్టి కీలకంఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, మంచిర్యాల తదితర ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలను ప్రస్తుత ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో తీర్చలేకపోతున్నాయని పేర్కొన్నారు. అందువల్ల తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ప్రాణహిత జలాలను వినియోగించుకోవడం ద్వారా ఈ ప్రాంతాలకు నీటి భద్రత కల్పించవచ్చని అన్నారు.తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో గతంలో జరిగిన ఆలస్యాన్ని ఇక కొనసాగించకుండా, ప్రభుత్వం తక్షణమే సాంకేతిక అధ్యయనం చేయించి నిర్మాణానికి సంబంధించిన స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# రాయదుర్గంలో డ్రగ్స్ పట్టివేత

హైదరాబాద్ ఎస్ఓటీ నార్సింగి టీమ్, రాయదుర్గం పోలీసులు సంయుక్తంగా కలిసి చేసిన ఆపరేషన్ లో మధురానగర్ లోని పోచమ్మ ఆలయం సమీపం లో ముగ్గురుని అదుపులోకి తీసుకున్నారు. బిహార్ కు చెందిన 23 ఏళ్ల కృష్ణ కుమార్ ను అదుపులోకి తీసుకోని 2.8 కిలోల ఎండు గంజాయి మరియు 6 గ్రాముల హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు.

స్వాధీనం చేసుకున్న గంజాయి మరియు హెరాయిన్ విలువ సుమారు రెండున్నర లక్షలు గా తెలిపారు. కృష్ణ కుమార్ హౌస్కీపింగ్ సూపర్వైజర్ గా పనిచేస్తు డ్రగ్స్ దందా నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. కృష్ణ కుమార్ వద్ద గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చిన బిహార్కు చెందిన కార్మికులు రోషన్, అభిషేక్ కుమార్లను సైతం పోలీసులు అదుపులోకు తీసుకుననారు. రోషన్, అభిషేక్ లకు యూరిన్ పరీక్షల్లో డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారించారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న ప్రధాన నిందితులు బంటి కుమార్, అమర్ కుమార్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.పరారీలో వున్న ఇద్దరినీ నిందితులను పట్టుకునేందుకు రంగంలోకి దిగిన పోలీసులు, ఎన్డీపీఎస్ యాక్టు క్రింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## తెలంగాణ స్వచ ఆటో, రిక్షా కార్మికుల ధర్నా

హైదరాబాద్ స్వచ్చ ఆటో, రిక్షా కార్మికులు మంగళవారం నాడు మాదాపూర్ లోని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ను ముట్టడించారు. దాదాపు వెయ్యిమంది కార్మికులు సిఎంసి కార్యాలయం ముట్టడించారు. పోలీసులు వారిని ప్రధాన గేటు వద్ద అడ్డుకున్నారు. కార్మికులు రాంకీ గో బ్యాక్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. సిఎంసి కమిషనర్ నిర్ణయాలు తమపొట్టకొట్టె విధంగా ఉన్నాయని... తమను యదా స్థితిలో కొనసాగించాలని డిమాండ్ చేసారు. స్వచ సిఎంసి పేరుతో చెత్త పన్ను తమకి దక్కకుండా ఆస్థి పన్నతోపాటు వసూలు చేయడం సరికాదు. తమ ఆటోలను యదాస్థితిలో కొనసాగించాలని.. ఎలక్ట్రికల్ ఆటోల పేరుతో తమ పొట్టకొట్టవద్దని కార్మికులు డిమాండ్ చేసారు.

# జహీరాబాద్ మీదుగానే బుల్లెట్ ట్రైన్

## ప్రతిపాదిత మార్గాన్ని మార్చొద్దు.. రైల్వే మంత్రికి ఎంపీ సురేష్ షెట్కర్ వినతి

**జహీరాబాద్, ఆగస్టు 11 ప్రజా బలం ప్రతినిధి:** హైదరాబాద్--ముంబై బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను ప్రతిపాదిత సంగారెడ్డి--జహీరాబాద్--షోలాపూర్ మార్గంలోనే కొనసాగించాలని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. ఈ మేరకు ఢిల్లీలో రైల్వే మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. తాండూరు--వికారాబాద్ మీదుగా మార్గాన్ని మళ్లించే ప్రత్యామ్నాయ ప్రతిపాదనలపై జహీరాబాద్ ప్రాంత ప్రజల్లో ఆందోళన నెలకొందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎన్ హెచ్ ఎస్ ఆర్ సి ఎల్ ప్రాథమిక డీపీఆర్‌లో పేర్కొన్న జహీరాబాద్ మార్గాన్నే కొనసాగించడం వల్ల ప్రాంత పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధికి మరింత ప్రయోజనం చేకూరుతుందని ఎంపీ వివరించారు. ఎన్ ఐ సి డి ఐ టి కింద అభివృద్ధి చేస్తున్న జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ కి బుల్లెట్ ట్రైన్ అనుసంధానం ఎంతో కీలకమని తెలిపారు. అలాగే, ప్రాథమిక డీపీఆర్ ప్రకారం జహీరాబాద్ మీదుగా వెళ్లే మార్గంలో నిర్మాణ వ్యయం తక్కువగా ఉండే అవకాశం ఉందని, భౌగోళిక ఇబ్బందులు కూడా తగ్గుతాయని పేర్కొన్నారు. ప్రాంతీయ సమతుల్య ఆర్థికాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని జహీరాబాద్ మీదుగా ప్రతిపాదించిన అసలు రూట్‌ను యథాతథంగా కొనసాగించేలా హామీ ఇవ్వాలని ఎంపీ సురేష్ షెట్కర్ రైల్వే మంత్రిని కోరారు.



# ఉద్యోగ అవకాశాల కోసం ఉపాధి పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

## మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా యువతకు జిల్లా ఉపాధి అధికారిణి సూచన

**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఆగస్టు 11:** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా పెద్ద పారిశ్రామిక క్లస్టర్‌గా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో జిల్లాలోని పరిశ్రమలు, ఐటీ సంస్థలు, లాజిస్టిక్స్, తయారీ రంగాల్లో ప్రతిరోజూ వివిధ ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని జిల్లా ఉపాధి అధికారిణి ఎం. రాధిక తెలిపారు.

జిల్లాలోని పరిశ్రమలు, సంస్థల్లో ఏర్పడే ఉద్యోగ ఖాళీలకు సంబంధించి సమాచారాన్ని జిల్లా ఉపాధి కార్యాలయానికి అందజేస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాలను అర్హులైన నిరుద్యోగ యువతకు చేరవేయడంతో పాటు, వారికి తగిన ఉద్యోగాలను సిఫారసు చేయడానికి యువత వివరాలు ఉపాధి కార్యాలయంలో నమోదు కావడం అవసరమన్నారు.

అందువల్ల మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత తప్పనిసరిగా తెలంగాణ ఉపాధి పోర్టల్ లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఉపాధి పోర్టల్‌లో నమోదు చేసుకోవడం ద్వారా జిల్లాలో నిర్వహించే ఉద్యోగ మేళాలు, అవగాహన కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలకు అర్హత ఆధారంగా ఎంపికయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

నమోదు చేసుకునే విధానం

యువత [www.employment.telangana.gov.in](http://www.employment.telangana.gov.in) వెబ్‌సైట్‌లోకి వెళ్లి జీశీఎ ావవవనివతీం ాశీస్త్రఅఅ పై క్లిక్ చేసి తమ వివరాలను నమోదు చేసుకోవాలి. అవసరమైన విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ తదితర వివరాలను నమోదు చేసి ప్రొఫైల్‌ను పూర్తి చేయాలని అధికారులు సూచించారు.

అర్హతలకు అనుగుణంగా అందుబాటులోకి వచ్చే ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు, ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొని ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని జిల్లా ఉపాధి అధికారిణి ఎం. రాధిక జిల్లా యువతకు పిలుపునిచ్చారు.

# చిన్నారుల మధ్య ఎమ్మెల్యే మట్టా రాగమయి జన్మదిన వేడుకలు.

## శుభాకాంక్షలు తెలియజేసిన రాయల రాము.



**ఖమ్మం/తల్లాడ ప్రతినిధి ఆగస్టు 11 ప్రజాబలం:** తల్లాడ మండలం శివాలయం కాలనీలో సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయల రాము ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మెల్యే మట్టా రాగమయికు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చిన్నారుల మధ్యలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. రాయల రాము మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాగమయి దయానంద్ కృషితో సత్తుపల్లి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని కొనియాడారు. ఇలాంటి పుట్టినరోజులు వంద సంవత్సరాలు సంతోషంగా జరుపుకోవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో తడికమల్ల వెంకటమ్మ, తడికమల్ల నరేంద్ర అభిమానులు, కార్యకర్తలు, చిన్నారులు, స్థానిక నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# మణికొండ జాగీర్ సర్వే 42 లో 1,450 గజాల భూమిని కాపాడండి



**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 11 ఆగస్టు 2026** మణికొండ జాగీర్ లోని సర్వే నెం.42 లోని 1,450 చదరపు గజాల భూమి విషయమై మంగళవారం రోజున శేరిలింగంపల్లి సబ్ రిజిస్ట్రార్ ను, నార్సింగి సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ ను, గండిపేట మండల తహసీల్దార్ ను, హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ అధికారులను కలువడం, తద్వారా సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం వినతి పత్రంలను అందజేయడం జరిగినదని ది సిటీజన్స్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు తెలిపారు. మణికొండ జాగీర్, పంచవటి కాలనీకి ఆనుకొని సర్వే నెం.42 లోని 1,450 చదరపు గజాల స్థలాన్ని గత 15 సంవత్సరాల నుండి ప్రభుత్వ భూమిగా సూచిస్తూ ఏర్పాటు చేసిన బోర్డును ఈ మధ్య ప్రైవేట్ వ్యక్తులు తొలగించినట్లు సమాచారం. ఆ బోర్డును ఏ ప్రక్రియ/ రికార్డుల ప్రకారం ఏర్పాటు చేశారో రెవెన్యూ అధికారులు సవివరముగా తెలియ పరచాలి, ఈ విషయంలో ఏదైనా సర్వే/ సరిహద్దుల నిర్ధారణ నిర్వహించారా ? తనిఖీ నివేదికలు/ ఫోటోలు, దాని తొలగింపుకు సంబంధించిన ఫిర్యాదులు లేదా నివేదికలు మరియు రెవెన్యూ అధికారులు తీసుకున్న చర్యలను సమర్పించండని, ప్రభుత్వ/పోరంబోకు భూమిగా వర్గీకరించ బడినప్పటికీ అట్టి భూమికి కంచె వేయక పోవడానికి లేదా మరే విధంగానైనా భౌతికంగా రక్షించక పోవడానికి నమోదు చేసిన ఫైల్ నోటింగ్స్/కారణాలను కూడా సమర్పించండని అడుగడమైనది. అందువల్ల దయచేసి 01.01.2005 నుండి సర్వే నెం.42 కు సంబంధించిన సంబంధిత పహానీ/ అడంగల్, 1-బి/ ఆర్.ఓ.ఆర్, మ్యుటేషన్ లేదా యాజమాన్య మార్పు/వర్గీకరణ, సర్వే, ఎఫ్.ఎం.బి మరియు ఇతర రెవెన్యూ రికార్డుల ధృవీకరించిన కాపీలను, ముఖ్యంగా 1,450 చదరపు గజాలకు సంబంధించిన రికార్డులను సమర్పించండని కొరడమైనది. ఇందుకు సంబంధించిన సర్వోత్తమన్యాయ స్థానంలోని డబ్ల్యు.పి. 25279/2026 కేసులో సర్వే నంబర్ 42 కు బదులుగా దానికి సంబంధించి 40/ఘుతీ, 41, 43/జుమీ, 43/జు, 43/2, 44/తూ, 50, 51, 52/తూ, 52/జు, 53/1, 54, 55, 56, 56/తూూ, 57/జు, 103/ౄ, 103/ౄ, 104 మరియు 105/జు వంటి అనేక సర్వే నంబర్ల ప్రస్తావన ఉందని, సర్వే నంబర్లు 40 మరియు 41కి సంబంధించిన రెవెన్యూ రికార్డుల ధృవీకరించ బడిన ప్రతులను హైదరాబాద్ కు చెందిన మిథిలా డెవలపర్స్ సుమారు 47,600 చదరపు గజాల భూమిని కొనుగోలు చేసినట్లుగా పేర్కొన్న రికార్డులు, అలాగే 15.04.1974 నాటి పుప్పలగూడ గ్రామ పంచాయతీ ద్వారా సర్వే నంబర్లు 40 మరియు 41లో మిథిలా డెవలపర్స్‌కు మంజూరైనట్లుగా పేర్కొన్న అనుమతికి సంబంధించిన రికార్డులను, రెవెన్యూ అధికారులు/ప్రభుత్వం తరపున దాఖలు చేసిన కౌంటర్-అఫిడవిట్/డిఫెన్స్ మరియు అన్ని అనుబంధాల ధృవీకరించిన కాపీలను సమర్పించండని కొరడమైనది. సర్వే నెం. 42, మణికొండ జాగీరు 1,450 చదరపు గజాల విస్తీర్ణం గల భూమికి సంబంధించిన తాజా ఎఫ్.ఎమ్.బి, గ్రామ పటం, సర్వే స్కెచ్, సేత్వార్/ ఆర్.ఎస్.ఆర్ మరియు ఇతర రెవెన్యూ రికార్డులు, ప్రభుత్వ/పోరంబోకు భూమిగా వర్గీకరించిన వివరాలు, నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చబడిన వివరాలు, వర్గీకరణ యొక్క ప్రస్తుత స్థితిని కూడా అందించండని కొరడ మైనది.

# విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యం.. మట్టా దంపతుల సేవలకు కలెక్టర్ ప్రశంసలు



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 11:** సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ జన్మదినం సందర్భంగా ఆషా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమం మంగళవారం సత్తుపల్లి జేవియర్ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు.

కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పుస్తకాలు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు బ్యాగులు, డిగ్రీ విద్యార్థులకు పుస్తకాలు, కళాశాల యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మట్టా దయానంద్ విద్యార్థులకు ప్రత్యేకంగా మోటివేషన్ క్లాస్ నిర్వహించి.. చదువు, మంచి నడవడిక, భవిష్యత్ లక్ష్యాలు, జీవితంలో సరైన నిర్ణయాల ప్రాధాన్యతపై దిశానిర్దేశం చేశారు. ఆషా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ.12 లక్షల విలువైన సేవా కార్యక్రమాలు చేపట్టడాన్ని కలెక్టర్ దివాకర్ అభినందించారు. సత్తుపల్లి నియోజకవర్గ విద్యా వ్యవస్థ అభివృద్ధిపై ఎమ్మెల్యే మట్టా రాగమయి, డాక్టర్ మట్టా దయానంద్ చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ అభినందనీయమని పేర్కొన్నారు.

విద్యార్థులకు విలువైన సందేశం అందించిన డాక్టర్ మట్టా దయానంద్, కలెక్టర్ దివాకర్‌లకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## నామ రవికిరణ్‌కు కౌన్సిలర్ల సన్మానం

### ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఎన్నికపై అభినందనలు



**జహీరాబాద్, ఆగస్టు 11 ప్రజాబలం ప్రతినిధి:** పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన నామ రవికిరణ్‌ను ఆయన మున్సిపల్ కౌన్సిలర్లు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జహీరాబాద్ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు పాల్గొని రవికిరణ్‌ను అభినందించారు. చిన్న వయసులోనే ఆర్యవైశ్య సంఘం వంటి ప్రతిష్ఠాత్మక సంస్థకు అధ్యక్షుడిగా ఎన్నిక కావడం గర్వకారణమని కౌన్సిలర్లు పేర్కొన్నారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సంఘం అభివృద్ధికి, సమాజ సేవకు మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, బిఆర్ఎస్ నాయకులు మహమ్మద్ యాకూబ్, అబ్దుల్లా, మైపాల్ యాదవ్, పాండు ముదిరాజ్, విశ్వేశ్వర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి జన్మదిన వేడుకలు

## మండల వ్యాప్తంగా పండుగల నిర్వహించిన పార్టీ శ్రేణులు.

## అన్నదానం,పండ్లు,నోట్ బుక్స్ పంపిణీ.

**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 ప్రజాబలం:**సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ జన్మదిన వేడుకలు తల్లాడ మండలంలో అత్యంత ఘనంగా, పండుగ వాతావరణంలో నిర్వహించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎమ్మెల్యే రాగమయి దయానంద్ మరిన్ని పుట్టినరోజులు





జరుపుకోవాలని, ఆమె నాయకత్వంలో సత్తుపల్లి నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని నాయకులు ఆకాంక్షించారు.

తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడుగునూరు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో తల్లాడలో జన్మదిన వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. అనంతరం తల్లాడ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్, ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేసి, పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ ముఖ్య నాయకులు, మండల అధికారులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు, యువకులు మరియు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామపంచాయతీ పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కంపూడి కిషోర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డైరీ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడుగునూరు లక్ష్మారెడ్డి, బిల్లుపాడు గ్రామ సర్పంచ్ ఎనిక కృష్ణవేణి నరసింహారావు, సామినేని రామప్పారావు, జక్కంపూడి రమేష్, మాజీ ఎంపీటీసీ రాందాస్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

తల్లాడ శివాలయం కాలనీలో సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయల రాము ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. రాయల రాము మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాగమయి దయానంద్ కృషితో సత్తుపల్లి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అభిమానులు, కార్యకర్తలు, చిన్నారులు, స్థానిక నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ఆర్థిక ఆరోపణలపై మంథని మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్ : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

## విధుల నిర్వహణలో నిర్లక్ష్యంపై శాఖాపరమైన చర్యలు

**పెద్దపల్లి, ఆగస్టు 11, ప్రజాబలం ప్రతినిధి :** మంథని మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీ కె.ఎన్. జయప్రకాశ్‌పై వచ్చిన ఆర్థిక ఆరోపణల నేపథ్యంలో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఆగస్టు 7న మంథని మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు కె.ఎన్. జయ ప్రకాశ్‌పై పలు ఆర్థిక ఆరోపణలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో వచ్చిన ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించి ప్రాథమికంగా విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రాథమిక విచారణలో విధుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం, విధుల పట్ల అంకితభావం లోపించడం, ప్రభుత్వ ఉద్యోగికి తగని ప్రవర్తన వంటి అంశాలు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ (ప్రవర్తనా) నిబంధనలు, 1964లోని రూల్ 3(1), 3(2) నిబంధనలను ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. శాఖాపరమైన విచారణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ (క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీల్) రూల్స్, 1991లోని రూల్ 20 ప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విచారణ పూర్తయ్యే వరకు తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ (జజూా) రూల్స్, 1991లోని రూల్ 8(1) ప్రకారం శ్రీ కె.ఎన్. జయ ప్రకాశ్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. సస్పెన్షన్ కాలంలో ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాన్ని విడిచి వెళ్లరాదని ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. నిబంధనల ప్రకారం సస్పెన్షన్ కాలంలో జీవనాధార భత్యంతో పాటు డి.ఏ. మరియు ఇతర పరిహార భత్యాలు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు.



ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది నిబంధనలకు అనుగుణంగా విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా, అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

# ప్రభుత్వ హాస్టలలో నిర్లక్ష్యపు నీడలు.. పర్యవేక్షణ కరువు..

## హాస్టల్‌లో ఎలుకల బీభత్సం ఐదుగురు బాలికలను కొరికిన ఎలుకలు..అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 11:** తెలంగాణ ప్రభుత్వం పిల్లల భవిష్యత్తు చూస్తే ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హాస్టల్ నిర్వహణపై కొందరు నిర్లక్ష్యం ధోరణితో పలు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. హాస్టల్ వార్డెన్స్ సరైన సమయంలో విధులను ఉండక ఇష్టానుసారం విధులకు హాజరవుతూ ఉండటంతో పిల్లల పర్యవేక్షణ కనీసం మెనూపరంగా కూడా వారికి భోజనం లభించిన పరిస్థితి ఏర్పడుతుంది. పెనుబల్లి మండలం అడవి మల్లెల గురుకుల పాఠశాల బాలికల వసతి గృహంలో ఎలుకలు బీభత్సం సృష్టించాయి. రాత్రి సమయంలో హాస్టల్‌లో నిద్రిస్తున్న ఐదుగురు బాలికలను ఎలుకలు కొరకడంతో వారు గాయపడ్డారు. దీంతో హాస్టల్‌లోని విద్యార్థినుల్లో భయాందోళన నెలకొంది.



ఎలుకల దాడిలో గాయపడిన బాలికలను వెంటనే లంకసాగర్ పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. హాస్టల్‌లో పారిశుద్ధ్య నిర్వహణ, ఆహార నిల్వలు, పరిసరాల పరిశుభ్రతపై తగిన శ్రద్ధ లేకపోవడం వల్లే ఎలుకల బెడద పెరిగిందని తల్లిదండ్రులు, స్థానికులు ఆరోపిస్తున్నారు.

బాలికల వసతి గృహంలోనే విద్యార్థినుల భద్రతకు ముప్పు ఏర్పడటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి హాస్టల్‌లో ఎలుకల నివారణ చర్యలు చేపట్టి, విద్యార్థినుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# ఫించను పథకానికి కొత్త ధరఖాస్తులు : రామగుండం మేయర్ మహంకాళి స్వామి




**పెద్దపల్లి/గోదావరిఖని, ఆగస్టు -11, ప్రజాబలం ప్రతినిధి :**అర్హత ఉన్న ప్రతి ఒక్కరు చేయూత ఫించను పథకం ద్వారా లబ్ది పొందేలా డివిజన్ లలో విస్తృత అవగాహన కల్పించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి వార్డు అధికారులను కోరారు. చేయూత ఫించను పథకానికి సంబందించి కొత్తగా ధరఖాస్తులు స్వీకరించడానికి ప్రభుత్వం నుండి ఉత్తర్వులు జారీ అయిన నేపథ్యంలో రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో వార్డు అధికారులకు ఓరియెంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా ఏళ్ల తర్వాత కొత్త ఫించన్లకు మార్గం సుగమం అయిన నేపథ్యంలో కార్పొరేటర్ల సమన్వయంతో వాడ వాడలా విస్తృత ప్రచారం చేసి అర్హుల నుండి ధరఖాస్తులు స్వీకరించాలని అన్నారు. ఆదాయ ధృవీకరణ పత్రాలు , మరణ ధృవీకరణ పత్రాలు , వైద్య ధృవీకరణ పత్రాలు , ఇతర అవసరమైన డాక్యుమెంట్ లు ఆయా కార్యాలయాలు త్వరితగతిన జారీ చేసేలా సంబందిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయ పరిధిలో ఇప్పటికే 19,659 మంది చేయూత ఫించను పొందుతుండగా మరో రెండు వేల అరవై ఎనిమిది ధరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు . ఆ ధరఖాస్తుల విచారణ కూడా వెంటనే పూర్తి చేసి అర్హులను గురించి ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. పొరపాట్లకు, అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా విచారణ పూర్తి చేయాలని అన్నారు. ఫైలేరియా , డయాలసిస్ బాధితులకు కూడా ఫించన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని అన్నారు. స్థానిక ఫైలేరియా , డయాలసిస్ బాధితుల జాబితా చుట్టు ప్రక్కల అన్ని ఆసుపత్రుల నుండి తెప్పించి వారికి అవగాహన కల్పించి అర్హత ఉన్న వారితో ధరఖాస్తు చేయించాలని అన్నారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణశ్రీ మాట్లాడుతూ ప్రస్తుతం వితంతు , ఒంటరి మహిళ, దివ్యాంగులు, చేనేత, గీత కార్మికులు, డయాలసిస్, ఫైలేరియా బాధితులు కొత్త ఫించన్ల మంజూరు కోసం ధరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. ధరఖాస్తుతో పాటు అవసరమైన అన్ని పత్రాలు జత పరిచి వార్డు అధికారికి లేదా రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో అందజేయాలని అన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, తాజా ఆదాయ ధృవీకరణ పత్రం (2026-27) ప్రతి ధరఖాస్తుతో పాటు విధిగా జత చేయాలని అన్నారు. వితంతువులు భర్త మరణ ధృవీకరణ పత్రం , ఒంటరి మహిళలు విడాకుల పత్రం , దివ్యాంగులు సదరమ్ ధృవీకరణ పత్రం , గీత కార్మికులు కల్లుగీత సొసైటి సభ్యత్వం, ఎక్సయిజ్ శాఖ ధృవీకరణ పత్రం , చేనేత కార్మికులు జౌళి శాఖ ధృవీకరణ పత్రం జత చేయాల్సి ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, సెక్రెటరీ మహేశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, ఫించను విభాగం ఇంచార్జ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.



# విశారదన్ మహారాజ్ ఆధ్వర్యంలో ధర్మ సమాజ్ పార్టీ లో చేరిన ఉస్మానియా విద్యార్థి నాయకుడు సంతోష్ నాయక్



వెల్దండ(భారత్ సమాచార్ ):వెల్దండ మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామ పంచాయతీ ఈదమ్మ బండ తాండ కి చెందిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు సంతోష్ నాయక్ ను హైద్రాబాద్ లోని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యాలయం లో విశారదన్ మహారాజ్ కండువా వేసి పార్టీ లో కి ఆహ్వానించారు .

ఈ సందర్భంగా సంతోష్ నాయక్ మాట్లాడుతూ బహుజన విద్యార్థుల కోసం నిరంతరం పోరాటం చేస్తానని, ధర్మ సమాజ్ పార్టీ, బీసీ, ఎస్సి, ఎస్టి లను బలోపేతానికి కృషి చేస్తానని, బహుజన రాజ్య స్థాపన కోసం ఉద్యమిస్తానని అన్నారు.

# ఎంయస్ఎంఈ చట్ట సవరణ బిల్లు లోక్సభలో ఆమోదం..



**కూకట్పల్లి (ప్రజాబలం ) ఆగస్టు 11:**సూక్ష్మ మధ్య తరహా పరిశ్రమల(ఎంయస్ఎంఈ) అభివృద్ధి చట్టం 2026 సవరణ బిల్లుకు లోకసభ ఆమోదం తెలిపిన నేపథ్యంలో బాలానగర్ లోని ఎంయస్ఎంఈ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఎంయస్ఎంఈ డి ఫ్ ఒ జాయింట్ డైరెక్టర్ సి.శివ శేషగిరి రావు మాట్లాడుతూ 20 ఏళ్ల తర్వాత ఇప్పుడు చేసిన సవరణ బిల్లు లో చట్టపరమైన వ్యవస్థ ,వ్యాపార సౌలభ్యం, సమస్యల పరిష్కారం లాంటి అంశాలు త్వరగా పరిష్కారం అవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సవరించిన చట్టంలో పెట్టుబడి,టర్నోవర్ ఆధారంగా ఎంయస్ఎంఈ వర్గీకరణను చట్టబద్ధం చేయడం, ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం కోసం ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. ఉద్యమ్ పోర్టల్ లో రిజిస్ట్రేషన్ చేసుకున్నాక గడిచిన మూడేళ్లలో 1.65 కోట్ల నుంచి వినియోగదారులు 9.16 కోట్లకు పెరిగాయని ,దేశ వ్యాప్తంగా 40కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు.

## ప్రకృతి వనంలోని చెట్ల విక్రయం పై వివాదం

## పంచాయతీ తీర్మానం లేకుండానే అమ్మేశారు అంటూ ఆరోపణ



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 11 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** అందోల్ మండలం పోసానిపేట,గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో చెట్లు మొక్కలను, గ్రామపంచాయతీ తీర్మానం లేకుండానే, విక్రయించారని ఆరోపణలు వెలువడ్డాయి, గ్రామ సర్పంచ్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకొని, తనకు వచ్చిన ధరలకు చెట్లను విక్రయించారని, గ్రామ ఉపసర్పంచి జి,రాములు, ఆరోపించారు, పల్లె ప్రకృతి వనంలో పెరిగిన చెట్లను, తొలగించడం లేదా విక్రయించడం జరిగితే, అందుకు సంబంధించిన అనుమతులు గ్రామపంచాయతీ తీర్మానం, విక్రయించిన చెట్ల సంఖ్య, నిర్ణయించిన ధర, వచ్చిన ఆదాయం తదితర వివరాలను, అధికారులు పరిశీలించాలని, ఆయన కోరారు, ఈ వ్యవహారంపై సంబంధిత పంచాయతీరాజ్ అధికారులు, సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా చెట్ల విక్రయం జరిగితే, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని, ఉప సర్పంచ్ జీ.రాములు, డిమాండ్ చేశారు.

# విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ..



**ఖమ్మం/తల్లాడ ఆగస్టు 11 ప్రజాబలం:**సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ జన్మదినం సందర్భంగా మంగళవారం తల్లాడ మండలంలోని మంగాపురం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ నరసింహారావు, ఉప సర్పంచ్ గుజ్జర్లపూడి చింటూ చేతులమీదుగా విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు ఈ కార్యక్రమం చేయడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ప్రజలందరికీ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం రామిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



**జహీరాబాద్ ఆగస్టు 11 ప్రజాబలం ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. జహీరాబాద్ వైపు వెళ్తున్న కారును వెనుక నుంచి మరో వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో వరుసగా వాహనాలు ఢీకొనడంతో నాలుగు కార్లు ధ్వంసమయ్యాయి. ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో ములుగు నియోజకవర్గం 100 శాతం పూర్తి

## 2,36,970 మంది ఓటర్లలో 2,09,128 మంది వివరాల డిజిటలైజేషన్

## జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

**ప్రజాబలం ప్రతినిధి ములుగు జిల్లా 11 ఆగస్టు :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ములుగు నియోజకవర్గంలో ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం జూన్ 25వ తేదీన ప్రారంభమైందని తెలిపారు. తొలి దశలో జూన్ 25 నుంచి జూన్ 30వ తేదీ వరకు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం జూలై 1 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించడంతో పాటు ఓటర్ల వివరాల పరిశీలన, ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను చేపట్టారని తెలిపారు.

ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, పరిశీలన, డిజిటలైజేషన్ ప్రక్రియను ములుగు నియోజకవర్గంలో నూరు శాతం పూర్తి చేసినట్లు వెల్లడించారు.

ములుగు నియోజకవర్గంలో మొత్తం 2,36,970 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,09,128 మంది ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ చేసినట్లు తెలిపారు. ఇది మొత్తం ఓటర్లలో 88.25 శాతంగా ఉందని పేర్కొన్నారు.

మిగిలిన 27,842 మంది ఓటర్లను అన్కలెక్టబుల్గా గుర్తించినట్లు తెలిపారు. వీరిలో 8,354 మంది మరణించిన వారు, 4,015 మంది డబుల్ ఎంట్రీలు ఉన్నవారు, 14,207 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు, 1,219 మంది ఆచూకీ లభించని వారు ఉన్నారని వెల్లడించారు. అన్కలెక్టబుల్గా గుర్తించిన వారి శాతం 11.75 శాతంగా ఉందన్నారు.

డిజిటలైజేషన్ పూర్తయిన 88.25 శాతం, వివిధ కారణాలతో అన్కలెక్టబుల్గా గుర్తించిన 11.75 శాతం కలిపి ములుగు నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులో సమర్థవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేసిన ఎన్నికల అధికారులు, ఈఆర్ఓ, ఏఈఆర్ఓలు, సూపర్వైజర్లు, బీఎల్ఓలను జిల్లా కలెక్టర్ అభినందించారు.

# పంచలింగాల్ గ్రామంలో ఘనంగా బోనాల పండుగ సంబరాలు



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 11 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పంచలింగాల్ గ్రామంలో ఘనంగా అంగరంగ వైభవంగా బోనాల పండుగ సంబరాలు శివసతులతో వాయిద్యాలయం ముందు నాట్య ప్రదర్శనలు చేస్తూ బ్రహ్మాండమైన వీరగోళలు డల్లు డల్లు డల్లుమనిపిస్తూ ప్రజలను మైమరిపించేలా విన్యాసాలు చేస్తూ బ్రహ్మాండంగా వారు బోనాల పండుగ నిర్వహించినట్టు గ్రామ పెద్దలు సంతోషం వ్యక్తపరిచారు గ్రామ పెద్దల సమక్షంలో అక్కలు అమ్మలు అందరూ కలిసి నైవేద్యాలతో బోనాలు సమర్పించి అమ్మవారికి శాంతి పూజలు జరిపించి రంగ రంగ వైభవంగా సంతోషంగా బోనాల పండుగ జరుపుకున్నట్టు గ్రామ పెద్దలు యువకులు నాయకులు పెద్దలు సంతోషం వ్యక్తపరిచారు





Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com